అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com
మంగళవారం 22-10-2024
14 పేజీలు వెల : 6.50

సంపుటి : 10 సంచిక : 293 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar



బీజేపీవి మహిళా వ్యతిరేక

త్రిశూల్ విధానాలు

వాటితో ముప్పేట దాడి | వ్యతిరేకిస్తూ సమరశీల ఉద్యమాలు కొనసాగించాలి

మనువాదం, పెట్టుబడిదారీ విధానాలను తిప్పికొట్టాలి :
ఐద్వా బహిరంగ సభలో సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు బృందాకారత్ పిలుపు

కొత్తగూడెం నుంచి ఎస్.వెంకన్న


ఆరెస్సెస్ నాయకత్వంలో నడుస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక 'త్రిశూల' విధానాలను అవలంబిస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నేత, రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్ ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరించటం, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, మహిళలను తిరోగమన భావజాలం వైపు నడిపించటమనేవే ఆ త్రిశూల విధానాలని ఆమె విశ్లేషించారు. వీటి ద్వారా దేశంలోని మహిళలపై బీజేపీ ముప్పేట దాడిని కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్యవంతమైన, సంఘటిత, సమరశీల పోరాటాల ద్వారా ఆయా విధానాలను తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు కొనసాగే ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభలు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పట్టణంలో ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో బృందాకారత్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. దేశంలో ఒక్క శాతంగా ఉన్న కార్పొరేట్ అధిపతులు...40 శాతం ...14లో

మహిళలు ఈ దేశ పౌరులు కాదా?



- మోడీ హయాంలో యథేచ్ఛగా హింస
- ఇది మహిళా వ్యతిరేక ప్రభుత్వం
- ఆహార భద్రతను తుంగలో తొక్కిన కేంద్రం
- పౌష్టికాహార లేమితో రోగాల పాలవుతున్న మహిళలు : ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం ధావలే, వీకే శ్రీమతి

వివరాలు 14లో



సోషలిస్టు,సెక్యులర్

రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకం

- భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?
- పిటిషనర్‌కు సుప్రీంకోర్టు ప్రశ్న
- తదుపరి విచారణ18కి వాయిదా

న్యూఢిల్లీ: సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) పదాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకమైనవని ఇప్పటికే ఎన్నో తీర్పులు నొక్కి చెప్పాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పీఠిక నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.

పిటిషనర్, న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తన వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగానికి 1976లో చేపట్టిన 42వ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో కోర్టులు పలుమార్లు ఇవి రాజ్యాంగంలోని ప్రాథమిక భాగాలుగా అభివర్ణించినట్టు వెల్లడించారు.

మరోలా చూడొద్దు

"సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే" అని ఖన్నా ...13లో



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

ముత్యాలమ్మ గుడి ఘటనపై సీఎం హెచ్చరిక

- పోలీసులకు భారీగా పరిహారం పెంపు
- ట్రాఫిక్ నియంత్రణకు ఏఐని వినియోగిస్తాం : పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి/ ధూల్‌పేట

శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తూ ఉన్మాదంతో మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ ఫ్లాగ్ డే కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు సవ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమనీ, ఇందుకు ఎవరు మోకాలొడ్డినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముత్యాలమ్మ గుడి ఘటనలో దోషులను అరెస్టు చేశామని చెప్పారు. నిందితులను తామే శిక్షిస్తామంటూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించేవారిని ఎలా అనుమతి స్తామని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పోలీసులకు భారీగా పరిహారం పెంపు

శాంతిభద్రతల పరిరక్షణలో అనేక మంది పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలు ఎనలేనివని సీఎం కొనియాడారు. ఈనేపథ్యంలో వారికి ఇస్తున్న పరిహారాన్ని కూడా భారీగా పెంచుతున్నామని సీఎం ప్రకటించారు. కానిస్టేబుల్ , ఏఎస్ఐ స్థాయి వరకు రూ. కోటి, ఎస్సై నుంచి సీఐ వరకు రూ. కోటి 25 లక్షలు, డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీ వరకు రూ. కోటి 50లక్షలు, ఎస్పీ ఆపై స్థాయి అధికారులకు రూ. 2 కోట్ల వరకు చెల్లిస్తామని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారిలో కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు రూ.50 లక్షలు, డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీ వరకు రూ. 60 లక్షలు, ఎస్పీ ఆపై స్థాయి అధికారులకు రూ. కోటి చెల్లిస్తామన్నారు. ఇంకా తీవ్ర గాయాలపాలైన కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు రూ.50 లక్షలు, డీఎస్పీ నుంచి ఎస్పీ వరకు రూ.10 లక్షలు, ఆపై స్థాయి అధికారులకు రూ.12లక్షల వరకు నష్ట పరిహారం పెంచినట్టు సీఎం ...6లో

సాయిబాబా గొప్ప విప్లవకారుడు



నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని ధారపోసాడు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- ఎర్రజెండాలు కలవాల్సిన రోజులొచ్చాయి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- ప్రశ్నించేవారిపై అర్బన్ నక్సల్స్ అని ముద్ర : రచయిత్రి మీనా కందసామి
- నడవలేకపోయినా సమాజానికి నడక నేర్పారు : ప్రొఫెసర్ హరగోపాల్
- వ్యవస్థలోని అన్యాయాలను ఎదిరించిన వ్యక్తి సాయిబాబా : వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

వివరాలు 3లో

కోప్రి అడువుల్లో కాల్పులు

- ఐదుగురు మావోయిస్టులు మృతి
- కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-చర్ల

ఇటు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటు మహారాష్ట్రను ఆనుకుని ఉన్న భమ్రాగఢ్ తాసిల్‌లోని కోప్రి అడవుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఒక జవానుకు తీవ్రగాయాలైనట్టు పోలీసు ఉన్నతాధికారులు ధ్రువీకరించారు. పోలీసు అధికారులు తెలిపిన ...13లో

మూసీపై పూటకోమాట

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్ ఫైర్
- కుట్రలను బట్టబయలు చేస్తామని హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ ప్రక్షాళనకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఈ మేరకు ...13లో

ఆర్డర్లు ముందే సిద్ధం చేసుకున్నారా?

టీజీఈఆర్సీకి విద్యుత్‌రంగ నిపుణులు ఎమ్ వేణుగోపాలరావు చురకలు

- మొక్కుబడిగా బహిరంగ విచారణలు
- జెన్‌కో ట్రూఅప్ ప్రతిపాదనలపై పిటీషనర్ల అభ్యంతరాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) ముందస్తుగా ఆర్డరు కాపీలు సిద్ధం చేసుకుని, కేవలం మొక్కుబడి కోసం బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని విద్యుత్‌రంగ నిపుణులు, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎమ్ వేణుగోపాలరావు అన్నారు. ఆర్థిక సంవత్సరం 2022-23కు సంబంధించి టీజీ జెన్‌కో ప్రతిపాదించిన ట్రూఅప్ చార్జీలు, 2024-25 నుంచి 2028-29 ఆర్థిక ...6లో

ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్‌ల సరఫరా ఆపాలి

భారత ప్రతిష్టను పునరుద్ధరించాలి : కేంద్రానికి సీపీఐ(ఎం) డిమాండ్

మన విదేశాంగ విధానాన్ని మార్చాలి : ధర్నాలో ఎస్.వీరయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ సర్కార్ తన విదేశాంగ విధానాన్ని మార్చుకుని, భారతదేశ ప్రతిష్టను పునరుద్ధరించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఇజ్రాయిల్‌కు అదానీ ఏరో అండ్ డిఫెన్స్ కంపెనీ హెర్మస్ 900 అనే డ్రోన్లను సరఫరా చేయడాన్ని నిరసిస్తూ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని పహాడీ షరీఫ్‌లో గల అదానీ మిసైల్స్ భవనం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. "ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్ల ఎగుమతిని నిలపాలి. భారత ప్రభుత్వం కపటత్వం విడనాడాలి" అనే బ్యానర్‌ను ప్రదర్శిస్తూ గంటకుపైగా నిరసన తెలిపారు. ప్రపంచశాంతిని కాపాడాలి, ప్రధాని మోడీ వైఖరిని మార్చుకోవాలి, మోడీ అవలంబిస్తున్న విదేశాంగ విధానం నశించాలి. సామ్రాజ్య వాదం నశించాలి, సోషలిజం వర్ధిల్లాలి, యుద్ధం వద్దు-శాంతి ముద్దు, పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను నిలిపేయాలంటూ ఈ సందర్భంగా కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ ప్రపంచశాంతికి హానికరంగా తయారైన ఇజ్రాయిల్ పాలకులు పాలస్తీనా ప్రజలను ఊచకోతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం కేవలం ఇజ్రాయిల్-పాలస్తీనాలకే పరిమితం కాకుండా ఇరాన్ తదితర దేశాలను యుద్ధంలోకి లాగుతూ ప్రాంతీయ యుద్ధంగా మారుస్తున్న దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ కొన్ని ఏండ్లుగా పాలస్తీనా భూభాగంలో ఆక్రమణకు తెగపడుతున్నదని విమర్శించారు. భారతదేశం ఎప్పుడూ పాలస్తీనా వైపే నిలబడిందనీ, అయితే మోడీ అధికారంలోకి వచ్చాక తన విదేశాంగ విధానాన్ని మార్చారని తెలిపారు. ఇజ్రాయిల్‌ను సమర్థించే స్థాయికి మన ప్రతిష్టను దిగజార్చారని చెప్పారు. మారణ హోమానికి అండగా నిలబడటం అమానవీయమని తప్పుపట్టారు. మొదట్నుంచి మోడీ సర్కారుకు అదానీ, అంబానీలు కుడి, ఎడమ భుజాలుగా ఉన్నారనీ, వారు వ్యాపారం చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని, అదానీ సరఫరా చేస్తున్న డ్రోన్‌లతో ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలపై దాడికి పాల్పడుతున్నదని, అందుకే అదానీ డ్రోన్లను ఇజ్రాయిల్‌కు సరఫరా చేయడం నిలిపివేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు వివరించారు.

మోడీ ప్రభుత్వం డ్రోన్ల సరఫరాపై నిషేధం విధించి, పాలస్తీనాకు, మైనార్టీల హక్కులకు అండగా నిలబడాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు సహకరించడం మానుకోవాలనీ, పాలస్తీనాపై దాడులను ఖండించాలనీ, ఐక్యరాజ్యసమితిలో వెనుకబడిన దేశాలను కూడగట్టి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడాలని కోరారు. ఒకవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడి పాలస్తీనాపై దాడులను ఖండిస్తుంటే, సీఎం ...13లో

25 నుంచి నారెడ్కో ప్రాపర్టీ షో



నవ తెలంగాణ - హైదరాబాద్

రియల్ ఎస్టేట్ వర్గాల అసోసియేషన్ నారెడ్కో హైదరాబాద్‌లో ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తోన్నట్లు ప్రకటిం చింది. అక్టోబర్ 25 నుంచి 27 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు నారెడ్కో తెలంగాణ ప్రెసిడెంట్ విజయ సాయి మేకా, సెక్రటరీ జనరల్ కె శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలో ఆ సంస్థ ట్రెజరర్ ఆర్ వెంకటేశ్వర రావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్‌వై కిరణ్‌లతో కలిసి వారు మీడియాతో మాట్లా డుతూ.. ఈ ప్రాపర్టీ షోలో రెరా ఇతర ప్రభుత్వ రెగ్యూలేటరీ అనుమతులు ఉన్న క్లియర్ ప్రాపర్టీలను మాత్రమే ప్రదర్శనకు ఉంటాయన్నారు. 100 మంది డెవలపర్లు తమ అనేక ప్రాజెక్టులను ఇక్కడ అందుబాటులోకి తేనున్నారని విజయ సాయి, శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఐదు ఫైనాన్స్ సంస్థలు, మరో ఐదు సప్లయి సంస్థలు భాగస్వామం అవుతున్నాయని వెల్లడించారు.

అనుమతులున్న వాటిని హైడ్రా కూల్చలేదు

హైదరాబాద్ రియాల్టీకి ఢోకా లేదని విజయ సాయి, శ్రీధర్ రెడ్డి అన్నారు. అన్ని అనుమతులు కలిగిన ప్రాపర్టీలను హైడ్రా ఎక్కడ కూల్చలేదని తెలిపారు. హైడ్రా కూల్చివేతలపై కొన్ని సోషల్ మీడియాల్లో తప్పుడు వార్తలు వస్తోన్నాయని అన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి కూడా స్పందించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. రియాల్టీ ప్రస్తుతం కొంత స్తబ్దతలో ఉన్నప్పటికీ తొందరలోనే పుంజుకోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించిందని.. దీంతో రియల్ ఎస్టేట్‌కు మరింత మద్దతు లభించనుందన్నారు. నగరం ఒక్క సారి గ్లోబల్ సిటీగా అవతరిస్తే.. ఆ అభివృద్ధిని ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు.

నిమిషం ఆలస్యం... అనుమతి నిరాకరణ

గోడ దూకి వెళ్లిన ఓ అభ్యర్థిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ బ్యూరో/విలేకర్లు - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ తొలిరోజు తొలి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మొత్తం 5613 మంది అభ్యర్థులు గాను 4896 మంది హాజరయ్యారు. 717 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కాగా పలు చోట్ల పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పోలీసులు కేంద్రాల్లోకి అనుమతిం చలేదు. కోఠిలోని మహిళ విశ్వవిద్యా లయంలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శి ంచి.. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. ఎగ్జామ్స్ సందర్భంగా తీసుకో వాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. సికింద్రా బాద్‌లోని పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన మాథ్యూస్ అనే అభ్యర్థిని పోలీసులు అనుమతించలేదు. దీంతో అతను గోడ దూకి పరీక్ష కేంద్రం వైపు పరు గులు పెట్టాడు. ఇది గమ నించిన పోలీసులు అతన్ని అదు పులోకి తీసు కుని బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక మేడ్చల్ మల్కా జిగిరి జిల్లా దుండిగల్‌లో ఓ అభ్యర్థిని పొర పాటున తన పరీక్షా కేంద్రానికి కాకుండా వేరే పరీక్షా కేంద్రానికి వెళ్లారు.



అయితే అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు సిబ్బంది విషయం తెలుసుకుని వెంటనే ఆమెను తన బైక్‌పై ఎక్కిం చుకుని సకాలంలో సరైన పరీక్షా కేంద్రం వద్ద దింపాడు. అలాగే కీసరలో ఓ అభ్యర్థి పరీక్ష కేంద్రానికి రావడం ఆలస్యం కావడంతో ఇది గమనించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య అతన్ని పెట్రోలింగ్ వాహనంలో గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రానికి తీసుకొ చ్చాడు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పా టు చేయగా.. 17,779 మంది అభ్య ర్థులకు గాను 12,000 మంది హాజరయ్యారు. 5,779 మంది అభ్యర్థులు హాజరు కాలేదు. పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి (రెవెన్యూ), రాధి కాగుప్తా (లోకల్ బాడీస్) తనిఖీ చేశారు.

జీవో 29 రద్దు చేయాలి : కేవీపీఎస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 29ను రద్దు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) డిమాండ్ చేసింది. రిజర్వేషన్‌పరంగా దళిత, గిరిజన బలహీనవర్గాలు పొందాల్సిన ఉద్యోగాలను అగ్రకులాలకు అప్పజెప్పడమే ఈ జీవో లక్ష్యమని పేర్కొంది. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు జాన్‌వెస్లీ టి. స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను జీవో 55 జీవో ప్రకారం నిర్వహించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 ప్రకారం రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థి జనరల్ కోటాలో ఎంపికైనా రిజర్వు కోటాగానే పరిగణిస్తారని తెలిపారు. దీంతో ఇతర రిజర్వుడ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని గుర్తు చేశారు. జీవో 29ను రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సాయిబాబా గొప్ప విప్లవకారుడు

నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని ధారపోసాడు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఎర్రజెండాలు కలవాల్సిన రోజులొచ్చాయి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ప్రశ్నించేవారిపై అర్బన్ నక్సల్స్ ముద్ర : రచయిత్రి మీనా కందసామి

నడవలేకపోయినా సమాజానికి నడక నేర్పారు : ప్రొఫెసర్ హరగోపాల్

వ్యవస్థలోని అన్యాయాలను ఎదిరించిన వ్యక్తి సాయిబాబా: వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రొఫెసర్ సాయిబాబా గొప్ప విప్లవకారుడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆయన చనిపోలేదనీ, రాజ్యహింసలో హత్యకు గురయ్యారని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో సాయిబాబా సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ..ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయన్నారు. రాజకీయాలు పరాకాష్టకు చేరుకుని ఏ వ్యక్తి ఏ పార్టీలో ఉన్నాడో అర్థంకాని ప్రస్తుత పరిస్థితుల్లో నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన సాయిబాబా అంకితభావాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేననీ, ఎంచుకున్న మార్గాలు ఏవైనప్పటికీ అంతిమ లక్ష్యం ఒక్కటేనని చెప్పారు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు కూడా ఎదురొడ్డి నిలబడి పోరాడే విషయంలో సాయిబాబా కృషి మరువలేనిదన్నారు. పెట్టుబడి, శ్రమ మధ్య జరుగుతున్న పోరాటంలో ప్రస్తుతం పెట్టుబడిదే ఆధిపత్యం కొనసాగుతున్నదనీ, ఆ పెట్టుబడి ఆధిపత్యం వల్లే పాలకుల నుంచి అహంకారపూరిత మాటలు వస్తున్నాయని వివరించారు. అలాంటి కోవలోకే అమిత్‌షా మాటలు వస్తాయన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ ఎల్పీ నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..నిర్దోషి అయిన సాయిబాబా పదేండ్ల పాటు జైలులో అత్యంత దుర్భర జీవితాన్ని గడపడానికి కారణమైన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. ఎవరిమీద కోపం వస్తే వారిని పదేండ్ల పాటు జైల్లో పెట్టి హింసిస్తారా? ఇది చట్టాల లోపమా? పాలకుల మనస్సులో గూడుకట్టుకున్న విషమే కారణమా? అని నిలదీశారు. ఒక ప్రొఫెసర్‌కు జైలులో కనీస సౌకర్యాలు కల్పించకపోవడమేంటి? తల్లి చనిపోయినా బయటకు పంపకపోవడమేంటి? ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు దేరాబాబాను పెరోల్‌మీద బయటకు తీసుకురావడమేంటి? బిల్కిస్‌బానో లైంగిక దాడి కేసులో శిక్ష అనుభవించిన వారిని పూలదండలు వేసి ఊరేగించడమేంటి? అసలు మనం ఏ సమాజంలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక కేసులు ఎదుర్కొంటున్న అమిత్‌షా, మోడీ లాంటి క్రిమినల్స్ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే ఈ దుస్థితి ఉందని చెప్పారు. పౌరహక్కుల కోసం పోరాడితే దేశద్రోహులు ఎలా అవుతారు? ప్రస్తుత పాలకుల దృష్టిలో అబ్రహం లింకన్, నెల్సన్‌మండేలా, గాంధీ కూడా దేశద్రోహులేనా? అని నిలదీశారు. నిజాం, హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతలకు పట్టిన గతే అమిత్‌షాకు పడుతుందని హెచ్చరించారు. దేశంలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్న క్రమంలో ఎర్రజెండాలు కలవాల్సిన రోజు వచ్చిందన్నారు. లేకుంటే సాయిబాబా లాంటి వాళ్లను ఎంతో మందిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రశ్న నుంచే ఉద్యమాలు పుట్టుకురావాలని ఆకాంక్షించారు.

రచయిత్రి మీనా కందసామి మాట్లాడుతూ..ప్రొఫెసర్ సాయిబాబాను కలిస్తే ఎక్కడలేని రాజకీయ చైతన్యం, ఉత్తేజం వచ్చేదని గుర్తుచేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు తీసుకొచ్చిన గ్రీన్‌హంట్‌ను ప్రశ్నించినందుకే సాయిబాబాపై రాజ్యం కక్షగట్టి ఉపా చట్టం కింద పదేండ్ల జైలు జీవితం గడిపించిందని తెలిపారు. రాజ్యాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా నేటి పాలకులు అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్న తీరును ఎండగట్టారు. ఆయన రూపొందించిన సామాజిక ఉద్యమాలను వివరించారు.

తన కవిత్వం, రచనలు, ప్రసంగాల ద్వారా ప్రజలను చైతన్యపరడానికి సాయిబాబా చనిపోయేవరకూ తనవంతు ప్రయత్నం చేశారన్నారు. సాయిబాబా సతీ మణి వసంత, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సరోజ్‌గిరి, వేములపల్లి వెంకట్రామయ్య (సీపీఐఎంఎల్-న్యూడెమోక్రసీ), విమలక్క(టఫ్), సంధ్య (పీఓడబ్ల్యూ), మామిండ్ల రమేశ్‌రాజా (సీపీఐ (ఎంఎల్) లిబరేషన్), జానకిరాములు (ఆర్‌ఎస్పీ), సదానందమ్ (మాస్‌లైన్), ప్రసాద్(సీపీఐ(ఎంఎల్), గోవర్ధన్ (సీపీఐ(ఎంఎల్) - న్యూడెమోక్రసీ), నందిని సిద్దారెడ్డి (ప్రముఖ కవి), పాణి(విరసం), జిలకర శ్రీనివాస్ (బీసీకే) మాట్లాడారు. సాయిబాబా మృతికి సంతాపం తెలు పుతూ ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన సందే శాలను ఆయన కూతురు మంజీర, దేశంలో ప్రముఖుల సందేశాలను ఆయన తమ్ముడు రాందేవ్ చదివి వినిపించారు. సంస్మరణ సభ అధ్యక్షవర్గంగా ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ (పౌరహక్కుల సంఘం), ఎం.రాఘవాచారి (నిర్బంధ వ్యతిరేక వేదిక), పద్మకుమారి (బంధుమిత్రుల సంఘం), అరసవెల్లి కృష్ణ(విరసం), కె.రవిచందర్(నిర్బంధ వ్యతిరేక వేదిక), బి.జ్యోతి(చైతన్యమహిళా సంఘం) వ్యవహరించారు.

ఆయనపై రాజ్యం ఉక్కుపాదం మోపింది... : వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్



వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాయిబాబా జీవన నేపథ్యం, తన జీవితంలో రూపొందిం చిన ఉద్యమాలు, ఆయనపై రాజ్యం మోపిన ఉక్కుపాదం గురించి వివరించారు. ఆదివాసీలపై కేంద్రంలోని పాలకులు చేస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఆనకొండ, కాగర్‌లకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడారన్నారు. ఏ తప్పూ చేయని సాయిబాబాపై 950 పేజీల జడ్జిమెంట్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. సాయిబాబాకు శిక్ష విధించిన జడ్జి తర్వాతి కాలంలో మహారాష్ట్రంలో 700 మంది ప్రాసిక్యూటర్లకు ఇన్‌చార్జిగా నియమితులయ్యారని తెలిపారు.

తప్పుడు జడ్జిమెంట్‌ను ప్రశ్నించిన వారిపైనా ఉపాకేసులు పెట్టి కేంద్ర ప్రభుత్వం వేధిస్తున్నదన్నారు. ఆయన అసంపూర్తిగా వదిలేసి పోయిన పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలనీ, ఆపరేషన్ కాగర్‌కు వ్యతిరేకంగా పోరాడాలనీ, ఆదివాసీలపై పాలకుల యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల్ని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

నడవలేకపోయినా సమాజానికి నడక నేర్పారు

సాయిబాబా 90శాతం వైకల్యంతో తాను నడవలేకున్నా సమాజానికి నడక నేర్పారు. ఆయన జీవితం ఒక ప్రయోగం. చట్టబద్ధ పాలన చేస్తున్న దేశాలే అభివృద్ధి చెందుతాయన్న మాట చెప్పిన వ్యక్తికి నోబెల్ బహుమతి వచ్చింది. మన దేశంలో ఇదే మాట అంటే అర్బన్ నక్సల్ అనే ముద్ర వేసి పాలకులు వేధిస్తున్నారు. అటవీసంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఛత్తీస్‌గఢ్‌లో మోడీ సర్కార్ విధ్వంసం చేస్తున్నది. జైలులో ఉన్న సమయంలో మహారాష్ట్ర హోంమంత్రి, ఎన్సీపీ నేత సాయిబాబాను కలిసి వ్యక్తిగత సమస్యలేంటి అని అడిగితే..జైలులో ఉన్న దుర్భర పరిస్థితులను, ఖైదీల ఇబ్బందులను విడమర్చి చెప్పిన వ్యక్తి సాయిబాబా. ఆయన్ను జైలు నుంచి బయటకు తీసుకురావడానికి దేశంలోని ఎంతో మంది మేధావులు శక్తికిమించి కృషి చేశారు. కానీ, పదేండ్ల జైలు జీవితంలో ఆయన దేహం మొత్తం క్షీణించి బయటకు వచ్చిన కొద్ది కాలంలోనే మరణించారు. ఆయన ఆశయ సాధనలో కొనసాగడమే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి.

- ప్రొఫెసర్ హరగోపాల్

నవచిత్రం



మీనాక్షి చౌదరి, దుల్కర్ సల్మాన్

సరికొత్త అనుభూతినిచ్చే సినిమా

దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. సోమవారం ఏఎంబీ సినిమాస్‌లో ట్రైలర్ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది.

దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ, "ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. హాస్యం, భావోద్వేగాలు మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలు ఉంటాయి' అని చెప్పారు. 'ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో సుమతి పాత్ర నాకు బాగా ఇష్టమైన పాత్ర. నా మనసుకి బాగా దగ్గరైన చిత్రం' అని కథానాయిక మీనాక్షి చౌదరి అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, సినిమాలో ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. బ్యాంకింగ్ నేపథ్యంలో కుటుంబం భావోద్వేగాలతో నడిచే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది' అని తెలిపారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రం తెలుగు, మలయాళం, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈనెల 31న విడుదల కానుంది.

అత్యధిక థియేటర్లలో రిలీజ్

లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో తమిళ, కన్నడ భాషలలో విడుదలై ఘన విజయాన్ని సాధించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఈ చిత్ర తెలుగు హక్కులు ఆర్ కె ఫిలిమ్స్ అధినేత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక సోమవారం ఘనంగా జరిగింది. హీరో సుమన్ ట్రైలర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'లక్ష్మీ రాయ్ త్రిపాత్రాభినయం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే యోధురాలు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. సెన్సార్ పూర్తయ్యింది. నవంబర్ రెండో వారంలో అత్యధిక థియేటర్లలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

సుమన్, తెలుగు నిర్మాతల మండలి సెక్రెటరీ ప్రసన్న కుమార్, డాన్సర్, నటి ఆక్సఖాన్, నటుడు జెవిఆర్ తదితరులు ఈ చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



పొట్టేల్‌లో పవర్‌ఫుల్ రోల్ చేశా..



అనన్య నాగళ్ళ

యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి డైరెక్ట్ చేసిన రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనన్య నాగళ్ల మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

డైరెక్టర్ సాహిత్ చెప్పిన కథ బావుంది. ఇందులో చదువు అనే పాయింట్ చాలా నచ్చింది. ఇంత మంచి కాన్సెప్ట్, కథలో ఎలా అయిన పార్ట్ కావాలని చేశాను. సినిమాలో నా పాత్ర చూసి సర్‌ప్రైజ్ అవుతారు. నా క్యారెక్టర్ పేరు బుజ్జమ్మ. ఇప్పటివరకూ మల్లేశం అనన్య, వకీల్ సాబ్ అనన్య అనే పిలుస్తుంటారు. ఈ సినిమా తర్వాత బుజ్జమ్మ అనన్య అని పిలుస్తారు. అంత ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. నాది చాలా స్ట్రాంగ్ రోల్. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' సినిమా రిలీజ్‌కి రెడీగా ఉంది. సతీష్ వేగేశ్న 'కథాకళి', అలాగే 'లేచింది మహిళా లోకం' అనే మరో సినిమా చేస్తున్నాను'.

జాలర్ల జీవితానికి ప్రతిబింబం



రమాకాంత్, అవంతిక

కీర్తన ప్రొడక్షన్స్ పతాకంపై రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరో, హీరోయిన్లుగా నగేష్ నారదాసి దర్శకత్వంలో బధావత్ కిషన్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'సముద్రుడు'.

ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా దర్శకుడు వి. సముద్ర, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. నిర్మాత కీర్తన మాట్లాడుతూ, 'మా సినిమా కలెక్షన్లలో 20శాతాన్ని మత్స్యకారులకు అందజేస్తాం' అని అన్నారు. 'ఈ సినిమా జాలర్ల జీవితాలపై ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో దర్శకుడు నగేష్ చాలా బాగా తీశాడు' అని హీరో సుమన్ చెప్పారు. హీరోయిన్ అవంతిక మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నేను టీచర్ క్యారెక్టర్‌లో నటించాను' అని అన్నారు. హీరో రమాకాంత్ మాట్లాడుతూ, "ఛత్రపతి' ఎంత పెద్ద విజయం సాధించిందో ఈ సినిమా కూడా అంతే విజయం సాధిస్తుంది అని నమ్ముతున్నాను. ఈనెల 25న ప్రేక్షకులు అందరూ థియేటర్లకి వచ్చి సినిమా చూస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళినప్పుడు పడే కష్టాలు, వాళ్లకు వచ్చే సమస్యల్ని ఈ చిత్రంలో చూపించాం' అని దర్శకుడు నగేష్ నారదాసి చెప్పారు.

ఆటలు

పుణెలో స్పిన్ సవాల్



సిద్ధం కానున్న ర్యాంక్ టర్నర్

నవతెలంగాణ-పుణె

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు ఆసక్తికరంగా మారింది. బెంగళూర్ టెస్టులో టీమ్ ఇండియా ఊహించని పరాజయం చవిచూసినా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతుంది. కానీ ఫైనల్ బెర్త్ రేసులో భారత్‌కు ప్రత్యర్థి జట్ల నుంచి గట్టి పోటీ నెలకొంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సహా శ్రీలంక టాప్-2లో నిలిచేందుకు తహతహలాడుతున్నాయి. తాజా డబ్లూటీసీ సైకిల్‌లో భారత్ మరో ఏడు టెస్టులు ఆడాల్సి ఉంది. ఇందులో కనీసం నాలుగు మ్యాచుల్లో విజయాలు సాధించి, మిగతా టెస్టులను డ్రా చేసుకుంటేనే భారత్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. లేదంటే, ఇతర జట్ల సిరీస్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా, శ్రీలంక రెండు మ్యాచుల టెస్టు సిరీస్ ఫలితంతో సమీకరణంపై మరింత స్పష్టత రానుంది. నవంబర్ ఆఖర్లో బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్ ఆరంభం నాటికి డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఎవరెక్కడ ఉన్నారనే అంశంపై స్పష్టత ఉండనుంది. అయితే, స్వదేశంలో చివరి రెండు టెస్టుల్లో కచ్చితంగా విజయం సాధిస్తేనే భారత్ అవకాశాలు మరింత మెరుగవుతాయి. బెంగళూర్ టెస్టు చేజారటంతో రోహిత్‌సేన ఒత్తిడిలో పడింది. దీంతో న్యూజిలాండ్‌తో చివరి రెండు టెస్టు వేదికలు పుణె, ముంబయి పిచ్ రూపకల్పన విషయంలో ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. ఆతిథ్య జట్టుకు ఉపయుక్తమైన స్పిన్ స్వర్గధామ పిచ్‌ను సిద్ధం చేయాలనే మౌఖిక ఆదేశాలు క్యూరేటర్లకు అందినట్టు సమాచారం.

స్పిన్ పిచ్

భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టుకు పుణె వేదికగా నిలువనుంది. ఈ నెల 24 నుంచి కీలక రెండో టెస్టు ఆరంభం కానుంది. పుణెలో ఇది మూడో టెస్టు పోరు కానుండగా.. గత రెండు మ్యాచుల్లో ఆతిథ్య జట్టు మిశ్రమ ఫలితాలు సాధించింది. ఆసీస్ చేతిలో ఓటమి ఎదురవగా, సఫారీపై ఇన్నింగ్స్ విజయం సాధించింది. దక్షిణాఫ్రికాపై విరాట్ కోహ్లి ఇక్కడ ద్వి శతకం సాధించటం భారత్‌కు ఉత్తేజాన్ని అందించే అంశం. పుణెలో సహజంగా ఎర్రమట్టి చేసిన పిచ్ అందుబాటులో ఉంది. సాధారణంగా ఈ వికెట్ స్పిన్‌కు అనుకూలం. రెండో టెస్టులో తొలి గంట మినహా పేసర్లకు పిచ్ నుంచి పెద్దగా సహకారం లభించకపోవచ్చు. తొలి రోజు రెండో సెషన్ నుంచే స్పిన్నర్లు ప్రభావశీలంగా మారనున్నారు. మూడో టెస్టు వేదిక ముంబయిలో ఎర్రమట్టి చేసిన పిచ్‌లు ఉన్నాయి. అయినా, అక్కడా స్పిన్‌ను అనుకూలంగా ఉండేలా క్యూరేటర్ ఏర్పాట్లు చేసే అవకాశం ఉంది. అశ్విన్, జడేజా సహా కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ జట్టులో ఉన్నప్పటికీ సెలక్షన్ కమిటీ ఐదో స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకుంది. దీంతో భారత స్పిన్నర్ల బలాలకు అనుకూలంగా పిచ్‌పై ఎంపిక చేసిన ప్రదేశాల్లో వాటరింగ్ చేయటం వంటివి చేసేందుకు క్యూరేటర్లు సిద్ధమతున్నారని చెప్పవచ్చు.

రంజీ బరిలో షమి

పూర్తిగా కోలుకున్న పేస్ బౌలర్



న్యూఢిల్లీ : భారత స్టార్ పేస్ బౌలర్ మహ్మద్ షమి పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ అనంతరం గాయంతో ఆటకు దూరమైన షమి.. ఈ ఏడాది ఫిబ్రవరిలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో రిహాబిలిటేషన్‌లో కొనసాగుతున్న మహ్మద్ షమి ఆదివారం టీమ్ ఇండియా సహాయక సిబ్బంది పర్యవేక్షణలో చిన్నస్వామి స్టేడియంలో బౌలింగ్ సాధన చేశాడు. భారత్, న్యూజిలాండ్ టెస్టు మ్యాచ్ అనంతరం బౌలింగ్ కోచ్ మోర్నె మోర్కెల్ పర్యవేక్షణలో మహ్మద్ షమి నెట్స్‌లో బంతులు వేశాడు. ఫుల్ రనప్‌తో బౌలింగ్ చేసిన షమి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించినట్టే కనిపించాడు. గాయంతో బాధపడుతున్న శుభ్‌మన్ గిల్ సైతం నెట్స్‌లో బ్యాటింగ్ చేశాడు. బ్యాటింగ్ కోచ్ గిల్ సాధనను పర్యవేక్షించాడు. నవంబర్ ఆఖరులో ఆరంభం కానున్న బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్‌తో రీ ఎంట్రీకి సిద్ధమవుతున్న మహ్మద్ షమి.. అంతకుముందు ఒకట్రెండు రంజీ మ్యాచులు ఆడే అవకాశం ఉంది. ' ఆదివారం నెట్స్‌లో బౌలింగ్ చేశాను. సర్జరీ తర్వాత తొలిసారి పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాను. ఎటువంటి ఇబ్బంది అనిపించలేదు. ఏకధాటిగా 20-30 ఓవర్లు వేసినప్పుడు, వైద్యుల సలహాతో మ్యాచ్‌కు సిద్ధమవుతాను. ప్రస్తుతానికి వంద శాతం ఫిట్‌నెస్ సాధించాను' అని మహ్మద్ షమి సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలిపాడు.

ఓటమి నం.2

హైదరాబాద్‌పై ఉత్తరాఖండ్ గెలుపు



డెహ్రాడూన్ : రంజీ ట్రోఫీలో హైదరాబాద్‌కు వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం ఎదురైంది. గత సీజన్ అజేయ రికార్డుతో ఎలైట్‌లో ఎంట్రీ ఇచ్చిన హైదరాబాద్ తొలి మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో.. తాజాగా ఉత్తరాఖండ్ చేతిలో 78 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 269 పరుగుల ఛేదనలో హైదరాబాద్ 190 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (47, 152 బంతుల్లో 4 ఫోర్లు), తన్మయ్ అగర్వాల్ (38, 55 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అభిరాత్ రెడ్డి (35, 45 బంతుల్లో 5 ఫోర్లు) మెరిసినా.. ఛేదనలో హైదరాబాద్ చతికిల పడింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (0), హిమతేజ (22), రాహుల్ (12), తనయ్ త్యాగరాజన్ (2), సివి మిలింద్ (5), అనికెత్ రెడ్డి (2)లు విఫలమయ్యారు. ఉత్తరాఖండ్ బౌలర్ స్వప్నిల్ సింగ్ (6/59) ఆరు వికెట్లతో హైదరాబాద్ ఖేల్ ఖతం చేశాడు. ఎలైట్ గ్రూప్-బిలో తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 26 నుంచి పుదుచ్చేరితో హైదరాబాద్ తలపడనుంది.

రంజీ వేదికగా మహబూబ్‌నగర్!

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు



మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ స్టేడియాన్ని రంజీ వేదికగా తీర్చిదిద్దుతామని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు తెలిపారు. రూ. 80 లక్షల వ్యయంతో గ్రీన్ టర్ఫ్ వికెట్ పనులకు భూమి పూజ చేసిన చేసిన జగన్‌మోహన్ రావు..రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు దేవరాజ్, దల్జీత్‌సింగ్, బసవరాజు, సిజె శ్రీనివాసరావులతో కలిసి డ్రెస్సింగ్, రిఫ్రెషింగ్ రూమ్‌లను ప్రారంభించారు. త్వరలోనే మరో రూ.20 లక్షలతో స్టేడియంలో అధునాతన వసతులు ఏర్పాటు చేయనున్నామని, రానున్న సీజన్లలో ఇక్కడ రంజీ మ్యాచులు నిర్వహించే విధంగా అభివృద్ధి చేసేందుకు హెచ్‌సీఏ ప్రణాళికలు సిద్ధం చేసిందని జగన్‌మోహన్ రావు వెల్లడించారు.

ఒక పర్వతాన్ని అధిరోహించిన వాడికే, తాను ఇంకా ఎన్ని పర్వతాలు ఎక్కాలో తెలిసేది - నెల్సన్ మండేలా

సంపాదకీయం

ఇక్కడిలా.. అక్కడలా!

రాష్ట్రాన్ని తాజాగా రెండు సమస్యలు ఓ కుదుపు కుదిపేస్తున్నాయి. జీవో 29ఇష్యూతో గ్రూప్-1 పరీక్షలు జరుగుతాయా లేదా? అన్న గందరగోళానికి గురిచేశాయి. వేలాది నిరుద్యోగుల జీవితాలకు ముడిపడి ఉన్న ప్రశ్న ఒకటి అయితే, రెండోది సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్. గోతికాడ నక్కల్లా ఎదురుచూస్తున్న ఈ శక్తులకు ప్రభుత్వ అనాలోచిత చర్యలు, పనులు అయాచిత ఆయుధాలుగా ఉపయోగపడుతున్నాయి. భాధితులు, సమస్యను ఎదురుకునే వాళ్ల ఈ విచక్షణను అర్థం చేసుకొకుండా ముందుకుపోతే యావత్ సమాజానికే నష్టం. నేడు రాష్ట్రంలో బీజేపీ చేస్తున్న పని అచ్చంగా అలాగే ఉంది.

పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నప్పుడల్లా ఏదో ఒక వివాదం వెంటాడుతున్నది. తెలంగాణ ఏర్పడిన తర్వాత చేసిన ప్రయత్నాలు సక్సెస్ కాలేదు. ఎట్టకేలకు గతేడాది నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికి మూడుసార్లు ప్రిలిమ్స్ జరిగినా మెయిన్స్ సమయానికి ఏదో ఒక వివాదం ముంచుకొచ్చి నిర్వహణ సందిగ్ధంలో పడుతున్నది. తాజాగా జీవో 29 ఇష్యూతో షెడ్యూలు ప్రకారం పరీక్షలు జరుగుతాయో లేవో అనే కన్‌ఫ్యూజన్ అభ్యర్థులను కలవరపెట్టింది. పరీక్షల నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా రాష్ట్రంలో ఆందోళనలు ఆగలేదు. సోమవారం (మరికొన్ని గంటల్లో పరీక్ష అనగా) సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. దీంతో సోమవారం యధావిధిగా పరీక్షలు జరిగాయి. వేలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు. కానీ, ఈ సమస్యపై ఉద్యోగార్థుల పక్షం మేమున్నామంటూ తెగ ఫోజులుకొడుతూ, రిజర్వేషన్ల గురించి సైతం గొంతు చించుకుంటూ ఆందోళనకు దిగితున్నట్టుగా బీజేపీ చేసిన హడావిడి అంతా ఇంతా కాదు.

తెలంగాణలో రిజర్వేషన్ల అమలుకు డిమాండ్ చేస్తున్న కేంద్రమంత్రులు...కేంద్రంలో మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ రిజర్వేషన్ల ఊసేలేకుండా చేస్తున్నారు. ఇది ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ ఊరించి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ఆచరణలో యువతరాన్ని నిట్ట నిలువునా ముంచేసింది. మోడీ ప్రభుత్వ విధానాల కారణంగా పనిచేసే చేవ ఉన్నా.. ఉపాధి దక్కక యువతరం ఈసురో మంటోంది.. భారత్‌లో ఉపాధి పరిస్థితి భయంకరంగా ఉందని నిరుద్యోగిత రేటు, కీలక లేబర్ సూచీలు స్పష్టం చేస్తున్నాయి. వాటిపై పల్లెత్తుమాట మాట్లాడని సదరు బీజేపీ నేతలు రాష్ట్రంలో మాత్రం నిరుద్యోగం గురించి, రిజర్వేషన్ల అమలు గురించి రచ్చ చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది.




తాజాగా సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్‌లో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హిందువులకు చీమునెత్తురు లేదా, గాజులేసుకుని కూర్చొన్నారా' అంటూ విరుచుకుపడ్డారు. ఇక మాధవిలత అయితే మాటకు ముందు, వెనక సనాతనం, హిందుత్వం తప్ప ప్రజలు, ప్రజా సమస్యలు అనే ముచ్చటే వుండదు. ఈ వివాదంపై ఒక కేంద్ర మంత్రి సమగ్ర విచారణ జరగాలని అంటారు. ఇంకో కేంద్ర మంత్రి వెళ్లి నోరు పారేసుకుంటున్నారు. ఆ పార్టీ మరో ఎంపీ ధర్మపురి అరవింద్ సైతం స్పందిస్తూ 'నుపుర్‌శర్మకు మద్దతు తెలిపినందుకు రాజస్థాన్‌లో ఒకర్ని గొంతుకోసి చంపేశారనీ, దాన్ని గుర్తుపెట్టుకోవాలి' అని హెచ్చరికలు జారీ చేశారు. అంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇదే పద్ధతిని అనుసరిస్తారా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాలి. మత విద్వేషాల మీద వున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై ఉండదు. రోజుకొక వివాదం.. పూటకో రచ్చ చేస్తోన్న నేతల తీరు మారదా? 'మత మీటర్ లేనిదే కిలోమీటర్ నడవలేని నేతలు' తెలంగాణలో పాగా కోసం ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడం లేదు.

ప్రతిపక్ష పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు చేయని కుట్ర, కుతంత్రం లేదు. ఆ కోణంలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, అప్రదిష్ట పాల్జేసేందుకు ఇక్కడి కమలం నేతలు పావులు కదుపుతున్నారనే వాదనలను మనం కొట్టిపడేయలేం. అందులో భాగంగానే ప్రతి సందర్భాన్ని తనకు అవకాశంగా మార్చుకుంటుంది. ప్రభుత్వ తప్పిదాలే వారికి అవకాశం కల్పిస్తున్నాయి. ఈ మతతత్వ శక్తులను రానీయకుండా అడ్డుకట్ట వేయాలంటే ప్రజల సమస్యలను, నిరుద్యోగుల భయాలను నివృత్తి చేసి, రిజర్వేషన్లకు ఇబ్బందిగా ఉన్న 29జివోను ప్రభుత్వం విరమించాలి. ఆ సమస్యను పరిష్కరించాలి. మతపరమైన ఘర్షణలు తలెత్తకుండా సామరస్య పూర్వకంగా వ్యవహరించాలి. లౌకికపక్షాలను కలుపుకుని ముందుకు సాగాలి. అప్పుడే గుంటనక్కలకు చెక్ పెట్టగలం!

> తాజాగా సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్‌లో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి 'హిందువులకు చీమునెత్తురు లేదా, గాజులేసుకుని కూర్చొన్నారా' అంటూ విరుచుకుపడ్డారు. ఇక మాధవిలత అయితే మాటకు ముందు, వెనక సనాతనం, హిందుత్వం తప్ప ప్రజలు, ప్రజా సమస్యలు అనే ముచ్చటే వుండదు. ఈ వివాదంపై ఒక కేంద్ర మంత్రి సమగ్ర విచారణ జరగాలని అంటారు. ఇంకో కేంద్ర మంత్రి వెళ్లి నోరు పారేసుకుం టున్నారు. ఆ పార్టీ మరో ఎంపీ ధర్మపురి అరవింద్ సైతం స్పందిస్తూ 'నుపుర్ శర్మకు మద్దతు తెలిపినందుకు రాజస్థాన్‌లో ఒకర్ని గొంతుకోసి చంపేశారనీ, దాన్ని గుర్తుపెట్టుకోవాలి' అని హెచ్చరికలు జారీ చేశారు. అంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇదే పద్ధతిని అనుసరిస్తారా?

నిజాంపై నిప్పులు చెరిగిన 'కొమురంభీమ్'

అతనొక అగ్గి బరాటా. గెరిల్లా పోరాట యోధుడు. ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక. ఆయన పేరు వింటేనే నిజాం సర్కార్‌కు దడ పుట్టేది. స్వపరిపాలన, ఆత్మగౌరవం కోసం పోరాట మార్గాన్నే ఎంచుకున్న ధీరుడు. ఇదే నిజాం నుంచి తన జాతి ప్రజలను విముక్తి చేస్తుందని నమ్మి ఉద్యమించిన నాయకుడు. అతనెవరో కాదు, తెలంగాణ పోరుబిడ్డ, ఆదివాసుల ముద్దుబిడ్డ కొమురంభీమ్. ఆయన పోరాటం, అమరత్వానికి ఎనిమిది దశాబ్దాలు నిండాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, గోండు తెగకు చెందిన భీమ్ 22 అక్టోబరు 1901న జన్మించారు. నిజాం చెర నుంచి గిరిజన, ఆదివాసుల విముక్తి కోసం హైదరాబాద్ నవాబు అసఫ్‌జాహికి వ్యతిరేకంగా పోరాడాడు. అడవిని జీవనోపాధిగా చేసుకుని కొండకోనల్లో, ప్రకృతితో సహ జీవనం సాగించే ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కులుండాలని, స్వయం పాలన కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో ఉద్యమించాడు. పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా గిరిజనులను ఒక్కతాటిపై నడిపించాడు. తాను పదిహేడేండ్ల వయసులో అటవీశాఖ సిబ్బంది జరిపిన దాడిలో తండ్రి మరణించగా కుటుంబ సభ్యులంతా కరిమెర ప్రాంతంలోని సర్దాపూర్‌కు వలసెళ్లారు. అక్కడ వాళ్ల సాగుచేసుకుంటున్న భూమిని జమిందార్ ఆక్రమించుకోవడంతో ఆగ్రహంతో భీమ్ అతన్ని



హతమార్చాడు. ఆ తర్వాత ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టల్ని కేంద్రంగా చేసుకుని నిజాం నవాబుపై గెరిల్లా పద్ధతిలో పోరాటం చేశాడు. భీమ్‌కు అండగా, వెన్నంటే కొమురం సూరు, వెడ్మరాము సహచరులుగా ఉన్నారు.

రాష్ట్రంలో గోండు తెగకు సంబంధించిన ప్రధాన్, తోటి, మన్నె, కోయ తెగలే కాకుండా నాయక్‌పోడ్, ఆంధ్ ఇతర ఆదివాసీ తెగలు ఆదిలాబాద్,ములుగు, భద్రాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో నివసిస్తున్నాయి. వారి జీవనాధారం పోడు వ్యవసాయం. వారంతా ఎప్పటికీ ఒక రాజ్యంలో ఇమిడిలేరు. అయితే వారిని అడవినుంచి తరిమేసే విధానాలు, దూరం చేసే చట్టాలతో నేటికీ తలపడుతూనే ఉన్నారు. అడవిని నరికి పంటవేస్తే అది జంగ్లాత్ భూమి అని ఒకరు, కాదు రెవెన్యూ భూమి అని మరొకరు అంటూ గోండ్లను ఆభూముల నుంచి తరిమేశారు. పంటల్ని ధ్వంసం చేశారు.. జరిమానాలతో వేధించారు. ఈ వేధింపులు, అణచివేతల నేపథ్యం నుంచే కొమురంభీమ్ నాయకత్వంలో గోండ్లు సంఘటితమయ్యారు. నైజాం నుంచి విముక్తి కోసం 'మాఊర్లో..మా రాజ్యం' అంటూ పన్నెండు గూడాల ప్రజలు ఉద్యమించారు. భీమ్ పోరాటం పలు ప్రాంతాలకు విస్తరించేలోపే నిజాం సేనలతో యుద్ధం జరిగింది. పాశవికంగా ఆ పోరాటాన్ని అణిచేసే ప్రయత్నం చేసింది. ఒక నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో నిజాం సైనికులు 1940 అక్టోబర్ 27న జోడేఘాట్ అడవుల్లో భీమ్ స్థావరాన్ని ముట్టడించి అతన్ని హతమార్చారు. నిజాం సైన్యంమీద కొమురంభీమ్ కొదమసింహంలా గర్జించేవాడని నేటికీ అతని పోరాట స్ఫూర్తిని తలచుకుంటారు.ఆయన చనిపోయిన రోజునే ఆదివాసులు తమ పవిత్రమైన పండగను జరుపుకుంటారు.

భీం అమరత్వం జోడేఘాట్ లొద్దుల్లో నేటికీ ప్రతిధ్వనిస్తునే ఉన్నది.ఏహక్కుల కోసమైతే..నాడు భీం ఉద్యమించాడో.. ఆ హక్కుల కోసం ఆదివాసులు నేటికీ నిరంతరం పోరాటం చేయాల్సి వస్తున్నది. ప్రజాస్వామిక రాజ్యమని చెప్పుకుంటున్న నేడు కూడా..ఆదివాసుల అవస్తలు ఏమీ తీరలేదు. వారికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట కూడా గగనమే అవుతున్నది. అడవిలో దొరికే పండ్లు, ఫలాలే వారికి ఆహారం. వారు నివసించే తండాలకు నేటికీ రోడ్లు లేవు. వాగులోని చెలిమెలో నీళ్ల తెచ్చుకోవాలన్నా కొన్ని కిలోమీటర్లు నడిస్తేగాని దొరకవు. విషజ్వరాలు వస్తే గనుక ఇక అంతేసంగతి. డెంగ్యూ మలేరియా లాంటి జ్వరాలతో ప్రతియేటా ఐదు వందల నుంచి వెయ్యి మంది వరకు చనిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ఒక ఓటుబ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయే తప్ప కొమురంభీమ్ ఏ హక్కుల కోసం పోరాడాడో, ఆ హక్కుల్ని కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. భీమ్ అనగానే ఆయన జయంతి, వర్థంతిల సందర్భంగా ఒక పూలమాల వేసి, గిరిజనులకు అండగా ఉంటామని ఉపన్యాసలిచ్చి వెళ్లిపోతారు. కానీ గిరిజన, ఆదివాసులు హక్కుల కోసం చేసే పోరాటాలు వారికి పట్టవు. నేటికీ ఆదివాసులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే ఉన్నారు. గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ ఇచ్చే రాజ్యాంగంలోని అయిదో షెడ్యూలును తుంగలో తొక్కారు. ప్రాజెక్టులు, గనుల తవ్వకాల పేరుతో వారిని అడవికి దూరం చేసే కుట్ర చేస్తున్నారు. ఆదివాసీ భూరక్షణ చట్టం 1/70 చట్టాన్ని అమలు చేయడం లేదు. అన్యక్రాం తమవుతున్న అడవులను, భూములను పట్టించుకోవడం లేదు. 'పోరాడితే పోయేది లేదు, బానిస సంకెళ్ల తప్ప' అని కార్ల్‌మార్క్స్ వందల ఏండ్ల కిందటే పిలుపు నిచ్చాడు. అందుకే కొమురంభీం స్ఫూర్తితో తమ జీవనాధారమైన అడవి రక్షణకు ఆదివాసులు సంఘటితమవ్వాలి. చట్టాల అమలుకు పాలకులను ప్రశ్నించాలి. ప్రభుత్వాలపై తిరుగుబావుటా జెండా ఎగరేసి హక్కుల్ని సాధించుకోవాలి.అదే భీమ్‌కు ఇచ్చే నిజమైన నివాళి.

(నేడు కొమురంభీమ్ జయంతి)

- కామిడి సతీష్‌రెడ్డి, 9848445134

పేదరికాన్ని అంచనా కట్టడం ఇలాగేనా?



ప్రభాత్ పట్నాయక్

'పేదరికం' అని వాళ్ల పరిగణించేదానిని అంచనా కట్టే పనిలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు మునిగివున్నాయి. కొంత కాలం వరకూ ఈ పని ప్రపంచ బ్యాంక్ చూసేది. ఇప్పుడు ఐరాస అభివృద్ధి ప్రాజెక్టు, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ అనే ఆక్స్‌ఫర్డ్ సంస్థ ఆ పనిలో ఉన్నాయి. ఇవేవీ వాస్తవంగా పేదరికాన్ని అంచనా కట్టే లక్ష్యంతో లేవు. నయా ఉదారవాదాన్ని అందంగా చిత్రించే పనిలో ఉన్నాయి. "కడు పేదరికం" అంటే 2011 నాటి డాలర్ కొనుగోలుశక్తి ప్రాతిపదికన రోజుకు 1.90 డాలర్లు తలసరి వినియోగం కన్నా హీన స్థాయిలో ఉండడం. అంటే తలసరి రోజుకు దాదాపు రూ.53 ఖర్చు చేయగలిగే పరిస్థితి ఉంటే అది 'కడు పేదరికం' స్థాయికి ఎగువన ఉన్నట్టే. ప్రపంచబ్యాంక్ అంచనా ప్రకారం 1990 దశాబ్దం చివరి భాగంలో ఈస్థాయి కన్నా దిగువన సుమారు 30 శాతం ప్రపంచ జనాభా ఉండేవారు. 2022 నాటికి ఆ స్థాయికి దిగువన కేవలం 10 శాతం కన్నా కూడా తక్కువే ఉన్నారని ప్రపంచబ్యాంక్ తెలిపింది. అంటే నయా ఉదారవాద విధానాల అమలు తర్వాత కోట్లాది మంది ప్రపంచ జనాభా కడు పేదరిక స్థాయినుండి బయటపడ్డారు అన్నది ప్రపంచబ్యాంక్ చెప్పదలచుకుంది. ఇది పూర్తిగా లోపభూయిష్టమైన అంచనా. ఎలాగో ఇప్పుడు చూద్దాం.

ప్రపంచబ్యాంక్ అంచనా కట్టే పద్ధతిలో మూడు పొరపాట్లు ఉన్నాయి. మొదటిది: ఒక వ్యక్తి దగ్గర ఉన్న సంపద పెరిగిందా, తరిగిందా అన్నది ప్రపంచబ్యాంక్ లెక్కలోకి తీసుకోకుండా కేవలం ఆ వ్యక్తి ఆదాయం పరిస్థితిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. రెండవది: ఒక వ్యక్తి ఆదాయాన్ని అంచనా కట్టడానికి ఆ వ్యక్తి చేసే వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకుంటుంది. మూడవది: వాస్తవ వ్యయాన్ని అంచనా కట్టడానికి అది ధరల సూచికను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ ధరల సూచిక వాస్తవ జీవన వ్యయాన్ని సక్రమంగా ప్రతిబింబించడం లేదని అందరికీ తెలుసు. ఈ మూడు పొరపాట్ల ఫలితంగా వచ్చే నిర్ధారణలు చాలా పెద్ద పొరపాటు అంచనాలకు దారి తీస్తాయి. ఇప్పుడు ఒక్కొక్క అంశాన్నీ చూద్దాం.

ఒక వ్యక్తి ఆర్థిక స్థాయిలో వచ్చిన మార్పులను పరిశీలించడానికి ఆ వ్యక్తికి వస్తూన్న ఆదాయాన్ని, ఆ వ్యక్తి వద్దనున్న సంపదలో పెరుగుదల లేదా తరుగుదలను- ఈ రెండింటినీ లెక్కలోకి తీసుకోవాలి. ఉదాహరణకు: ఒక వ్యక్తికి ఏడాది క్రితం ఎంత ఆదాయం వస్తోందో, ఇప్పుడూ అంతే ఆదాయం వస్తోందనుకోండి. కాని ఇదే ఏడాది కాలంలో ఆవ్యక్తి దగ్గరున్న సంపద కాస్తా హరించుకు పోయిందనుకోండి. అటువంటి వ్యక్తి ఆదాయంలో ఏ మార్పూ లేదు కనుక ఆర్థిక స్థాయిలోనూ ఏ మార్పూ లేదని మనం చెప్పగలమా? ఉన్న సంపద కాస్తా హరించుకు పోయినప్పుడు ఆ వ్యక్తి మరింత పేదరికంలోకి జారిపోయినట్టు కాదా? కాని ప్రపంచబ్యాంక్ పద్ధతిలో ఆ వ్యక్తి సంపద పరిస్థితి ఏమార్పులకు లోనైంది అన్న అంశం పరిశీలనలోనే ఉండదు. నయా ఉదారవాద విధానాలు అంటేనే సంప దను కొల్లగొట్టి పోగేసుకోవడం. అంటే చాలామంది వ్యక్తులను వారి వారి సంపదకు దూరం చేసి దానిని స్వాహా చేయడం. ఇటువంటి విధానాలను ఒకపక్క అమలు చేస్తూ మరొకపక్క కోట్లాది మంది పేదరికం లోంచి బైట పడ్డారని చెప్పుకోవడం అవహేళన చేయడమే.

రెండవది: ఆదాయాన్ని లెక్కించడంలో కూడా వాస్తవ ఆదాయాన్ని లెక్కించకపోవడం. భారతదేశంతో సహా చాలా దేశాల్లో వ్యక్తుల వాస్తవ ఆదాయాలకు సంబంధించిన వివరాలు లేవు. ఆదాయం అంటే ఏ యే అంశాలను పరిశీలించాలి అన్నదే ఒక సంక్లిష్టమైన విషయం. అందుచేత వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం పరిపాటి అయింది. వ్యయానికి సంబంధించి లెక్కలు లభిస్తున్నాయి గనుక దానినే ప్రాతిపదికగా తీసుకుని వ్యక్తుల ఆదా యాలను లెక్కించడం జరుగుతోంది. వ్యయాన్ని బట్టి ఆదాయం లెక్కించాలనుకున్నప్పుడు ఆ వ్యక్తి సంపద లో వచ్చిన మార్పులను పరిశీలించకపోవడం ఏమాత్రమూ క్షంతవ్యం కాదు. ఎందుకంటే ఒక వ్యక్తి ఆదాయం పడిపోయినా, ఆ వ్యక్తి తన వద్దనున్న ఇతర సంపదను అమ్ముకుని ఆ సొమ్ముతో గతంలో మాదిరిగానే తన వ్యయాన్ని కొనసాగించ వచ్చు. వాస్తవానికి ఆ



వ్యక్తి పేదరికం పెరిగింది అని నిర్ధారించాలి. కాని వ్యయం స్థాయి యథాతథంగా నిలబడింది గనుక ఆ వ్యక్తి పేదరికం పెరగలేదు అని నిర్ధారించడం అర్థరహితం కాదా?

మూడవది: వ్యయాన్ని లెక్కించినప్పుడు కూడా వాస్తవ వ్యయం ఎంతో నిర్ధారించడానికి ఆ వ్యయాన్ని ధరల సూచీతో పోల్చి సరి చేస్తారు. ఈ ధరల సూచీ వాస్తవ ధరల పెరుగుదలను ప్రతిబింబించదు. ప్రజలకు గల సాధా రణ అవసరాలను బట్టి కొన్ని వస్తువులను మాత్రం లెక్కలోకి తీసుకుని వాటి ధరల్లో వచ్చే మార్పులను మార్కెట్ సర్వే ద్వారా నిర్ధారిస్తారు. దానిని బట్టి ధరల సూచీ లో మార్పులను నిర్ధారిస్తారు. ఐతే, ఎప్పటినుంచి పెరుగుదలను పరిశీలించాలి అన్నదానికి ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు (ఉదా: 1960, 1982, 2011-ఈ సంవత్సరాలను బేస్ సంవత్సరాలుగా తీసుకుని వివిధ ధరల సూచికలు రూపొందుతాయి). అయితే, అప్పటికీ, ఇప్పటికీ అవే సరుకులను అదే ప్రాధాన్యతతో ప్రజలు ఉపయోగించరు. వినియోగంలో వచ్చే మార్పులను ఈ ధరల సూచీ పరిగణనలోకి తీసుకోదు. అదే మాదిరిగా బేస్ సంవత్సరం నాడు లభించిన సరుకులు ఇప్పుడు లభించవు కూడా. ఈ మార్పులను ధరల సూచీ లెక్కలోకి తీసుకోదు.

ఉదాహరణకి: నయా ఉదారవాద విధానాలు వచ్చాక చాలా సేవలు ప్రయివేటుపరమయ్యాయి. ముఖ్యంగా విద్య, వైద్యం. ఇవి అంతకు మునుపు ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందేవి. ఇప్పుడు వాటి ఖరీదు విపరీతంగా పెరిగి పోయింది. వాటిని వినియోగించడం ప్రజలకు అనివార్యం. కాని ధరల సూచీ ఈ రెండింటినీ ఇప్పటికీ ఉచితంగానే అభిస్తున్నవిగా పరిగణిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక ఆపరేషన్‌కు బేస్ సంవత్సరంలో రూ. వెయ్యి వసూలు చేసినది. ఇప్పుడు రూ.రెండు వేలు వసూలు చేస్తే, ఈ తేడాను మాత్రమే ధరల సూచీ లెక్కలోకి తీసు కుంటుంది. ప్రభుత్వ వైద్యవ్యవస్థ విస్తరించనందువలన ప్రయివేటు వైద్యానికి అనివార్యంగా ప్రజలు పోవలసి వస్తోంది. అక్కడ ఇదే ఆపరేషన్‌కు రూ.పది వేలు వసూలు చేస్తారు. కాని ధరల సూచీలో ప్రభుత్వ ఆస్పత్రులలో పెరిగిన ఫీజులను మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. వాస్తవ జీవన వ్యయం ధరల సూచీలో చూపుతున్న దానికన్నా ఎన్నో ఎక్కువ రెట్లు పెరిగింది. కాని దానిని లెక్కించనందు వలన అధికారిక ధరల సూచీని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డట్టు చిత్రిస్తారు.

నిజానికి జీవన వ్యయం పెరిగిన ప్రతీ సందర్భంలోనూ ప్రజలు సర్దుబాటుకు రెండు విధాలుగా ప్రయత్ని స్తారు. మొదటిది: ఉన్న ఆస్తులను, సంపదను అమ్ముకోవడం. లేదా అప్పులు చేయడం. రెండవది: వినిమయాన్ని తగ్గించుకోవడం. అలా వినిమయాన్ని తగ్గించుకోవలసి వచ్చినప్పుడు అత్యంత అవసరమైన వాటికి మాత్రమే ఖర్చు చేస్తారు. వైద్యం అటువంటి అత్యవసరమైన ఖర్చు. ప్రయివేటీకరణ కారణంగా దాని ఖర్చు బాగా పెరిగింది. ఐనా ఖర్చు చేయక తప్పదు. అందుకోసం ప్రజలు తమ తిండి ఖర్చులను సైతం తగ్గించుకోవలసి వస్తోంది. పిల్లల చదువు నిమిత్తం చేసే ఖర్చుకు కూడా అటువంటి ప్రాధాన్యతే ఉంటుంది. ఈ రెండు సేవలనూ ప్రయివేటు రంగం నుండి పొందాల్సి వస్తున్నందున భారతదేశంలో అత్యధిక కుటుంబాలలో తమకున్న బంగారాన్ని, ఇల్లును, లేదా పొలాన్ని అమ్ముకునో, తాకట్టు పెట్టో సర్దుబాటు చేసుకోడం సర్వసాధారణం అయిపోయింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా జరుగుతోంది. దాని ఫలితంగా ఆ కుటుంబాల ఆహార వినియోగంలో తీవ్ర మార్పులు వచ్చాయి. తిండి ఖర్చులు తగ్గించుకోవడం వలన ఆర్థిక స్థితిగతుల్లో పెద్ద మార్పులు రావన్న సంగతిని వారు గమనించడం లేదు. ప్రజల ఆస్తులు, అప్పులను సర్వే చేసే అఖిల భారత వ్యవస్థ ఎఐఆర్‌డిఐఎస్ 2013కు, 2019కి మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతంలో అప్పుల పాలైన కుటుంబాల సంఖ్య పదకొండు శాతం పెరిగినట్టు తేల్చింది. దానితోబాటు సగ టు కుటుంబ రుణం 43 శాతం పెరిగినట్టు కూడా తేల్చింది. అంతేగాక సగటు ఆస్తుల విలువ 39 శాతం తగ్గినట్టు నిర్ధారించింది. ఇదంతా కేవలం 7 సంవత్సరాల మధ్య కాలంలో మాత్రమే సుమా. ఇక పట్టణాలలో పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. స్వయం ఉపాధి ద్వారా జీవించే కుటుంబాల రుణం 24 శాతం పెరిగింది. సగటు ఆస్తుల విలువ 29 శాతం తగ్గింది. అంటే దేశంలో ప్రజల సంపద నయా ఉదారవాద కాలంలో క్షీణించింది అన్నది స్పష్టం.

ఇక రెండో విధంగా సర్దుబాటు చేసుకునేవారి విషయం చూద్దాం. తమ వినిమయాన్ని తగ్గించుకోవడం ద్వారా జీవన వ్యయ భారాన్ని తగ్గించుకోవాలనుకునేవారి విషయంలో కనీస పోషకాహారం 2200 క్యాలరీలు కూడా పొందలేకపోతున్నవారి శాతం 1993-94లో 58 ఉంటే 2011-12 నాటికి అది 68 శాతానికి పెరిగింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి. ఇక పట్టణాలకు వస్తే కనీసం 2100 క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేనివారి శాతం 57 నుండి 65కి పెరిగింది. 2017-18 లో మళ్ళీ సర్వే జరిపితే వచ్చిన గణాంకాలు మరీ ఘోరంగా ఉన్నాయి. దాంతో ఆ గణాంకాల వివరాలను బహిరంగ పరచడా నికి మోడీ ప్రభుత్వం సాహసించలేదు. ఆ సర్వేలో గ్రామీణ ప్రాంతంలో కనీసపు స్థాయిలో పౌష్టికాహారం పొందలేక పోతున్న వారి శాతం 80ని దాటింది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రపంచ బ్యాంక్ నివేదికలు మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఉంటున్నాయి.

రోజుకు తలసరి ఖర్చు రూ.53 కన్నా తక్కువ చేస్తున్నవారి శాతం 2011-12లో 12 ఉంటే 2022-23లో అది రెండు శాతానికి తగ్గిందని ఆ నివేదికలు అంటున్నాయి! ఆయా దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న లోప భూయిష్ట మైన ప్రమాణాలనే ప్రాతిపదికగా తీసుకుని ప్రపంచబ్యాంక్ ఈ నిదార్ధరణలకు వచ్చింది. తద్వారా పలు మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పేదరికం తగ్గిపోయిందంటూ చేసుకుంటున్న ప్రచారానికే వంత పాడుతోంది. కోట్లాది మంది ప్రజలు పేదరికం లోంచి విముక్తి చెందారంటూ సాగుతున్న ఈ ప్రచారం కేవలం క్రూరమైన అవహేళన మాత్రమే. ఐరాస నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను ఎంత వరకూ ఆ యా దేశాలు చేరుకోగలిగాయన్న విషయం రాబోయే రోజుల్లో ముందుకు రానుంది. అందుచేత ఇటువంటి తప్పుడు ప్రచార హోరు మరి కాస్త పెరుగుతుంది.

(స్వేచ్ఛానుసరణ)

> రోజుకు తలసరి ఖర్చు రూ.53 కన్నా తక్కువ చేస్తున్నవారి శాతం 2011-12లో 12 ఉంటే 2022-23లో అది రెండు శాతానికి తగ్గిందని ఆ నివేదికలు అంటున్నాయి! ఆయా దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న లోప భూయిష్ట మైన ప్రమాణాలనే ప్రాతిపదికగా తీసుకుని ప్రపంచబ్యాంక్ ఈ నిదార్ధరణలకు వచ్చింది. తద్వారా పలు మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పేదరికం తగ్గిపోయిందంటూ చేసుకుంటున్న ప్రచారానికే వంత పాడుతోంది. కోట్లాది మంది ప్రజలు పేదరికం లోంచి విముక్తి చెందారంటూ సాగుతున్న ఈ ప్రచారం కేవలం క్రూరమైన అవహేళన మాత్రమే. ఐరాస నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను ఎంత వరకూ ఆ యా దేశాలు చేరుకోగలిగాయన్న విషయం రాబోయే రోజుల్లో ముందుకు రానుంది. అందుచేత ఇటువంటి తప్పుడు ప్రచార హోరు మరి కాస్త పెరుగుతుంది.

తప్పెవరిది? శిక్షెవరికి?



వి.యస్. రావు
9490098890

భవిష్యనిధి, గ్రాట్యుటీ లాగా పెన్షన్ కూడా మూడో బెనిఫిట్‌గా ఇవ్వాలని భారత కార్మికులు కోరుతూ వస్తున్నారు. అది పక్కన పెట్టి కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ఈపీఎస్‌ను 1995లో ముందుకు తెచ్చారు పాలకులు.చట్టంలో పేరా 11(3) చేర్చి హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌ను ముందుకు తెచ్చి సీలింగ్ జీతంపైన కాకుండా పూర్తి జీతంపైన పెన్షన్ ఫండ్‌కు నిధులు చెల్లిస్తే, చివరి 12 నెలల సగటు జీతం ఆధారంగా పెన్షన్ చెల్లిస్తామని 1996లో సవరణ చేశారు.మూడో బెనిఫిట్‌గా పెన్షన్ ఇవ్వరని అర్థం చేసుకొని, పూర్తి జీతంపై పెన్షన్ నిధికి 8.33శాతం నిధులను జమ చేసైనా, ఉద్యోగ విరమణ అనంతరం కొంత సామాజిక భద్రత వస్తుందని భావించిన కార్మికులు/ఉద్యోగులు చట్టంలోని 11(3) ప్రకారం హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇచ్చారు. దేశం మొత్తంపైన లక్షల మంది ఇచ్చినట్లే ఉమ్మడి ఏపీఎస్ఆర్టీసిలో కూడా సుమారు 20వేల మంది హయ్యర్ పెన్షన్ ఇచ్చారు.1996 నుండి 2014 వరకు (వారు స్కీంలో చేరిన రోజు నుండి) వారి జీతాల నుండి సీలింగ్ జీతంపైన కాకుండా పూర్తి జీతంపైన పెన్షన్ నిధి కోసం ఆర్టీసి పి.ఎఫ్ ట్రస్ట్ రికవరీ చేసి, ఆ రికవరీలను ఈపిఎఫ్‌ఓ పెన్షన్ నిధికి రెగ్యులర్‌గా జమ చేశారు.

అకస్మాత్తుగా ఆర్టీసి పిఎఫ్ ట్రస్ట్ నుండి ఒక లేఖను (లేఖ నెం: Dy. SUP (P) EPS/H/PEN (Raj) 480(2)(20)/14-15, తేది. 15అక్టోబర్ 2014ను) విడుదల చేస్తూ, ఇప్పటి వరకు హయ్యర్ పెన్షన్ కోసం చెల్లింపులు చేస్తూ వస్తున్న 16,307 మంది హయ్యర్ పెన్షన్‌ను ఈపిఎఫ్‌ఓ వారు తిరస్కరించారని, అందుకని 16,307 మంది వద్ద నుండి పెన్షన్ ఫండ్ కోసం రికవరీ చేసిన డబ్బులలో నుండి సాధారణ పెన్షన్ కోసం చెల్లించాల్సినవి పోను మిగతా డబ్బులకు వారి, వారి వ్యక్తిగత ఖాతాలలో వడ్డీతో సహా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని, 20సెప్టెంబర్2014 నాటి పి.ఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ మీటింగ్ మినిట్స్‌లో నిర్ణయించారు (మినిట్స్ లేఖ నెం. AM(F)/471 (2)/2014-15 - PFT, తేది.20 సెప్టెంబర్ 2014). 1996-2014 మధ్య పదేండ్ల కాలం హయ్యర్ పెన్షన్ కోసం ఈపిఎఫ్‌ఓ అనుమతి లేకుండానే, ఆర్టీసి పిఎఫ్ ట్రస్ట్ రికవరీ చేసిందా? నిధులు తన దగ్గర జమ చేసుకొన్న ఈపిఎఫ్‌ఓ వారు పదేండ్ల తర్వాత ఏ ప్రాతిపదికన రిజెక్టు చేసినట్లు? అందుకు కారణమేమిటి? అనేది నేటికి చిదంబర రహస్యమే.

ఉమ్మడి ఆర్టీసిలో 16,307 మంది (నేడు ఏపీఎస్ఆర్టీసి - 8934; టీజీఎస్ఆర్టీసి-7373 మంది)కి పూర్తి సమాచారం కూడా ఇవ్వక పోవడం దారుణం. 1996లో ఈపిఎస్ చట్టంలో తీసుకొచ్చిన సవరణ ద్వారా అవకాశం కల్పిస్తేనే కదా ఇంతమంది హయ్యర్ పెన్షన్ కోసం అప్లై చేసుకొన్నది. చట్టానికి విరుద్ధంగా ఎందుకు తిరస్కరించారు? అలా తిరస్కరిస్తే పి.ఎఫ్ ట్రస్ట్ ఏం చేసింది? ఆర్టీసి పిఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌గా వున్న గుర్తింపు కార్మిక సంఘం ఎందుకు ఆందోళనలకు పిలుపివ్వలేదు? వారందరికి న్యాయం జరిగేలా ఎందుకు ప్రయత్నం చేయలేదు? ఈ ప్రశ్నలకు ఎక్కడా జవాబులు లేవు. 20 సెప్టెంబర్ 2014 నాడు జరిగిన ఏపీఎస్ఆర్టీసి బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ మీటింగ్‌లో పాల్గొన్నది ఆనాడు గుర్తింపులో ఉన్న ఎంప్లాయిస్ యూనియన్. 16,307 మంది నుండి చేసిన రికవరీలలో నుండి సాధారణ పెన్షన్ కోసం చెల్లింపులు పోను మిగతా డబ్బులు నెల రోజులలోపు వడ్డీతో సహా తిరిగి కార్మికుల అకౌంట్లలోకి జమ చేపిస్తామని రాసుకున్న మినిట్స్ అమలు కోసం 2014-2024 మధ్య ఆ సంఘం చేసిన కృషి ఏమిటి? 2016 లో జరిగిన ఎన్నికలలో గెలిచిన టిఎంయు నాయకులు ఆ తర్వాత బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌గా వున్నారు. మరి 2016 నుండి 2019 వరకు 16,307 మందికి ఈపిఎఫ్‌ఓ నుండి రావలసిన డబ్బులను తిరిగి ఇప్పించేందుకు చేసిన కృషి ఏమిటి? బాధ్యత కలిగిన కార్మిక సంఘాలు ఈ సమాచారం 16,307 మందికి తెలియజేసేందుకు చేసిన ప్రయత్నం ఏమిటి? ఇవన్నీ కార్మికుల మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్నలు.

మరి యాజమాన్యం చేసిన ప్రయత్నం ఏమిటి? సింపుల్‌గా మీ హయ్యర్ పెన్షన్ తిరస్కరించారని ఒక లేఖ పంపి చేతులు దులుపుకున్నది. వారి వద్ద నుండి అదనంగా రికవరీ చేసిన మొత్తాలు తిరిగి కార్మికులకు చెల్లించేలా కృషి చేయాల్సిన బాధ్యత పి.ఎఫ్ ట్రస్ట్‌దేగా. మరి 2014 నుండి 2024 వరకు తెలంగాణ ఆర్టీసిలో వున్న 7373మంది కోసం ఈపీఎఫ్‌ఓ/ఆర్‌పీఎఫ్‌సికి రాసిన లేఖలు ఎన్ని? ఒక్కో కార్మికునికి తిరిగి రావలసిన అసలెంత? ఆయా సంవత్సరాలలో వున్న వడ్డీ రేట్లను అమలు చేస్తే వచ్చే మొత్తాలు ఎంత? ఆర్టీసీ పి.ఎఫ్ ట్రస్ట్ నేటి వరకైనా ఈ లెక్కలు చేసిందా? చేయకపోతే ఎందుకు చేయలేదు? ఆ సమాచారం కేవలం ఆర్టీసి ట్రస్ట్ వద్ద మాత్రమే వుంటుంది. ఎందుకంటే ఆర్టీసి 'మినహాయించబడ్డ ట్రస్ట్'గా నడుస్తున్నది. పదేండ్ల కాలంలో ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించే సమయం లేదా?

కార్మికుల సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకత్వం 2021 సం॥ నుండి ఈ సమస్యను వెలుగులోకి తెచ్చి, పరిష్కారానికి ప్రయత్నిస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హయ్యర్ పెన్షన్ సమస్య మరోసారి చర్చకు వస్తున్నది. అందులో వస్తున్న సమస్యలతో పాటు ఈ సమస్యపై పోరాడుతున్నది. అయినా ఇక్కడ కూడా 16,307 మందికి అన్యాయం జరుగుతున్నది. హయ్యర్ పెన్షన్ కోసం డిమాండు నోటీసులు జారీ చేసేటప్పుడు, అప్పటివరకు పెన్షన్‌ఫండ్‌కు జమచేసిన నిధిని మినహాయించి, మిగిలిన డబ్బులకు మాత్రమే డిమాండ్ నోటీసులు పంపాలని ఈపీఎఫ్‌ఓ నుండి వున్న ఉత్తర్వులను కూడా పరిగణనలోకి తీసుకోకుండా, వీరికి కూడా పూర్తి కాలానికి (1996-2023) మధ్య కాలానికి సంబంధించి చెల్లించాల్సిన మొత్తాలపై డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఫలితంగా ఒకే కాలానికి వారు రెండుసార్లు అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. ఇది అత్యంత దుర్మార్గమైనది. ఆర్‌పిఎఫ్‌సికి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులతో 7అక్టోబర్ 2024న జరిగిన మీటింగ్‌లో దీనినే ప్రధాన సమస్యగా చర్చించడం జరిగింది.వీరికి రావలసిన డబ్బులు తిరిగి చెల్లించాలంటే, అందుకు సంబంధించిన వివరాలతో కూడిన లేఖలను ఆర్టీసి పి.ఎఫ్ ట్రస్ట్ నుండి ఆర్‌పిఎఫ్‌సికి పంపించాలి. ఇప్పటివరకు ఆ పని జరగలేదు. అందుకని 18అక్టోబర్ 2024న ఆర్టీసి చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్‌గా వినతిపత్రం ఇచ్చింది. ఇప్పటికైనా స్పందిస్తారని ఆశిస్తున్నాము.రికవరీలను జమ చేసుకొని, పదేండ్ల తర్వాత తిరస్కరించింది ఈపీఎఫ్‌ఓ. నెల రోజులలోపు ఆ డబ్బులు తిరిగి ఇప్పిస్తామని అంగీకరించింది ఆర్టీసి పిఎఫ్ ట్రస్ట్. కానీ ఏ తప్పు చేయకుండానే ప్రభుత్వాన్ని నమ్మి రూ.220 కోట్ల మేర నష్టపోతున్నది మాత్రం కార్మికులే. తప్పు ప్రభుత్వం, యాజమాన్యది అయితే, శిక్ష మాత్రం కార్మికులకా? ఆలోచించాలి.

అలాగే,అనేక ఆందోళనల తర్వాత పొందిన హయ్యర్ పెన్షన్ హక్కును కేంద్రం తూట్లుపొడుస్తూ, దామషా పద్ధతి పేరుతో అర్హత కలిగిన పెన్షన్‌లో నలభైశాతం కోత పెడుతున్నది. ఇప్పటికే హయ్యర్ పెన్షన్ పొందుతున్న వేలాది మంది ప్రయోజనానికి కూడా త్వరలో ప్రమాదం వస్తుంది. అందుకని మొత్తం పెన్షన్, పీఎఫ్ సమస్యలపై ఆందోళనలు ఉధృతం చేయాల్సిన అవసరముంది. దానికి కార్మికులంతా సిద్ధమవ్వాలి.

> హయ్యర్ పెన్షన్ కోసం డిమాండు నోటీసులు జారీ చేసేటప్పుడు, అప్పటివరకు పెన్షన్‌ఫండ్‌కు జమచేసిన నిధిని మినహాయించి, మిగిలిన డబ్బులకు మాత్రమే డిమాండ్ నోటీసులు పంపాలని ఈపీఎఫ్‌ఓ నుండి వున్న ఉత్తర్వులను కూడా పరిగణనలోకి తీసుకోకుండా, వీరికి కూడా పూర్తి కాలానికి (1996-2023) మధ్య కాలానికి సంబంధించి చెల్లించాల్సిన మొత్తాలపై డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఫలితంగా ఒకే కాలానికి వారు రెండుసార్లు అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. ఇది అత్యంత దుర్మార్గమైనది.





రైతు భరోసా ఇవ్వాలి

- ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- మహిళలకు ఇస్తామన్న రూ.2500 అందించాలి :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

నవతెలంగాణ-మెదక్ టౌన్

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని వాగ్దానం చేసిందని, కానీ ఇప్పుడు దాన్ని అమలుచేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మహిళలకు ఇస్తామన్న రూ.2500ల ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు వాగ్దానాలు చేసిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యం చెందారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీకి ఎక్కడా సంపూర్ణంగా జరగలేదని, అర్హత ఉండి కూడా మాఫీ కానీ రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని గొప్పలు చెబుతున్నా.. అదనంగా బస్సులు నడపకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అవినీతిని అరికట్టాలని, జల సంరక్షణ కోసం రాష్ట్రంలో ఏర్పాటయిన హైడ్రా దౌర్జన్యాలకు పాల్పడుతుందని తెలిపారు. మూసీ సుందరీకరణ పేరుతో దాని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్య ప్రజలను, కార్మికులను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమ కట్టడాల పేరుతో దౌర్జన్యంగా కూల్చేయడం దారుణమన్నారు. హైడ్రా పేరుతో నష్టపోయిన వారికి పునరావాసం కల్పించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం, కార్యదర్శివర్గ సభ్యులు కే. మల్లేశం, బసవరాజు, కె.నరసమ్మ, ఎ. మహేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కె. నాగరాజు డి. మల్లేశం, బాలనర్సు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు అరికట్టాలి

- సిరిసిల్లలో యూసుఫ్‌ను విడుదల చేయాలి
- ఇల్లెందులో సుదర్శన్‌ను ఆదుకోవాలి :

అదనపు డీజీపీకి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను, అక్రమ కేసుల బనాయింపును వెంటనే అరికట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడీజీపీ) మహేష్ భగవత్‌ను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం,పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కార్యదర్శు లు బి రాజశేఖర్, గంద్ర నవీన్, ఎస్‌కే సలీమా, భిక్షపతి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి తదితరులు హైదరాబాద్‌లో ఏడీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తమ యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు మహ్మద్ యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. అతనికి సంబంధం లేని ఒక కేసులో ఆయన్ను ఇరికించారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి అక్రమ కేసు బనాయించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలనీ జర్నలిస్టు యూసుఫ్‌పై పెట్టిన కేసును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులలో శనివారం రాత్రి జర్నలిస్టు సుదర్శన్‌పై దుండగులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారనీ, వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో చాలా చోట్ల జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయనీ, మరోవైపు కొందరు పోలీసు అధికారులు కక్షపూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు ఏడీజీపీని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మర్యాద పూర్వకంగా కలిశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఎర్రవెల్లిలోని ఫాం హౌజ్‌లో కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

నారాయణ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య

- బంధువులు, విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా
- కళాశాల అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం

నవతెలంగాణ-దుండిగల్



(ఫైల్)

దసరా సెలవుల అనంతరం కళాశాల హాస్టల్‌కు తిరిగి వచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకెళ్తే మెదక్ జిల్లా జహీరాబాద్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మయ్య కుమార్తె అనూష నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని నారాయణ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం అనూషను తల్లిదండ్రులు కళాశాలలో వదిలి వెళ్లిపోయారు. ఇంటికి చేరుకున్న కొన్ని గంటల్లోనే వారికి కళాశాల యాజమాన్యం నుంచి ఫోన్ వచ్చింది. అనూష స్పృహ తప్పి పడి పోయిందని, త్వరగా కళాశాలకు రావాలని చెప్పారు. తల్లిదండ్రులు ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటలకు కళాశాలకు వచ్చారు. అక్కడికొచ్చాక.. అనూష హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని యాజమాన్యం చెప్పింది. అయితే, అప్పటికే మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దాంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మధ్యాహ్నమే అమ్మాయిని పంపించామని, ఇంతలోనే ఎందుకు ఆత్మహత్య చేసుకుంటుం దని ప్రశ్నించారు. తాము వచ్చేలోపే ఎందుకు గాంధీకి తరలించారని నిలదీశారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోమవారం అనూష కుటుంబీకులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో కొందరు కళాశాల అద్దాలు, కొంత ఫర్నీచర్ ధ్వంసం చేశారు. బాచుపల్లి పోలీసులు వారిని శాంతింపజేసి పూర్తి విచారణ చేపడతామని తెలిపారు. సీఐ జె.ఉపేందర్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగున్నరేండ్ల ప్రతిష్టంభనకు తెర

సరిహద్దుల్లో గస్తీపై, బలగాల ఉపసంహరణపై భారత్, చైనాల ఒప్పందం



న్యూఢిల్లీ : నాలుగున్నరేండ్ల ప్రతిష్టంభన అనంతరం భారత్, చైనాలు సోమవారం సరిహద్దుల నుంచి బలగాల ఉపసంహరణపై, గస్తీ ఏర్పాట్లపై ఒక ఒప్పందానికి వచ్చాయి. సరిహద్దులకు ఇరువైపులా దాదాపు 50వేల నుండి 60వేల వరకు బలగాలు మోహరించి వుంటాయి. వాటిని ఉపసంహరించుకోవాలని ఉభయ పక్షాలు అంగీకారానికి వచ్చినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి సోమవారం తెలిపారు.

భారత్, చైనా దౌత్యవేత్తలు, సైనిక ప్రతినిధులుల వివిధ వేదికలపై చర్చలు జరుపుతూ వచ్చారని, ఆ చర్చల ఫలితంగా భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో వాస్తవాధీన రేఖ పొడవునా గస్తీ ఏర్పాట్లపై ఒప్పందం కుదిరిందని మిస్రి చెప్పారు. ఇప్పటివరకు అపరిష్కృతంగా వున్న డెమ్‌చాక్, డెప్సాంగ్ ప్రాంతాలపై కూడా ఇప్పుడు ఒప్పందం కుదిరింది. దీంతో 2020 ఏప్రిల్ నుంచి రెండు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన పరిష్కారమవుతుందని భావిస్తున్నారు.

ఒప్పందం వివరాలను విదేశాంగ శాఖ వెల్లడించలేదు. 2020కి ముందు నాటి యథాతథ స్థితికి వస్తుందా లేదా అనేది కూడా తెలియరాలేదు. ఇటీవల ఏర్పాటు చేసిన బఫర్‌జోన్‌లు గస్తీ ప్రయోజనాల కోసం కొనసాగుతాయా లేదా అనేది కూడా తెలియరాలేదు. చర్చించిన అంశాలపై ఒప్పందం కుదిరిందని మాత్రమే మిస్రి చెప్పారు.



మంగళవారం జరగనున్న బ్రిక్స్ సదస్సు కోసం భారత ప్రధాని మోడీ రష్యా వెళ్లనున్న నేపథ్యంలో మిస్రి ప్రకటన వెలువడింది. ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా హాజరు కానున్నారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మోడీ, జిన్‌పింగ్ భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందువల్లే ఈ ఒప్పందం వివరాలను ఇప్పుడు ప్రకటించినట్లు కనిపిస్తోంది. సమావేశం గురించి మిస్రి ధ్రువీకరించలేదు. కజన్‌లో పలు ద్వైపాక్షిక సమావేశాలపై ప్రభుత్వం కసరత్తు జరుపుతోందని మాత్రమే చెప్పారు. గతంలో చైనాలో భారత రాయబారిగా చేసిన మిస్రి ఈ చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

తాజా ఒప్పందంతో చైనాతో బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిందని చెప్పగలమని విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. 2020 తర్వాత వివిధ కారణాల రీత్యా ఉభయులం నిషేధించిన ప్రాంతాలు కొన్ని వున్నాయని, తాజా అవగాహనతో ఆ ప్రాంతాల్లో గస్తీకి వీలు కుదిరిందని చెప్పారు. దీంతో 2020కి ముందు ఎక్కడైతే తాము గస్తీ నిర్వహించామో ఇప్పుడు అక్కడ గస్తీకి అవకాశం లభించిందన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయండి

- ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని నాపంల్లి డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్రంలో ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను చెల్లించేలా ఈ నెల 26న జరిగే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని జేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డి కోరారు. జీఓ నం.317తో రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులందరికీ సత్వరమే న్యాయం చేసే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా సమావేశంలో తీర్మానం చేశారు. రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనీ, నగదు రహిత హెల్త్ స్కీంను అమలు చేసి ఉద్యోగులు పడే ఇబ్బందులు



పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు కె.రామకృష్ణ, డాక్టర్ జి.నిర్మల, దర్శన్‌గౌడ్, రవికుమార్, హన్మంతరావు, ఎస్.రాములు, వివేక్, శశిధర్‌రెడ్డి, వెంకటేష్, సక్కుబాయి, రమేష్ పాక, సత్యనారాయణ, రాబర్ట్ బ్రూస్, ఎండి. మసూద్‌అహ్మద్, రామరాజు, చంద్రశేఖర్‌గౌడ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రూ.21.56 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు

డిసెంబర్ 9లోగా రైతులందరికీ రుణమాఫీ..

- పొలంబాట కార్యక్రమంలో పొలాలకు రోడ్లు ఏర్పాటు
- విద్యార్థులు నూతన పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలి :మంత్రి దనసరి అనసూయ సీతక్క

నవతెలంగాణ-ములుగు



ములుగు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ కోటాలో రూ.21.56 కోట్ల నిధులను మంజూరు చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 9లోగా రూ.2 లక్షల రుణమాఫీని రైతులందరికీ మాఫీ చేస్తామని తెలిపారు. మౌరిటెక్ ఐటీ సంస్థ సౌజన్యంతో పాటు సీఎస్ఆర్ నిధులతో జిల్లాలోని వెంకటాపూర్ జెడ్‌పీహెచ్ఎస్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట, ఎస్ఎస్ తాడ్వాయి మండలాల్లో రోడ్ల మరమత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన పరిజ్ఞాన విద్యను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని అన్నారు. ములుగు జిల్లాలో 176 మందికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చామని, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడానికి సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా పంట పొలాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో పాఠశాలలు, ఆస్పత్రుల భవనాల నిర్మాణం కోసం అనుమతి ఇవ్వలేదని, దాంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా కంటైనర్ పాఠశాల, ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇంచర్ల గ్రామ సమీపంలో రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. ములుగు నియోజకవర్గం 75 శాతం అటవీ ప్రాంతం కావడంతో అభివద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నదని, దీనిపై తాను స్వయంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా విద్యా వైద్యం మెరుగుపరచడంతో పాటు రోడ్డు సౌకర్యాలకు ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్టు చెప్పారు. అనంతరం గోవిందరావు పేటలో 13మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను, తాడ్వాయి రైతు వేదికలో 35 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, డీఈఓ పాణిని, మౌరిటెక్ ఐటీ కంపెనీ ప్రతినిధులు నందమోహన్, మనోజ్ కుమార్, హెడ్మాస్టర్ రాధిక, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు ఫరీద బేగం, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు, కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పొందిన లబ్దిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ అగ్రికల్చర్‌లో అదనంగా రెండు వందల సీట్లు

- ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25)లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కోటా కింద అదనంగా 200 సీట్లను బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో పెంచుతున్నట్టు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఆయన బాధ్యతలు స్వీకరించినంతరం సీట్ల పెంపుదలపై ప్రకటన చేశారు. ప్రస్తుతం సాధారణ కేటగిరీలో 615 సీట్లు, ప్రత్యేక ఫీజుతో సుమారు 227 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 200 అదనపు సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రత్యేక కోటాలో ఉన్న బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు నాలుగేండ్లకు కలిపి మొత్తం పది లక్షల రూపాయలు ఫీజు ఉండగా దానిని రూ.5 లక్షలకు తగ్గించినట్టు తెలిపారు. అలాగే ప్రవేశ సమయంలో ఒకేసారి మూడు లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండగా దాన్ని తగ్గించి రూ. 65వేలు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తద్వారా విద్యార్థులకు వెసులుబాటు కల్పించామని వివరించారు. వ్యవసాయ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని సాంకేతికపరమైన గుర్తింపులేని కొన్ని ప్రయివేటు సంస్థలు మాయమాటలు చెప్పి లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ డిగ్రీ కోర్సులను నిర్వహించేందుకు కావలసిన కనీస వసతులు, సిబ్బందిని నియమించడం లేదని గుర్తు చేశారు. ఇలాంటి గుర్తింపు లేని సంస్థల్లో విద్యార్థులను చేర్చకూడదని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రవేశపెడుతున్న వివిధ కోర్సులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకి సంబంధించిన స్వల్పకాలిక కోర్సులను కూడా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలు లేని నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో కూడా నూతనంగా వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు.

వానాకాలం, యాసంగి సీజన్లకు రైతు భరోసా ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఎన్నికల్లో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వానాకాలం, యాసంగి సీజన్లకు రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ, ధాన్యానికి బోనస్ హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపో వడంతో రైతాంగం ఆందోళన చెందుతోందని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతాంగానికి ద్రోహం చేసిందని విమర్శించారు. వానాకాలం పంటల సీజన్ ముగిసినా రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ వంటివి కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అమలు చేయలేదన్నారు. దీంతో రైతులు అప్పులు తెచ్చి సాగు చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తేనే రైతుల ఆత్మహత్యలు ఆగుతాయన్నారు. ఇప్పటి వరకు సగం మందికి మాత్రమే రుణమాఫీ అయిందనీ, ఇంకా సగం మంది రైతులకు మాఫీ కాలేదన్నారు. వానాకాలం సీజన్‌కు రైతు భరోసా డబ్బులు రైతు ఓల ఖాతాలో జమ కాలేదని గుర్తు చేశారు. వరి రూ.500, మక్కజొన్న రూ.330, కందులు రూ.400, సోయ రూ.450, పత్తి రూ.475, చెరుకు రూ.850, జొన్నలు రూ.308 క్వింటాల్ పంటలకు బోనస్ కలిపి ధరలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సన్న వడ్లతోపాటు దొడ్డు వడ్లకు కూడా రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహ్మారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, మాదినేని రమేష్, వీరెపల్లి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు లెల్లెల బాలక్రిష్ణ, కందాల ప్రమీల, మాటూరి బాల్‌రాజ్ గౌడ్, యం.డి గఫూర్ పాష, శెట్టిపల్లి సత్తిరెడ్డి, యం.శ్రీనివాస్‌లు, పల్లపు వెంకటేష్, యం.డి సర్దార్, చింతల రజినీకాంత్, భూక్య చందూనాయక్, పరమేశ్వర చారి పాల్గొన్నారు.

ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ బీభత్సం

- 33మంది పాలస్తీనియన్లు మృతి
- బీరుట్ శివార్లపై విరుచుకుపడిన క్షిపణులు



గాజా, బీరుట్ : సోమవారం తెల్లవారు జాము నుంచి గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 33మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 18మంది జాబాలియా శరణార్థ శిబిరానికి చెందిన వారే. మరోవైపు ఉత్తర గాజాలో ప్రజల బలవంతపు తరలింపు కొనసాగుతోంది. ప్రజలను బలవంతంగా అక్కడ నుండి తరలిపోయేలా ఆదేశాలు జారీ చేయడం, అలాగే మారణహోమం కొనసాగించడం ద్వారా ఉత్తర ప్రాంతాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందంటూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలావుండగా, బీరుట్‌లోని దక్షిణ శివార్లలో ఇజ్రాయిల్ 12 క్షిపణులతో దాడి జరిపింది. శనివారం ఇలాగే జరిపిన దాడిలో 16మంది మరణించారు. తాజా దాడిలో ఎంతమంది చనిపోయారో ఇంకా వివరాలు తెలియరాలేదు. దక్షిణ లెబనాన్‌లో శాంతి పరిరక్షక దళాలు ఉపయోగించే టవర్‌ను ఇజ్రాయిల్ ఆర్మీ బుల్డోజర్లు నేలమట్టం చేశాయి. లెబనాన్‌లో ఐక్యరాజ్య సమితి తాత్కాలిక బలగాలు (యుఎన్‌ఐఎఫ్‌ఐఎల్)పై ఇది తాజా దాడి అని యూఎన్ పేర్కొంది. గాజాలో ఇప్పటివరకు 42,603మంది మరణించగా, 99,795మంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో పరిస్థితి బీభత్సంగా వుందని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ అధికారి వ్యాఖ్యానించారు. అనూహ్యమైన, భయానకమైన పరిస్థితులను వారు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత 12మాసాల నుంచి నిరంతరంగా కొనసాగుతున్న దాడులు, పదేపదే ఒకచోట నుండి మరోచోటకు తరలింపులు, ఖాళీ చేయడం, వరుస దాడుల కారణంగా అస్తవ్యస్థమైన ప్రజా జీవనం, ప్రాణ, ఆస్తి నష్టం, విధ్వంసం, ఆహారం, నీరు లేని దారుణమైన పరిస్థితులతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల ప్రణాళికా విభాగం డైరెక్టర్ శామ్ రోస్ వ్యాఖ్యానించారు. గత రెండు వారాల్లో పరిస్థితులు మరీ దారుణంగా మారాయన్నారు. గాజాలో దక్షిణ, ఉత్తర, సెంట్రల్ ప్రాంతాలన్నీ లక్ష్యాలుగా మారాయన్నారు. బలవంతంగా ఇళ్లనుండి, శిబిరాల నుండి ప్రజలను ఖాళీ చేయిస్తున్నారని అన్నారు. ఒకపక్క అటూ ఇటూ కదలకుండా వీల్లేని పరిస్థితులను సృష్టిస్తూ మరోపక్క శరణార్థ శిబిరాలపై వరుస దాడులకు దిగడంతో ప్రజలకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 17 రోజుల పాటు ఆహారం, నీరు, మందులు, సహాయం లేకుండా దుర్భర పరిస్థితుల్లో జీవించాల్సి వచ్చిందని డేర్ అల్ బాలాహ్‌కి చెందిన హింద్ ఖౌదరి తెలిపారు. ఉత్తర గాజాకు ఏమీ రానివ్వని పరిస్థితి నెలకొందన్నారు. ఇంత దారుణాలు నెలకొన్న పాలస్తీనియన్లు తమ పోరాటాన్ని, ప్రతిఘటనను ఆపలేదన్నారు. ఎక్కడా సురక్షితమైన ప్రాంతమంటూ లేకుండా పోయిందన్నారు. దక్షిణ లెబనాన్ గ్రామంలో ఇజ్రాయిల్ ఆర్మీ ఇండ్లను పేల్చివేసింది. భీకరంగా దాడులు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో ముందుకు చొచ్చుకుపోవడానికి ఇజ్రాయిల్ బలగాలు ప్రయత్నిస్తున్నాయని లెబనాన్ అధికార వార్తా సంస్థ తెలిపింది. గ్రామ శివార్లలో ఇజ్రాయిల్ ట్యాంకులు కనిపిస్తున్నాయని పేర్కొంది. ఇదిలావుండగా, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మధ్య ప్రాచ్యంలో పర్యటన ప్రారంభించారు. గాజాలో దాడులను ఆరంభించిన తర్వాత ఇది 11వసారి పర్యటించడం. ఇజ్రాయిల్ సహా ఇతర ప్రాంతీయ నేతలతో ఆయన చర్చలు జరుపుతారు. కాల్పుల విరమణ ప్రాముఖ్యతను తెలియజేస్తారని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది.



ఆరోగ్యమిత్రల వేతనాలు పెంచాలి

క్యాడర్ మార్పు చేయాలి : మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఆరోగ్యమిత్రల వేతనాలను వెంటనే పెంచాలనీ, క్యాడర్‌ను మార్పు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ- సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, ఆరోగ్యశ్రీ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ఆరోగ్యశ్రీ హైదరాబాద్ అధ్యక్షులు టి.రాజు తదితరులు మంత్రి దామోదర రాజనర్సింహకు, ట్రస్ట్ సీఈవోకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి ఆదేశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో (ఎఫ్ఏసీ) ఆర్.వి.కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్యమిత్రల క్యాటగిరీలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ (డీపీఓ) క్యాటగిరీలోకి మార్చాలనీ, వేతనం రూ.22,750కు పెంచాలని కోరినా ప్రభుత్వ స్పందన ఆలస్యం కావడంతో ఆగస్టు 6న సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మెలోకి వెళ్లగా, సెప్టెంబర్ 20న ప్రభుత్వం హామీ పత్రం ఇచ్చిందని గుర్తుచేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్ లోకి మార్పుతో పాటు వేతనం రూ.19,500 పెంచుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అణలు, సమ్మె చేసిన మూడు రోజులు వేతనం చెల్లించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. అదే విధంగా సమ్మె నోటీస్‌లోని మిగిలిన డిమాండ్లు ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించడం, ఎనిమిది గంటల పనిదినం అమలు, ఎఫ్ఆర్ఎస్ సమస్య, హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం, చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాల పట్ల చర్చల సమయంలో సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అంగీకరించిన అంశాలను అమలు చేయాలని వారు కర్ణన్‌కు విజ్ఞప్తి చేశారు.

జీవో 29 రద్దుకు చొరవ చూపండి

- గవర్నర్‌కు బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవో 29 రద్దుకు చొరవ చూపాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆ సంఘం నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జీవో 29 వల్ల బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఆయనకు వివరిం చారు. ఈ జీవో వల్ల అగ్రవర్ణాలు ఉద్యోగాల్లో లబ్దిపొందుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు అన్యాయం చేసే జీవో 29ను రద్దు చేసిన తర్వాతే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

త్వరలో సమగ్ర కుల గణన సర్వే

- బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో త్వరలో సమగ్ర కుల గణన సర్వే నిర్వహించనున్నట్టు బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి వచ్చె నెల 8 వరకు ఉమ్మడి జిల్లాల్లో బీసీ కమిషన్ పర్యటిస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరిస్తామని తెలిపారు. సమగ్ర సర్వే షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను రాజ్‌భవన్ లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వివరించినట్టు పేర్కొన్నారు. అలాగే కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, సమగ్రంగా సేకరించిన కులాల వివరాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన వెల్లడించారు.

రేపు, ఎల్లుండి మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటన

- 25న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూసీ పరివాహక ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో తమ పార్టీకి చెందిన 9 బృందాలు పర్యటిస్తాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ప్రకటించారు. అందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర, స్థానిక నాయకులు పాల్గొంటారని తెలిపారు. 25న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన మహాధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. మూసీ బాధితులు ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు హామీలను గాలికొదిలేసి మూసీ ప్రక్షాళన పేరుతో మూడు నెలలుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌కు కప్పం కట్టుకోవడానికి ఒక్కో నెల ఒక్కో ఎత్తుగడ వేస్తూ ప్రజను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మొన్న హైడ్రా, నిన్న ఫోర్త్ సిటీ, ఇవాళ మూసీ సుందరీకరణ-పునరుజ్జీవం అంటూ ప్రకటనలు చేస్తూ పోతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల మేర అప్పులు చేసి దివాళా తీసిందని చెప్తున్న కాంగ్రెస్ నాయకులు.. ఎడాపెడా ఖర్చులు చేస్తూ విదేశీ టూర్లకు వెళ్తున్నారన్నారు. దక్షిణ కొరియాలోని సియోల్ పర్యటన అర్థంపర్థం లేని పర్యటన అని విమర్శించారు. మూసీ నది పునర్జీవనం ప్రాజెక్టుకు డీపీఆర్ కోసం 141 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారనీ, డీపీఆర్ లేకుండా ప్రతిపక్షాలతో ఎలా చర్చిస్తారని ప్రశ్నించారు. 11వేల కుటుంబాలు ఇబ్బంది పడుతు న్నాయనీ, వాటిని ఆదుకునేందుకు ఎక్కడి నుంచి నిధులు తీసుకొస్తారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తు శుద్ధి ఉంటే ప్రజలను ఇబ్బంది పెట్టకుండా మూసీ కిరువైపులా రిటైనింగ్ వాల్ కట్టి, ఆ తర్వాత మూసీ సుందరీకరణ-పునరుజ్జీవం చేయాలని కోరారు. గండిపేట్ నుంచి మొదలు ఉప్పల్, భువనగిరి వరకు కాలుష్యాన్ని, డ్రైయినేజీ నీటిని మూసీలో కలుపు కుంటూ.. మూసీ సుందరకీరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు.

లాభసాటి పంటలపై అన్నదాతలు దృష్టి సారించాలి : మంత్రి తుమ్మల

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

రైతులు సంప్రదాయ పంటలపై కాకుండా లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంరూరల్ మండలం గుర్రాలపాడులో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాతావరణ సమస్యల కారణంగా పంటల్లో తేమ ఉంటుందని, రైతులు ఓపికగా పంటను ఆరబెట్టి తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో ఉండేలా చూసుకోవాలని, అప్పుడే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు.

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుల నియామకం

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు సభ్యులను నియమించింది. ఈమేరకు సోమవారం వ్యవసాయ, సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, న్యాయవాది ఎం. సునీల్‌కుమార్ (హైదరాబాద్), రాంరెడ్డి గోపాల్‌రెడ్డి (ఖమ్మం),గడుగు గంగాధర్ (నిజామాబాద్), కేవీ నరసింహ్మారెడ్డి (నాగర్‌కర్నూల్), చెవిటి వెంకన్న యాదవ్ (సూర్యపేట్), మరికంటి భవాని తదిరులను సభ్యులుగా నియమించింది. ఈ కమిషన్ చైర్మెన్‌గా ఎం కోదండరెడ్డి ఉన్నారు.

బాలసదన్‌లో బాలికపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి..

నవతెలంగాణ-భువనగిరి

అనాథలకు రక్షణ కల్పించాల్సిన మహిళా శిశు సంక్షేమ శాఖలోనే బాలికలకు రక్షణ లేకుండా పోయింది. ఓ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో వెలుగుచూసింది. ఈ నెల 14న ఒక కార్యక్రమం నిర్వహణ పేరుతో డీసీపీఓతోపాటు మరి కొంతమంది రాత్రి 7 గంటల సమయంలో బాలసదన్‌కు వచ్చారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ బాలిక బాత్రూంకు వెళ్లి వస్తుండగా.. ఓ వ్యక్తి లైంగికదాడి చేశాడు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన బాలిక ఏడ్చుకుంటూ తన గదిలోకి వెళ్లిపోయింది. గమనించిన బాలసదన్ సిబ్బంది ఆరా తీయగా ఓ వ్యక్తి తనపై లైంగికదాడి చేశాడంటూ తన శరీరంపై గాయాలను చూపించింది. వెంటనే సిబ్బంది డీసీపీఓకు సమాచారం అందించారు. సంబంధిత వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టకపోగా విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని, చెబితే అందరి ఉద్యోగాలు పోతాయని సిబ్బందిని ఆ ముఖ్య అధికారి బెదిరించినట్టు తెలిసింది. బాలికను వలిగొండలోని ఓ ప్రయివేట్ అనాథాశ్రమానికి తరలించినట్టు సమాచారం. నిందితుడు జిల్లా లీగల్ సెర్వీసెస్‌కు చెందిన ఓ అటెండర్‌గా సమాచారం. కాగా ఆదివారం బాధితురాలు ఉన్న వలిగొండ శాంతి నిలయంలో సంబంధిత బాలసదన్ అధికారులు, కౌన్సిలర్ విచారణ జరపగా.. తనపై లైంగికదాడి జరిగిన విషయాన్ని చెప్పినట్టు తెలిసింది.

కేసు నమోదు

ఈనెల 20న బాలసదన్ సిబ్బంది ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశాల మేరకు సీడబ్ల్యూసీ కమిటీ విచారణ చేయనున్నది. ఈ సంఘటనపై అల సత్వం వహించిన అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు.

రూ.10 నాణేలపై బిఒబి క్యాంపెయిన్



నవతెలంగాణ - హైదరాబాద్

రూ.10 నాణేల చెల్లుబాటుపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించడానికి ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహించింది. ఈ క్రమంలోనే సోమవారం బిఒబి హైదరాబాద్ మెట్రో రీజియన్ ప్రజలకు రూ.10 పంపిణీ చేసింది. ఈ ప్రాంతంలోని 43 శాఖల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టింది.

రూ.10 నాణేలు చెల్లుతాయ్

- ఇండియన్ బ్యాంక్ క్యాంపెయిన్



నవతెలంగాణ - హైదరాబాద్

రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతాయని ఇండియన్ బ్యాంక్ ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతోంది. దీనిపై తెలుగు రాష్ట్రాల్లోని తమ 480 శాఖల్లో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్‌లు చేపడుతున్నామని ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎస్ శ్రీనివాస రావు తెలిపారు. నాణేం చెల్లదనే అపోహలు వీడాలన్నారు. తక్షణ చిల్లర చెల్లింపుల కోసం ఈ నాణేలు చాలా సౌకర్యంగా ఉంటాయన్నారు.



మక్క రైతుల తిప్పలు..

వీడని అకాల వర్షాలు.. కంటి మీద కునుకు లేదు..

- ఆశించిన ధర పలికినా.. అందని ఫలితం
- మార్క్‌ఫెడ్ పోటీ ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-నర్సంపేట

అకాల వర్షాలు మొక్కజొన్న రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆరబోసిన మక్కలను వర్షం భారీ నుంచి కాపాడుకోవడం రైతులకు పెను సవాల్‌గా మారింది. మార్కెట్‌లో అమ్మకం చేసే లోపే వర్షం పడి దిగుబడి తడిసి ముద్దైతోందనే దిగులు రైతులను వెంటాడుతుంది. మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతున్నా.. చేతికి ఫలితం అందకుండా పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఎంతో ఆశతో రైతులు విస్తారంగా మొక్కజొన్న పంట సాగు చేశారు. పండించిన పంట చేతికొచ్చిందనే సంబరంతో మార్కెట్‌కు తీసుకొస్తే నిరాశే ఎదురైతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు మద్దతు ధరకు మించి పలుకుతున్నా మార్క్‌ఫెడ్ మార్కెట్లోకి అడుగుపెట్టలేదు. ప్రస్తుతం మద్దతు క్వింటాపై ధర రూ.2225 నుంచి 2300 ఉండగా వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం వెయ్యి బస్తాలు ఖరీదు చేశారు. గరిష్టంగా ధర రూ.2454, కనిష్టంగా రూ.2016 పలికింది. 16 శాతం లోపు తేమ ఉన్న మక్కలకు నాలుగు రోజులుగా సాలినా ధర రూ.2350 పలుకుతూ వచ్చింది. మార్కెట్‌లో దాదాపు 3వేల పైచిలుకు బస్తాలు ఆరబోసి కొనుగోలుకు సిద్ధంగా ఉంది. కొనుగోళ్లు పుంజుకుంటే రోజుకు రెండు వేల బస్తాలు వచ్చే అవకాశం ఉంది. కాగా, తరచూ పడుతున్న వర్షం కారణంగా తేమ 18 శాతానికి మించి ఉండటంతో వ్యాపారులు కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. రోజూ కురుస్తున్న వర్షం వల్ల మార్కెట్‌లో ఆరబోసిన మక్కలను టార్పలిన్లు వేసినా సీసీ గచ్చు కింది భాగం నుంచి వస్తున్న వరద నుంచి కాపాడుకోవడం కష్టతరంగా మారిందని చిలుకమ్మ నగర్ చెందిన బానోతు బాలు అనే రైతు వాపోయాడు. రెండు ఎకరాల్లో పండిన మొక్కజొన్న చేతికి రాగా మార్కెట్‌కు తీసుకొస్తే కాపాడుకోవడం కోసం నానా తిప్పలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ ఉందనే సాకుతో సాధారణంగా తడిసిన మక్కలను కూడా కొనుగోలు చేయకుండా నిరాకరించడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తీసుకొచ్చిన మక్కలను వెంటనే కొనుగోలు చేసినట్లయితే తమకు ఈ తిప్పలు తప్పుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో జగిత్యాలలో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దాంతో వారు రైతులను దోచుకుంటున్నారు. తరుగుపేరిట క్వింటాల్‌కు సుమారు 4 కిలోల వరకు కోతపెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సింగరేణిలో 2349 మంది బదిలీ వర్కర్లు

జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ

సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2349 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఏరియాలకు ఉత్తర్వుల పత్రాలను విడుదల చేశారు. కార్మికులు సింగరేణి సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేశారు. 1వ తేదీ సెప్టెంబరు 2024 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కారుణ్య నియామక ప్రక్రియ కింద సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారసులను ముందుగా బదిలీ వర్కర్లుగా గుర్తిస్తూ, సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూ గర్భంలో పనిచేయ డానికి యాజమాన్యం పోస్టిం గులు ఇస్తుంటుంది. ఈ విధంగా గనులకు కేటాయిం చబడిన బదిలీ వర్కర్లు ఏడాదిలో కనీసం 190 మస్టర్లు (పని దినాలు) పనిచేసినట్లయితే వారిని జనరల్ మజ్దూర్లుగా యాజమాన్యం గుర్తిస్తుంది. ఉపరితల గనులు, విభాగాల్లో అయితే 240 మస్టర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. గతంలో ఈ ప్రక్రియకు ఏండ్ల తరబడి సమయం తీసుకుంటూ ఉండేవారు. కాగా సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉద్యోగంలో చేరిన వారు ఏడాదిలో 190 మస్టర్లు పూర్తి చేయగానే ప్రమో షన్ ఇవ్వాలని పర్సనల్ విభాగం అధికా రులను ఆదేశించారు. సింగరేణిలో ఒకేసారి 2349 మందిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అంకిత భావం, క్రమ శిక్షణతో పనిచేయాలని సీఎండీ కార్మికులకు సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలో అత్యధికంగా 662 మంది జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగోన్నతి పత్రాలను పొందారు. రామగుండం-1 ఏరియాలో 552 మంది, భూపాలపల్లిలో 467 మంది బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా రెగ్యుల రైజ్ అయ్యారు. మందమర్రిలో 310 మంది, అడ్రియాలా లాంగ్ వాల్ ప్రాజెక్టు ఏరియాలో 218 మంది, ఆర్జీ-3 ఏరియాలో 50 మంది, కార్పొరేట్‌లో 25, మణుగూరులో 19, ఆర్జీ-3 లో 12, కొత్తగూడెంలో 16, ఇల్లందు, బెల్లంపల్లిలో 9 మంది చొప్పన జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ అయ్యారు.

ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదు



- రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రూ.20 లక్షలతో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఎవరు అడ్డుపడినా మూసీ నది ప్రక్షాళన ఆగదని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు నడుం బిగించగా.. ప్రతిపక్షాలు అనవసరంగా అడ్డుపడుతున్నాయన్నారు. ఏదేమైనా మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.కోటితో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాల భవనాలను ఒక్కొక్కటి ఎకరం స్థలంలో నిర్మిస్తామని చెప్పారు. అవసరమైతే మరిన్ని ప్రత్యేక ఫండ్స్ మంజూరు చేయించి మూడు కార్యాలయాలను పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్న వారికి రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. 2 లక్షల కన్నా పైన ఉన్నవారి రుణాలకు సంబంధించి రెండు లక్షలను డిసెంబర్ 7 లేదా 9న మాఫీ చేస్తామని చెప్పారు. రూ.4కోట్లతో చెరుపల్లి, తిప్పర్తి రోడ్డు మంజూరు చేశామన్నారు. ఇందుగుల, తిరుమర్తి, మామిడాల, నకిరేకల్ రహదారి పనులకు రూ.60 కోట్లు మంజూరు చేశామన్నారు. కురుమర్తి నుంచి సూర్యాపేటకు డబుల్ రోడ్డు వేయనున్నామని, త్వరలోనే ఈ రోడ్డు మంజూరు చేస్తామని తెలిపారు. మాడుగులపల్లికి 75 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏఎమ్మార్పీ కాలువల ద్వారా ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో తన సొంత నిధులు ఖర్చు చేసి కాలువల్లో పూడిక తీత, చెట్ల తొలగింపు చేపట్టామన్నారు. నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన ఎస్ఎల్బీసీ సొరంగం పనులను అనుకున్న సమయంలో పూర్తి చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు. అనంతరం మంత్రి గ్రామశివారులో ఉన్న నల్లకుంట చెరువు నుంచి కాల్వలకు వెళ్లే నీటి మోటార్లకు స్విచ్చాన్ చేశారు. కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, నల్గొండ ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి, డీపీఓ మురళీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, డీఈ గణేష్, పంచాయతీ కార్యదర్శి కాసిం, నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక కష్టాలతో అమ్మకానికి పసికందు

కుదరని బేరం.. మధ్యవర్తితో వివాదం..

- గమనించిన స్థానికులు.. 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు
- సిద్దిపేట శిశు గృహకు శిశువు తరలింపు



నవతెలంగాణ-రాయపోల్

నవ మాసాలు మోసి జన్మనించిన ఓ కన్నతల్లి కనీసం కనికరం లేకుండా కసాయి తల్లిగా మారి కన్నపేగు బంధాన్ని మానవత్వం మర్చి విక్రయించాలని చూసింది. ఇలాంటి హృదయ విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామ అటవీ ప్రాంతంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లె పహాడ్ గ్రామానికి చెందిన పోతుల రూప రెండవ కూతురు 20 రోజుల శిశువును బేరం పెట్టింది. గజ్వేల్ మార్కెట్ యార్డులో బేరం కుదుర్చుకున్నారు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై గజ్వేల్-చేగుంట రోడ్డు మార్గంలో ఇందుప్రియాల్ గ్రామం అటవీ ప్రాంతంలోకి వెళ్లి అక్కడ భేరం మాట్లాడుకునేందుకు ప్రయత్నించారు. మొత్తం ముగ్గురు పురుషులు, ఒక మహిళా కొనుగోలుదారులు, మధ్యవర్తుల మధ్య భేరం కుదరకపోవడంతో వారి మధ్య గొడవ జరిగింది. అడవిలో గొర్లకాపరులు ఆ గొడవను గమనించి సంఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీయగా ముగ్గురు పురుషులు, ఒక మహిళ అక్కడ నుంచి పరారయ్యారు. గొర్రె కాపరులు తల్లీబిడ్డను రోడ్డుపైకి తీసుకువస్తుండగా వర్షం కురవడంతో గజ్వేల్ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనాన్ని ఆపారు.

వాహనదారులు విషయం తెలుసుకొని 1098 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బాల పరిరక్షణా అధికారులు ఇందుప్రియాల్ అంగన్వాడీ టీచర్ సుల్తానకు సమాచారం ఇచ్చారు. టీచర్ అక్కడికి వెళ్లి తల్లీబిడ్డను అంగన్వాడీ కేంద్రానికి తీసుకువచ్చింది.

బాలల పరిరక్షణ అధికారులు, చైల్డ్ హెల్ప్ లైన్, ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి తల్లి బిడ్డను సిద్దిపేట శిశు గృహానికి తరలించారు. అనంతరం సిద్దిపేట శిశుగృహ సామాజిక కార్యకర్త రాజారాం మాట్లాడుతూ.. శిశువు ఆరోగ్య పరిస్థితి పరీక్షించిన తర్వాత పూర్తిస్థాయి విచారణ చేపట్టి శిశువును తల్లి రూపకు అప్పజెప్పడమా లేదా శిశు గృహలో ఉంచడమా నిర్ణయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ అధికారి కవిత, నర్స్ శ్యామల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, అంగన్వాడీ టీచర్ సుల్తాన, మంజుల, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పోలీసు సిబ్బందికి భోజనం తగిన వసతి ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. పోలీసు పిల్లల భవిష్యత్తు కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను 50ఎకరాల్లో నెల కొల్పుతున్నట్టు తెలిపారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి అధికారి వరకు వారి పిల్లలకు అత్యుత్తమ విద్యనందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే తానే స్వయంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డ్రగ్స్ నియంత్రణ విషయంలో పోలీసు అధికారులు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఏఐని ఉపయోగించాలి

పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా అధికారులు విరివిగా ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలు ఎనలేనివని కొనియాడారు. వారిలో రాష్ట్రానికి చెందిన గ్రేహౌండ్స్‌కు చెందిన కానిస్టేబుల్ కూడా ఉన్నారన్నారు. విధినిర్వహణలో అమరులైన పోలీసుల పేర్లను సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ చదవగా సాయుధ పోలీసులు అమరుల స్థూపానికి వందన సమర్పణ చేశారు. ఈసందర్భంగా పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మాజీ డీజీపీలు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఆర్డర్లు ముందే సిద్ధం చేసుకున్నారా?

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరాల వరకు ఐదవ నియంత్రణ కాలానికి సంబంధించిన బహుళ వార్షిక టారిఫ్ గైడ్‌లైన్స్ ఫ్రేమ్ చేసేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలపై టీజీఈఆర్సీ నూతన కార్యాలయంలో చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు (టెక్నికల్) ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య (ఫైనాన్స్) బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈనెల 29తో కమిషన్ కాలపరిమితి ముగుస్తున్నదనీ, ఆలోపే అన్నింటిపై ఆర్డర్లు ఇచ్చేయాలనే అత్యుత్సాహం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలకు చెందిన 9 ప్రతిపాదనలపై కేవలం మూడు వారాల్లో అధ్యయనం, బహిరంగ విచారణలు, ఆర్డర్లు తయారు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. "ఈనెల 29తో కమిషన్ కాలపరిమితి ముగుస్తుంది. ఈనెల 21 నుంచి 25 వరకు విద్యుత్ సంస్థలు ఇచ్చిన 9 ప్రతిపాదనలపై బహిరంగవిచారణలు నిర్వహిస్తున్నారు. ముందస్తుగా ఆర్డరు కాపీలు సిద్ధం చేసుకుంటే తప్ప, కేవలం రెండు రోజుల్లో ఆర్డర్లు తయారుచేసి, ముద్రించి ఇవ్వడం సాధ్యం కాదు. ఇది సరైన ప్రాక్టీస్ కాదు. బహిరంగ విచారణల పేరుతో మమ్మల్నందర్నీ ఎందుకు పిలుస్తున్నారు. మేం చేసే సూచనల్లో ఏ ఒక్కటీ ఎందుకు మీ ఆర్డరు కాపీల్లో ఉండట్లేదు" అని కమిషన్‌ను ప్రశ్నించారు. "విద్యుత్ సంస్థలు ఆలస్యంగా ఇచ్చిన ప్రతిపాదనల్ని ఆమోదించడమే తప్పు. దాన్ని సమర్థించుకోవడానికి పెనాల్టీలు విధించామని చెప్తున్నారు. ఒకేరోజు జెన్‌కో ట్రూ అప్ ప్రతిపాదనలు, ఐదవ నియంత్రిత కాలానికి సంబంధించిన గైడ్‌లైన్స్ ఫ్రేమ్ చేసే అంశంపై బహిరంగ విచారణలు నిర్వహించడం ఏంటని? అని అడిగారు. గడిచిపోయిన కాలానికి సంబంధించి జెన్‌కో ప్రతిపాదించిన రూ.963 కోట్ల ట్రూఅప్ చార్జీలను తిరస్కరించాలని కోరారు. 2022-23కు సంబంధించి ఇంత ఆలస్యంగా క్లెయిమ్ చేయడం సరికాదన్నారు. కేంద్రప్రభుత్వ విధానాల ప్రకారమే టీజీఈఆర్సీ పనిచేస్తున్నదనీ, ఆ విధానాలన్నీ కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నవేనని చెప్పారు. ఈఆర్సీ తనకు ఉన్న చట్ట పరిధిలో సామాన్య విద్యుత్ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. జెన్‌కో ఇష్టం వచ్చినట్టు ఖర్చులు చేసి, వాటిని ఇప్పుడు జనం నుంచి వసూలు చేసుకుంటామని చెప్పడం భావ్యం కాదనీ, వారు కచ్చితంగా ఖర్చుల్ని నియంత్రించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. గడచిపోయిన కాలానికి విద్యుత్ సంస్థలు క్లెయిములు చేయడం, దాన్ని ఈఆర్సీ పరిశీలన చేయడం అంటే చనిపోయిన శవానికి పోస్టుమార్టం చేసినట్టే ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతకుముందు టీజీజెన్‌కో డైరెక్టర్ సచ్చిదానందమూర్తి జెన్‌కో ట్రూఅప్, 5వ నియంత్రిక కాలానికి సంబంధించిన గైడ్‌లైన్స్‌ను ఆమోదించాలని కోరుతూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. జెన్‌కో ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ 13 పిటీషన్లు దాఖలయ్యాయి. వాటిలో తెలంగాణ స్పిన్నింగ్ అండ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, ప్లాస్టిక్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహా పలు సంఘాలు పిటీషన్లు దాఖలు చేశాయి. బహిరంగ విచారణలో ఆయా సంఘాల ప్రతినిధులు తమ అభ్యంతరాలను తెలిపారు. తొలిసారిగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టీజీఈఆర్సీ పిటీషనర్ల అభ్యంతరాలను స్వీకరించింది.

రేవంత్ సర్కార్ విధానాలతో పారిశ్రామికరంగం కుదేలు

- సామాన్యులపైనా పెను భారాలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- డిస్కంల ప్రతిపాదనలను విరమించుకోవాలంటూ ఈఆర్‌ఏసీ చైర్మెన్‌కు విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేవంత్ సర్కారు అవలంభిస్తున్న అర్థరహిత, అనాలోచిత విధానాలతో రాష్ట్రంలో పారిశ్రామికరంగం దెబ్బతింటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులపైనా తీవ్ర స్థాయిలో విద్యుత్ భారాలు పడతాయని ఆయన హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించాలని విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఈఆర్సీ చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... విద్యుత్ ఛార్జీలను పెంచాలంటూ డిస్కంలు 9 ప్రతిపాదనలు చేశాయని గుర్తు చేశారు. గృహాలకు వాడే కరెంటుకు సంబంధించి నెలకు 300 యూనిట్లు దాటితే వసూలు చేసే ఫిక్స్‌డ్ ఛార్జీలను రూ.10 నుంచి ఏకంగా రూ.50కి పెంచాలంటూ ప్రతిపాదించటమనేది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.

ఈ ఒక్కటే మొత్తం రాష్ట్ర ప్రజల ఆర్థిక పరిస్థితిని ఇబ్బందుల్లోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా సామాన్యులపై విద్యుత్ భారాలు తీవ్రంగా పడతాయని వాపోయారు. పరిశ్రమలన్నింటినీ ఒకే కేటగిరీ కింద ప్రతిపాదించటం సరికాదన్నారు. తద్వారా పలు పరిశ్రమలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి నిర్ణయాలు దేశంలో మరెక్కడా లేవని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామికరంగ మందగమనంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి ప్రతిపాదనల వల్ల కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతాయని హెచ్చరించారు. మోటార్లకు మీటర్లు పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపటం లేదన్నారు. ఇలాంటి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ బుధవారం ఈఆర్ఏసీ నిర్వహించబోయే బహిరంగ విచారణలో పాల్గొంటామని తెలిపారు.

మేం లేవనెత్తిన అంశాల్ని సుప్రీం వ్యతిరేకించలేదు...

గ్రూప్-1కు సంబంధించి తాము లేవనెత్తిన అంశాలను సుప్రీంకోర్టు వ్యతిరేకించలేదని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. జీవో 29పై తీర్పు వచ్చే వరకు ఫలితాలు విడుదల చేయొద్దంటూ న్యాయస్థానం ఆదేశించిందని గుర్తు చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లకు అనుగుణంగా తమ ప్రభుత్వం గతంలో జీవోనెంబరు 55ను తీసుకొచ్చిందని తెలిపారు. తద్వారా మెరిట్ ప్రకారం అందరికీ అవకాశం కల్పించామని అన్నారు. అందుకు భిన్నంగా జీవో 29 అనేది ఓపెన్ కోటాను కూడా రిజర్వ్ చేసేలా ఉందని చెప్పారు. ఇది అన్యాయమైన ఉత్తర్వంటూ గత ఫిబ్రవరి నుంచే తాము చెబుతూ వచ్చామని అన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి చెవికెక్కలేదని విమర్శించారు. మత ఘర్షణలను ఖండించే స్వేచ్ఛ కూడా ప్రతిపక్షాలకు లేదా? అని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి తనపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారని వాపోయారు.

పేదలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలి



నవతెలంగాణ-నాగోల్

పేదలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా ప్రయివేట్ దవాఖానల యాజమాన్యాలు కృషి చేయాలని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తెలిపారు. న్యూ నాగోల్ రాఘవరెడ్డి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓరిన్ యూరో ఆండ్రోకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. మెరుగైన వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందేలా డాక్టర్లు సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో దవాఖాన నిర్వాహకుడు, డాక్టర్ బి. సౌరభ్ చంద్రారెడ్డి, డాక్టర్ బి. రాంచంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కొప్పుల జనార్ధన్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు



నవతెలంగాణ-చంపాపేట్

సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర హెూటల్ ఎదురుగా రహదారి నిర్మాణానికి ఏడాది కిందట తవ్వారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పనులు చేయకపోగా పక్కనున్న వీధుల్లోకి వెళ్లేందుకు వాహనదారులు పాదచారాలు విద్యార్థులు, మహిళలు నానావస్థలు పడుతున్నారు. వర్షానికి గుంతలు తయారయ్యాయి. రోడ్డు నిర్మించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ఎప్పుడు ఏమైతదో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా త్వరితగతిన పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

- అదనపు కలెక్టర్ కదిరవన్ పలని



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహిస్తున్నట్టు అదనపు కలెక్టర్ కదిరవన్ పలని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాలకు చెందిన 237 అర్జీలు వచ్చాయి. ఆ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 237 దరఖాస్తులు రాగా.. గృహ నిర్మాణ శాఖవి 193, పెన్షన్లు 10, భూ సమస్యలకు సంబంధించినవి 01, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 1, ఇతరములు 34 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జి.ఆశన్న, పెరిక యాదయ్య, ఆర్.కోటాజి, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్, ఇలియాజ్ అహ్మద్, ఒడ్డెన్న, ఆర్. రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ నగర్ ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్‌గా కేతావత్ రాజు నాయక్



నవతెలంగాణ-ఎల్‌బీనగర్

ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్‌గా కేతావత్ రాజు నాయక్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ దేవాలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు అన్ని వసతులు కల్పిస్తూ, భక్తులకు ఇబ్బంది కలగాకుండ చూస్తామన్నారు. ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ గా నియమించిన సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.గోప నాయక్ పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్‌గా తమ బంజారా ముద్దు బిడ్డ 40 సంవత్సరాల తరువాత నియమితులైనారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కే ప్రేమ్ నాయక్, నాను నాయక్, కే రవి నాయక్, ఎస్ భాస్కర్ నాయక్, వి దాక్య నాయక్, యస్ హరీ నాయక్, యస్ నరేష్ నాయక్, వి రవి నాయక్, వి దశరథం నాయక్, కే దేవ్ సింగ్, ఎస్ రవి నాయక్, ఎస్ శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-బడంగ్ పేట్

బడంగ్ పేట్ లో నూతనంగా నిర్మించిన శ్రీ బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, కళ్యాణ మహెూత్సవంలో ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సిరి సంపదలతో సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ప్రజలందరికీ బీరప్ప స్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన కళ్యాణ మహెూత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, ప్రజా ప్రతినిధులు ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శోభ ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లిక్కి మమత కష్టారెడ్డి,ముత్యాల లలిత కష్ణ,ఏనుగు రాంరెడ్డి, సీనియర్ సంరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలి

- సెక్షన్ ఆఫీసర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై సమీక్షించాలి
- హెచ్.ఓ.డీలు తప్పని సరిగా ప్రజావాణికి హాజరు కావాల్సిందే
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో అక్రమ నిర్మాణాలను నియంత్రించడంపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల సమస్యలను అడుగుతూ అర్జీలను స్వీకరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి భరోసా నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజలకు సాయం అందిచడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి హెచ్ఓ డీలు తప్పనిసరిగా హాజరుకావాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజావాణిలో ఎక్కువగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ నిర్మాణాలు పూర్తిగా నియంత్రించేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. డీసీలు, సెక్షన్ ఆఫీసర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రతి నెల సమీక్ష సమావేశం నిర్వహించి, ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? నిబంధనల మేరకు ఎన్నింటికి నోటీసులు జారీ చేశారు? ఎలాంటి యాక్షన్ తీసుకున్నారు? తదితర విషయాలపై సమీక్షించాలని సీసీపీకి సూచించారు. సమీక్షకు సంబంధించిన మినిట్స్ చేయాలని, అట్టి మినిట్స్ నివేదికను తనకు అందజేయాలన్నారు. డీసీ స్థాయిలో ఫిర్యాదులను పరిశీలించి తప్పనిసరిగా యాక్షన్ తీసుకోవాలన్నారు. హెల్త్ విభాగానికి సంబంధించిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇతర అన్ని అంశాలను రెగ్యులర్‌గా సమీక్షించి మినిట్స్ చేయాలని సీఎంహెచ్‌ఓను ఆదేశించారు. వెటర్నరీ విభాగానికి వచ్చిన ఫిర్యాదుల వివరాలను, సెంటర్ వారీగా స్టెరిలైజ్ చేసిన కుక్కల వివరాల నివేదికను అందజేయాలని చీఫ్ వెటర్నరీ అధికారిని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను కంప్యూటర్‌లో నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, రఘు ప్రసాద్, నళిని పద్మావతి, సత్యనారాయణ, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, యాదగిరి రావు, సీఈ భాస్కర్ రెడ్డి, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, చీఫ్ ఎంటమాలజి డాక్టర్ రాంబాబు, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం సాయి రమణ, జాయింట్ కమిషనర్లు మహేష్ కులకర్ణి, ఉమా ప్రకాష్, హౌసింగ్ ఎస్ఈ కష్టారావు, డిప్యూటీ సీఈ పనస రెడ్డి, హౌసింగ్ ఈఈ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గార్బేజ్ ఫ్రీ సర్కిళ్లుగా మార్చాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



గార్బేజ్ వాల్నరేబుల్ పాయింట్స్ (జీ.వీ.పీ)లను తొలగించి ఆ ప్రాంతాలను గార్బేజ్ ఫ్రీ సర్కిళ్లుగా మార్చాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఆయన కేబీఆర్ పార్కు, శ్రీరాం నగర్ బస్తీ, యూసుఫ్ గూడ ప్రాంతాల్లో శానిటేషన్ పనులపై ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీవీపీ రహిత సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి చెత్త సేకరణ 100 శాతం జరగాలని కమిషనర్ ఏఎం అండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. యూసుఫ్‌గూడ ఎస్.టీ.పీ పరి శీలించి 25 టన్నుల వాహన సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేబీఆర్ పార్కు వద్ద విద్యుత్ దీపాల ఆన్ ఆఫ్ స్విచ్ పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వీధి దీపాలు రాత్రి సమయంలో వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, సహాయ వైద్య అధికారి భార్గవ్ నారాయణ, ఈఈ తదితరులు ఉన్నారు.

సీఎం వద్దకు జీవో 317 సబ్ కమిటీ రిపోర్ట్

- జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జేఏసీ
- మంత్రుల కమిటీకి ధన్యవాదాలు తెలిపిన జేఏసీ నాయకులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ రిపోర్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు అందజేయడంపై జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది. రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ 317 జీవోపై అనేక సమావేశాలు నిర్వహించి.. చర్చించి సబ్ కమిటీ నివేదికను రూపొందించింది. ఈ సందర్భంగా జేఏసీ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, సందీప్, మధుసూదన్ రెడ్డి, రాపోలు శేఖర్, చాముండేశ్వరి, వినోద, హారతి తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ధ్వంసం చేసిన స్థానికతను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే పునరుద్ధరించి స్థానికత కోల్పోయిన ప్రతి బాధితులకు న్యాయం చేస్తామని ఆ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం 317 జీవో సబ్ కమిటీని ఏర్పాటు చేసి త్వరగతిన రిపోర్టు అందించడం శుభపరిణామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో సబ్ కమిటీ రిపోర్ట్ స్థానికత కోల్పోయిన ప్రతి ఉద్యోగ ఉపాధ్యాయునికి తన స్థానికత తిరిగి ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం స్పందించి దీనికి సంబంధించిన గైడ్‌లైన్ వెంటనే విడుదల చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎరుకల కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి

- ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు ఎరుకల



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎరుకల జాతి అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించిన ఏకలవ్య కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ పదవిని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితికి చెందిన వారికే కేటాయించాలని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు ఎరుకల రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తమ సంఘం సుదీర్ఘ చరిత్ర, సిద్ధాంతాలు కలిగి ఉందన్నారు. తమకు గత ప్రభుత్వం ఎరుకలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఎరుకల తెగ ప్రజల అభివృద్ధికి ఏకలవ్య కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎరుకల తెగ ప్రజలు విద్య, ఉద్యోగ, సంక్షేమ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అత్యంత వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధి కోసం ఎరుకల కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించి, అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య ఫైనాన్స్ కో-ఆపరేటివ్ చైర్మెన్ పదవి ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితికి ఇస్తేనే గ్రామీణ ఎరుకలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వోలుగుమాను బలరాం ఎరుకల, దాసరి కిషన్ ఎరుకల, మానుపాటి కృష్ణ ఎరుకల, మానుపాటి రవి ఎరుకల తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి : టీపీఎస్‌ఏ



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి. మధుసూదన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శులు విస్తత స్థాయి కార్యవర్గ సమావేశం పీ.మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఈ కింది విషయాలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉన్నతాధికారుల, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలను గ్రేడుల వైజ్ గా పునర్వ్యవస్థీకరణ చేసి, ఉద్యోగులు/క్యాడర్ ల కేటాయింపు నియామకపు తేది నుంచి ఉద్యోగ సర్వీసును లెక్కిస్తూ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ కాల పరిమితిని నాలుగు సంవత్సరాల నుండి రెండు సంవత్సరాలకు తగ్గించి, ప్రమోషన్లు కల్పించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ద్వారా చేపట్టిన పంచాయతీ కార్యదర్శుల నియమకాలను రద్దుచేస్తూ, ప్రస్తుతం పనిచేస్తున్న ఓపిఎస్ ను జేపీఎస్‌లుగా మారుస్తూ, సర్వసు కాలాన్ని జేపీఎస్ సర్వసుగా పరిగణించాలన్నారు. జీవో ఎం ఎస్ నెం. 317 వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులను తిరిగి వారి స్వంత జిల్లా/జోన్లకు బదిలీచేయాలని కోరారు. పంచాయతీ రాజ్ చట్టం 2018 మందు పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన సెక్షన్ లల్లో సవరణలు చేయాలని, పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి లో పంచాయతీ కార్యదర్శులు సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రాజీలేకుండా శ్రమిస్తారని చెప్పారు. ఒక్క రోజు పంచాయతీ కార్యదర్శి లేకుంటే ఊరిలో పారిశుధ్య, మంచినీటి, వీధి దీపాలు, రోడ్లు, డ్రయినేజి మొదలగు మౌలిక సమస్యలు పుట్టుకోస్తాయన్నారు. అందుకే ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల ప్రాధాన్య తను గుర్తుంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఈర్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) లెక్చరర్స్ కాలనీ కార్యదర్శిగా కృష్ణారెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

సీపీఐ(ఎం) లెక్చరర్స్ కాలనీ కార్యదర్శిగా ధోనూరు కృష్ణారెడ్డి ఎన్నిక య్యారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్ నగర్ లెక్చరర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన శాఖ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి

- మేయర్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ, బడంగ్ పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలోని 24, 26వ డివిజన్ పరిధిలోని విశాఖ నగర్ నుండి శివాలయం వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైందని, ఆ రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరుతూ మేయర్ పారిజాత నర్సింహా రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవ్వారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ దాదాపు రెండున్నర సంవత్సరం క్రితం రోడ్డును వాటర్ పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేయడంతో స్థానికంగా ఉన్న పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా అల్మాస్ గూడ నుండి గుర్రంగూడ, బి ఎస్ రెడ్డి నగర్ వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని ఈ విషయం స్థానిక కార్పొరేటర్ల దష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవటం లేదని ఆయా డివిజన్ల ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ఆయా కాలనీల అసోసియేషన్ సభ్యులతో కలసి అధ్వానంగా ఉన్న రోడ్డుని పరిశీలించి మేయర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. వెంటనే స్పందించిన మేయర్ సంబంధిత అధికారులను, రోడ్డు కాంట్రాక్టర్‌ను సంప్రదించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులను బాగు చేయిస్తామని మేయర్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

'అవినీతి అధికారి ప్రభు వినయ్‌ని కాపాడుతున్నదెవరు'

- ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవటానికి భయమెందుకు
- అతడిని సస్పెండ్ చేయాలి
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్ అవినీతి అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాపాడుతున్నదెవరని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ అధికారులపై మండిపడ్డారు. సోమవారం ఆబ్కారీ శాఖ భవనం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభు వినయ్ కుమార్ గత 4 నెలల నుంచి విధులకు హాజరు కాకుండా, హాజరు రిజిస్టర్, ఫైళ్లను ఇంటి వద్దకే తెప్పించుకుని సంతకాలు చేస్తూ జీతం తీసుకుంటున్నారని వనపర్తి జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేసి 17 రోజులైనా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతడిని ఎందుకు కాపాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభు వినయ్ బీసీ కులంలో పుట్టి క్రిస్టియన్ గా మారి ఉద్యోగంలో జాయిన్ అయ్యారని, ఆ తరువాత క్రిస్టియానిటీ మతం తీసుకున్న వారు తమ తమ కులానికి వెళ్ళటానికి అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఘర్ వాపసీ స్కీం కింద బీసీ కులంలోకి వెళ్లకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎస్సీగా మార్చుకుని, నిజమైన ఎస్సీ సోదరులకు అన్యాయం చేశారన్నా ఆరోపణలు అతడిపై ఉన్నాయన్నారు. రేపటిలోగా అతడిని సస్పెండ్ చేయడంతో పాటు ఒక నిజ నిర్ధారణ కమిటీ వేసి అతడి అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని, లేని పక్షంలో ఎల్లుండి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తామని, అప్పుడు ఆయనతో పాటు ఆయనకు సహకరించిన వారి బండారం మొత్తం బట్టబయలు అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు బడేసాబ్, రాఘవేందర్, మ్యాదరి రాజు, సాయిబాబా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన డివైడర్ నిర్మాణ పనులు ఆగవు



నవతెలంగాణ - హస్తినాపురం


ఎవరెన్ని ఒత్తిళ్లు తెచ్చినా నూతన డివైడర్ నిర్మాణా పనులు ఆగవని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. స్వరాష్ట్రం లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ 370 కోట్లను కేటాయించి ందని తెలిపారు. టీకేఆర్ కమాన్ నుండి సాగర్ రింగ్ రోడ్ మీదుగా టీ బి.యస్.రెడ్డి వరకు నూతనంగా నిర్మిస్తున్న డివైడర్ పనులను ఏ.ఈ మల్లికార్జున్ గౌడ్ తో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని,నూతన డివైడర్ల పై క్రీడల పట్ల అవగాహన కల్పించే విధంగా క్రీడా చిత్రాలను ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. కొన్ని సందర్భాల్లో ఆయా కాలనీ వాసుల వాసుల ఫిర్యాదు మేరకు పనులను పరిశీలించామని, రాజకీయంగా ఎవరెన్ని ఒత్తిళ్లు తెచ్చిన డివైడర్ ల నిర్మాణా పనులు ఆగబోవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వివిధ కాలనీలో వాసులు ఉన్నారు.

హయత్ నగర్‌లో గంజాయి విక్రేత అరెస్ట్..

నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్‌లో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపయ్య గూడెం వద్ద గుడిసెల్లో ప్రవీణ్ కుమార్ ఆంధ్రప్రదేశ్ నుండి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయాలు చేసేవాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 17న హయత్ నగర్‌లో ఓ కాలనీ వద్ద సాయి నవీన్ అనే వ్యక్తి సూర్యాపేట జిల్లా హయత్‌నగర్‌లో తన స్నేహితుడి వద్ద ఉండి గంజాయిని అమ్మే ప్రయత్నం చేయగా విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 1500గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహెూత్సవం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ శ్రీ బీరప్ప స్వామి కామరాతిదేవిల విగ్రహ ప్రతిష్ఠాపన, కళ్యాణ మహెూత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వైస్ చైర్మెన్ చిగిరింత నరసింహారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేపా భాస్కర్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు గౌర రమాదేవి శ్రీనివాస్, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మనోహర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మధుసూదన్, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పెద్దబావి సమరసిహ్మారెడ్డి, ఎర్ర జైహింద్, గట్టు బాలకష్ణ, విజయ్ కుమార్, శ్రీరామ్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, పెద్దబావి సమరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపక పురస్కారం గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-హయత్ నగర్

కవి, రచయిత, గాయకులు, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ రంగారెడ్డి జిల్లా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవానిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సోమవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 2024కు గాను ఉత్తమ అధ్యాపక పురస్కారం డా..చింతల రాకేష్ భవానికి అందజేశారు. ఆయన గతంలో హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేసి బదిలీపై ఇబ్రాహీం పట్నంకు వెళ్లారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ కాళోజి ప్రాంగణంలో నిర్వహించగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే జ్యోత్స్నప్రభ మాట్లాడుతూ డాక్టర్ చింతల రాకేశ్ భవాని సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో విశేషమైన కషి చేస్తూ రాణిస్తున్నారని తెలిపారు. అధ్యాపకునిగా ఆయన చేసిన పలు సేవలను కొనియాడారు. గౌరవ అతిథి కడెం సోమన్న మాట్లాడుతూ డా.రాకేశ్ భవాని కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించారనీ తెలియజేస్తూ నేటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కళాశాలకు ఉత్తమ అధ్యాపక పురస్కారం రావడం కళాశాలకు గర్వ కారణమన్నారు. విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది డా.రాకేశ్ భవానిగారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. డా. చింతల రాకేశ్ భవాని మాట్లాడుతూ ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. కళాశాల తనకు అనేక అవకాశాలను కల్పించిందని తప్పకుండా కళాశాలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తానని తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అనాజీపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంమహేశ్వర సురాభాండేశ్వర గుడి నిర్మాణానికి సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు వరకాల బాలరాజ్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బయో టాయిలెట్ బస్సు బీభత్సం



నవతెలంగాణ-మెహిదీపట్నం

నాంపల్లిలో బయో టాయిలెట్ బస్సు బీభత్సం సృష్టించింది. గ్రూప్ 1 పరీక్షల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో అభ్యర్థుల కోసం బయో టాయిలెట్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ కళాశాల వద్ద పరీక్ష రాయడానికి వచ్చే విద్యార్థుల కోసం బయో టాయిలెట్ బస్సును ఏర్పాటు చేశారు. డ్రైవర్ అజాగ్రత్తతో బస్సు నడపడం వల్ల కాలేజీ గోడ, గేటు ధ్వంసం అయింది. దీంతో పోలీసులు గేటు పక్కకు పెట్టారు. అయితే, ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థి చదువుకు బాసటగా బండారి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని సాయి బాబా నగర్‌కు చెందిన కుంచం నర్సయ్య కుమారుడు కుంచం గీతకృష్ణ నిర్మల్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసన సభ్యుడు బండారి లక్ష్మారెడ్డి తన సొంత నిధులతో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్‌కు అయ్యే ఫీజు రూ.29వేల చెక్కు వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు బైరీ నవీన్ గౌడ్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దీన్, ఇంద్రయ్య, బంక వెంకటేష్, శ్రీకాంత్ గౌడ్, ప్రసాద్, మధు, గౌస్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఉప్పల్ కార్యదర్శిగా జే. వెంకన్న



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో జరిగిన 5వ మహాసభలో ఉప్పల్ సర్కిల్ సీపీఐ(ఎం) కార్యదర్శిగా జే. వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. తన ఎన్నిక కు సహకరిచిన వారికీ ధన్యవాదాలు తెలిపారు. ఉప్పల్ సర్కిల్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం గా ఎర్రజెండా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ప్రజల పక్షాన, ప్రజలకు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. కమిటీ సభ్యులుగా ఉపేందర్, జె. లలిత, నాగశేషు, భీష్మా చారి, ఎండీ గౌస్, ఎం. అశోక్‌రెడ్డి, పెద్ద స్వామి, ఊర్మిళ, ఎస్. వెంకటేశ్వర్లు, నాగరాజు ఎన్నికయ్యారు.

హేమంత కేశవ్ పాటిల్‌ను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

ఎల్బీ నగర్ ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండా రి లక్ష్మారెడ్డితో కలిసి మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఓల్డ్ మల్లాపూర్, మీనానగర్, వెంకటరమణ కాలనీ, బ్యాంక్ కాలనీ, మల్లికార్జున్ నగర్ కాలనీ, అశోక్ నగర్ కాలనీల్లో హై మాస్ట్ లైట్లు, గోకుల్ నగర్ కాలనీల్లో (ఎఫ్‌సీఐరోడ్డు) సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు.

ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన ప్రభుదాస్



మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని కాలనీలకు సంబంధించి ఐమాక్స్ పోల్స్, సిమెంట్ పోల్స్ మంజూరు చేయాలని ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ వినతి పత్రం అందజేశారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ ఏఎస్‌రావు డివిజన్ పరిధిలోని త్యాగరాయ నగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు అండగా వైఎస్ఆర్



నవతెలంగాణ-ఘట్కేసర్, ఘట్కేసర్ రూరల్

గ్రూప్ వన్ పరీక్షల కొరకు హైదారాబాద్‌కు తరలివచ్చిన అభ్యర్థులకు ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో పలు సౌకర్యాలు కల్పించారు. 7రోజుల పాటు సాగనున్న పరీక్ష సమయంలో వివిధ జిల్లాల నుండి హైదారాబాద్‌లో పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థులకు వైఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి భోజనం, వసతి విషయంలో ఇబ్బందులకు గురికాకుండా వసతులు కల్పించారు. దీంతో పలువురు గ్రూప్స్ అభ్యర్థులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్‌రెడ్డి ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు పరిశీలించిన మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బొల్లిగూడ నుండి చెంగిచెర్ల వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుమారు కోటి ముప్పై లక్షల నిధులతో నిర్మిస్తున్న రోడ్డుతో ఇక్కడి ప్రజలకు మెరుగైన రవాణ సౌకర్యం కలుగుతుందన్నారు. బొల్లిగూడ, క్రాంతి కాలనీ, సూరజ్ నగర్ పరిధిలో సౌకర్యాలు లేక అక్కడ నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారిని దృష్టిలో ఉంచుకొని పనులను చేపడుతున్నట్టు చెప్పారు. ఒకటి తర్వాత ఒక పనిని పూర్తిచేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొత్త కిశోర్ గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ(ఎం) లక్ష్యం

- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు
డీజీ. నరసింహారావు



నవతెలంగాణ-ఉప్పల్

పేద ప్రజల సమస్యల పరిష్కారమే సీపీఐ(ఎం) లక్ష్యమని, ఎర్రజెండా పేదలకు అండగా ఎల్లప్పుడూ ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు అన్నారు. ఆదివారం ఉప్పల్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం) 5వ మహాసభకు ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు, వామ పక్ష శక్తులు బలపడుతున్నాయన్నారు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష వాది దిశనాయాకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అలాగే చిలీ, బ్రెజిల్, ఫ్రాన్స్ దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయన్నారు. భవిష్యత్తులో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండానే మార్గమని చెప్పారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రభుత్వ రంగాన్ని కాపాడు కోవాల్సిన కర్తవ్యం మనపై ఉందన్నారు. అందుకు ప్రజలను, కార్మికులను, రైతులను, మహిళలను కలుపుకొని ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. రాష్ట్రంలో పార్టీలు మారాయి తప్పా.. అనుసరిస్తున్న పద్ధతులు ఒకటేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా ఉద్యమాలు చేయడమే లక్ష్యంగా సీపీఐ(ఎం) రానున్న కాలంలో పనిచేస్తుందన్నారు. ఈ సందర్భం గా మేడ్చల్ సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ. . గత మహాసభలో నుండి ఈ మహాసభల వరకు ప్రజల కోసం చేసిన పోరాటాలు, ప్రజా ఉద్యమాలు, సాధించిన విజయాలు, అపజయాలను సమీక్షించుకొని ప్రభుత్వ విధానాలు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయో వాటి కోసం చేయాల్సిన భవిష్యత్ కార్యాచరణ రూపొందిసామన్నారు. ఉప్పల్‌లో పార్టీ అభివృద్ధికి ఈ మహాసభ తోడ్పడుతుందన్నారు.

ఈ మహాసభల్లో తీర్మానాలు

1)మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లను కూల్చివేయాలని నోటీసులు అందజేయడం జరిగింది. ఉప్పల్ ప్రాంతంలోని బాలకృష్ణ కాలనీలో ఇండ్లను కూల్చాల్సిన అవసరం లేదని డిమాండ్ చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు.

2)ఉప్పల్ పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఈఎస్ఐ, పీఎఫ్ తదితర బెనిఫిట్‌లు అమలు చేయాలని తీర్మానించారు.

3)మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, జనావాసాల మధ్య ఉన్న వైన్స్‌లను తీసేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జే. చంద్రశేఖర్, ఎం. వినోద, కే. రవి, ఉప్పల్ నాయకులు ఎ. వెంకటేష్, బాలరాజ్, బాలయ్య, అంజమ్మ, రాఘవరావు, మధు, నారాయణ, కొమరయ్య, చలపతిరావు, చార్లెస్, పరిపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు భేష్

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు
కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు బాగున్నాయని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన గ్రూప్ -1 పరీక్షల ఉప్పల్‌లోని స్ఫూర్తి మహిళా డిగ్రీ కాలేజీ, వాగ్దేవి డిగ్రీ కాలేజీ, మేఘా మహిళా డిగ్రీ కాలేజీలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో కలియ తిరిగి గదులు, సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ షాపులను మూసి ఉంచారా..? లేదా..? అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు కేటాయించిన సిబ్బంది ఫోన్లను కూడా పరీక్ష గదుల్లోని అనుమంతించకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. 17,762 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారనీ, 1.30 గంటలలోపే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. ప్రతి హాల్‌లో 24 మంది అభ్యర్థులు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జేఎన్‌టీయూలో కస్టోడియన్లు, పోలీసు బందుబస్తుతో ప్రతిరోజూ పరీక్షా పత్రాలను తీసుకొస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం



నవతెలంగాణ -శామీర్‌పేట

మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఐడీఏ, లక్ష్మాపూర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు లక్ష్మాపూర్‌లోని గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ పొలాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని అలియాబాద్ విద్యుత్ ఏఈ వెంకట నారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయం వినియోదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు

విజ్ఞాన భారతి విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ-శామీర్‌పేట

క్రీడలతో పాటు చదువులో రాణించాలని విజ్ఞాన భారతి స్కూల్ ప్రిన్సిపాల్ జంగారెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విజ్ఞాన భారతి స్కూల్ విద్యార్థులను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి మహబూబునగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్ 18 జూనియర్ విభాగంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టుకు తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని విజ్ఞాన భారతి హై స్కూల్ విద్యార్థులు మజ్జి సాయికుమార్, బొమ్మ బన్నీలు ఎంపికయ్యారని సోమవారం ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్, టీఆర్ఎస్ఎంఏ ఉపాధ్యక్షుడు గొనె హనుమంతరెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ ప్రశాంత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉప్పల్

బీరప్పగడ్డ ప్రాంతంలో ప్రజా సమస్య లు పరిష్కరించాలని కోరుతూ బీరప్పగడ్డ వెస్ట్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు రాచకొండ శివకుమార్, సౌత్ ప్రశాంత్ నగర్ అసోసియేషన్ సభ్యులు ప్రశాంత్‌లు సోమవారం ప్రజావాణిలో ఉప కమిషనర్ ఆంజనేయులుకు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీలో రోడ్డు సగం వరకే వేశారని, ఓపెన్ నాలా తీసేసి అండర్ గ్రౌడ్ డ్రయినేజీ వేయాలని, సెంట్ మార్క్స్ హైస్కూల్ దగ్గర చెత్త ఇష్టానుసారంగా వేస్తున్నారని, చెత్త వేయకుండా సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు సామల నాగరాజు, బాలయ్య, పిట్ల శ్రీనివాస్, తమ్మల శ్రీను, మణికంఠ, బొమ్మల నర్సమ్మ, సుశీల, సావిత్రి, బాలమణి, పాల్గొన్నారు.

ప్రపంచ విజేతలే లక్ష్యంగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ



- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రపంచ స్థాయి విజేతలను తయారు చేయడమే సీఎం కప్ టర్చ్ ర్యాలీ ఉద్దేశమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనా రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జీవీ గోపాల్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8గంటలకు తూంకుంట మున్సిపల్ కేంద్రం ప్రధాన చౌరస్తా నుంచి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ వరకు సీఎం కప్ టర్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనా రెడ్డి, సీనియర్ ప్లేయర్ మర్రి లక్ష్మారెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర నలుమూలల్లో ఉత్తమ ప్రతిభ కలిగిన క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రపంచ స్థాయిలో పోటీపడి విజేతలుగా నిలిచేలా తయారు చేయడమే సీఎం కప్ టర్చ్ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ ఈ ఈ నెల 3న సీఎం రేవంత్ రెడ్డి ఎల్బీ స్టేడియంలో ప్రారంభించారని తెలిపారు. ఈ టార్చ్ ర్యాలీ 32 జిల్లాలు తిరుగుతూ ఆదివారం మేడ్చల్ జిల్లాకు వచ్చిందన్నారు. ఈ ర్యాలీలో 450మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

52 ఏండ్ల మహిళకు 'హైపెక్ సర్జరీ'



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈస్ట్ హైదరాబాద్‌లోనే మొదటి సారిగా 52 ఏండ్ల మహిళకు విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ వైద్యులు హైపెక్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ అండ్ సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ యు.ఆజాద్ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా, ముదిగొండ గ్రామానికి చెందిన నాయిని లలితకు ఎంతో సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను 10 నుంచి 12 గంటల పాటు శ్రమించి విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. లక్షల్లో ఒకరికి వచ్చే ఈ వ్యాధికి శస్త్ర చికిత్స చేయడానికి పెరిటోనెక్టమీ, కోలిసిస్టెక్టమీ, గ్యాస్ట్రెక్టమీ, స్పింక్టెరోటోమీ, జేజునల్ రెసెక్షన్, టోటల్ కోలెక్టమీ, గ్యాస్ట్రోజెజునోస్టోమీ, ఇలియోరెక్టల్ అనస్టోమోసిస్, పేపర్థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కిమోథెరపీ లాంటి అనేక రకాల సర్జరీలు చేయాల్సి వచ్చిందని తెలిపారు. పేషెంట్ కుటుంబ ఆర్థిక స్థితిని పరిగణలోనికి తీసుకు సాధ్యమైనంత వరకు తక్కువ ఖర్చుతో నాణ్యతమైన చికిత్స అందించినట్టు తెలిపారు. రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఓఓ రవీంద్రనాథ్ గరగలి మాట్లాడుతూ సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు, అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ స్థాయి చికిత్సా సదుపాయాలను ఉపయోగిస్తూ, మెరుగైన అత్యుత్తమ వైద్య చికిత్సలను సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే విధంగా అందిస్తున్నామని తెలిపారు. హైపెక్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేయడం గర్వంగా ఉందని ఈ సర్జరీలో పాల్గొన్న డాక్టర్లు డాక్టర్ సమంత్, కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్ట్, డాక్టర్ రవికుమార్ రెడ్డి, సర్జికల్ అంకాలజిస్ట్, డాక్టర్ ఉల్లాస్, సర్జికల్ అంకాలజిస్ట్, డాక్టర్ రాకేష్ కుమార్, సర్జికల్ అంకాలజిస్ట్ తెలిపారు. పూర్తి ఆరోగ్యంతో కేవలం వారం రోజుల్లోనే మహిళను డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు.

అమ్జద్ హబీబ్ సలోన్స్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రసిద్ధ సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్, అమ్జద్ హబీబ్ సలోన్స్ వ్యవస్థాపకుడైన అమ్జద్ హబీబ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అమ్జద్ హబీబ్ ప్రీమియం సలోన్స్ ఫ్రాంచైజింగ్‌ను హైదరాబాద్ నల్లగండ్లలో సినీనటి శ్రద్ధ దాస్, మహా న్యూస్ ఎండీ వంశీకృష్ణ, కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్జద్ హబీబ్ మాట్లాడుతూ.. వందేండ్ల సుదీర్ఘ చరిత్రతో, తమ సలోన్స్ విజయవాడ, మియాపూర్, హైదరాబాద్‌లో ఇప్పుడు ప్రారంభమైనట్టు తెలిపారు. హైదరాబాద్ చుట్టుపక్కల వ్యాపార విస్తరణ కోసం ప్రణాళికలు ఉన్నాయన్నారు. అన్ని ప్రధాన నగరాల్లో ఫ్రాంచైజ్ కోసం ఎవ్వరికైనా కావాలంటే ఇస్తామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తమ బ్రాండ్ తీసుకురావడం చాలా సంతోషంగా ఉందనీ, హైదరాబాద్‌లో చంచల్‌గూడ జైల్‌లో ఖైదీలకు ట్రెనింగ్ ఇస్తున్నానని తెలిపారు. బిజినెస్ హెడ్, ఆపరేషన్స్ మహేష్, నిర్వాహకులు సాయి మాట్లాడుతూ అమ్జద్ హబీబ్ 16 ఏండ్లపాటు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వ్యక్తిగత హెయిర్ స్టైలిస్ట్ అనీ, చాలా బాలీవుడ్ సెలబ్రిటీల స్టైలిస్ట్ అని తెలిపారు. ఈ బ్రాండ్‌ను తెలుగు రాష్ట్రాల్లో తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సలోన్స్ ప్రీమియం క్వాలిటీ ఉత్పత్తులు ఉపయోగించి అసాధారణ హెయిర్ కేర్ సేవలను అందిస్తాయన్నారు. కొత్త అందాల ట్రెండ్స్‌లో ముందంజలో ఉంటాయని చెప్పారు. ఫ్రాంచైజ్ వివరాల కోసం 9704997786, 7298878888 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

23న జాబ్ మేళా : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పనాధికారి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువతకు ఈ నెల 23వ తేదీన కలెక్టరేట్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పనాధికారి రాధిక తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో కేఎల్ గ్రూప్ కంపెనీ పాల్గొంటుందని తెలిపారు. వేరహౌస్ అసోసియేట్ మేల్, ఫీమేల్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ లేదా అంతకంటే ఎక్కువగా అర్హత కలిగి ఉండి ఇంగ్లీష్ చదవడం రావాలనీ, నెలకు జీతం రూ.16 వేల నుంచి రూ.20 వేలు ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్‌కు ఇంటర్ లేదా అంతకంటే ఎక్కువ అర్హత ఉండాలనీ, ఇంగ్లీష్ చదవడం, రాయడం, మాట్లాడటం వచ్చి ఉండాలనీ, నెలకు జీతం రూ.19వేల వరకు ఉంటుందని తెలిపారు. రిసెప్షనిస్టలకు డిగ్రీ అర్హత కలిగి ఉండాలనీ, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలు వచ్చి ఉండాలనీ, రూ.25వేల నెల జీతం ఉంటుందని తెలిపారు. అర్హత గల యువతీ,యువకులు www.nic.gov.in పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. కేఎల్ గ్రూప్ కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలనీ, మిగతా వివరాలకు 9866465024, 7386809422 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



అరోరా కాలేజీలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం హాజరై బ్రెస్ట్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో



అరోరా కాలేజీలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం హాజరై బ్రెస్ట్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో



గాజులరామారం డివిజన్ పరిధి పలు ప్రాంతంల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి కోరారు. ఈ మేరకు సోమవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సంబంధిత విభాగాల ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ నగర్లో కల్వర్టు నిర్మాణం, షిరిడి హిల్స్‌లో సీసీ రోడ్డు, గాజులరామారం గ్రామం లో సీసీ రోడ్డు, ఉమాదేవినగర్, అంబేద్కర్ నగర్‌లో ఖాళీ స్థలాల్లో ప్రహరీ గోడ నిర్మాణం తక్షణమే నిర్మించాలని వినతిలో పేర్కొన్నారు. లేనిపక్షంలో ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా బస్తీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఇందిరమ్మ ఇండ్ల సందడి

- ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు
- కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రక్రియ షురూ
- కమిటీల ఏర్పాటుకు శ్రీకారం
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు మార్గం సుగమమైంది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల చొప్పున మంజూరు చేసిన ప్రభుత్వం, లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను నియమించేందుకు శ్రీకారం చుట్టింది. పేద, మధ్య తరగతి కుటుంబాల కలలు నెరవేర్చేంచుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేస్తామని హామీ నిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మంజూరుకు రంగం సిద్ధం చేసింది. నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున విడతల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల వారీగా, మున్సిపాలిటీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ఆశలు రేకెత్తుతున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు నియోజకవర్గాలకుగాను 17,500 ఇండ్లు దక్కనున్నాయి.

ఆశావహుల్లో సందడి..

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలకు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల సందర్భంగా హామీనిచ్చారు. కానీ ఆ హామీ పూర్తిస్థాయిలో నెరవేర లేదు. ఆయా మున్సిపాల్టీలు, గ్రామాల్లో చేపట్టిన నిర్మాణాలు పూర్తి గాక అర్థాంతరంగా నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం పూర్తయినా.. లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. ఇక కొన్ని ఏరియాల్లో ఇండ్ల నిర్మాణాలు పూర్తి కాగా, లబ్ధిదారులను ఎంపిక చేశారు. నిర్మించిన ఇండ్లకు మౌలిక వసతులు లేకపోవడంతో వాటి పనులు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా సొంత ఇంటి స్థలం ఉన్న వారికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, ఇతరులకు రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించింది. గతేడాది నవంబర్ నెలాఖరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 6 నెలల క్రితం ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇటీవల కమిటీల ఎన్నిక జోరందుకోవడంతో ఆశావహుల్లో సందడి నెలకొంది.

కమిటీల ఎంపిక షురూ

అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే వారిని ఎంపిక చేయాలని కమిటీల కసరత్తు ప్రారంభించింది. ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం గ్రామాలు, మున్సిపల్ కార్పొరేషన్లు, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రభుత్వం ఇటీవల ఇందిరమ్మ కమిటీలను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియను జిల్లాలో కొనసాగిస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాల్టీల్లో ఇందిరమ్మ కమిటీల నియామకానికి పేర్లను పంపాలని ఇప్పటికే ఆయా మున్సిపల్ కమిషనర్లతోపాటు జిల్లాలోని 34 గ్రామ పంచాయతీల్లో కమిటీల ఏర్పాటుకు ఎంపీడీఓలను ఆదేశించారు. కాగా గ్రామ పంచాయతీలో స్పెషల్ ఆఫీసర్ కమిటీ చైర్మెన్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో స్వయం సహాయ సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు సభ్యులుగా ఉంటారు. ఈ ముగ్గురిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఒకరు, ఎస్సీ, సామాజిక వర్గానికి చెందిన వారు ఒకరు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీకి పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. ఇక మున్సిపాల్టీల్లో వార్డులు, డివిజన్ల వారీగా కమిటీలు ఉండనున్నాయి. ఈ కమిటీల్లో స్వయం సహాయ సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు సభ్యులుగా ఉంటారు. ఈ ముగ్గురిలో ఒకరు బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఇద్దరు తప్పనిసరిగా ఉంటారు. వార్డు ఆఫీసర్‌గా కమిటీ కన్వీనర్‌గా ఉంటారు. జిల్లాలో ఇప్పటికే కమిటీల ప్రక్రియ చేపట్టారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగనుంది.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజావాణి సందర్భంగా... కుత్బుల్లాపూర్ సర్కిల్ మునిసిపల్ కార్యాలయం ఎదురుగా సీపీఐ ఆధ్వర్యంలో ..గత ప్రజావాణిలో ఇచ్చిన సమస్యను పరిష్కరించలేదని సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ గిరినగర్ 127 డివిజన్‌లో రోడ్డు పైకి అలాగే ఇతరుల స్థలంలోకి షెడ్‌లు వేశారన్నారు. వాటిని వెంటనే తొలగించాలని వారం క్రితం పిర్యాదు చేసినప్పటికి నేటికీ అధికారులు నేడు, రేపు అంటూ తాత్సరం చెయ్యడం సిగ్గుచేటని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వీడి వెంటనే తొలగించాలని లేనిపక్షంలో కదిలేది లేదని హెచ్చరించారు. డీప్యూటీ కమిషనర్ నర్సింహులు స్పందించి.. సోమవారం తీసివేస్తామని చెప్పడం జరి గింది. ఒకవేళ తీసివేయ్యకపోతే తిరిగి ధర్నా నిర్వహి స్తామని చెప్పి ధర్నాను విరమించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, మండల కార్యవర్గ సభ్యులు సదానంద్, కృష్ణ, శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సయ్య, మండల పార్ట్ నాయకులు చారీ, నాగప్ప, సుంకిరెడ్డి, ప్రాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, అంజయ్యలు మద్దతు తెలపడం జరిగింది.

మానవసేవలో మాధవుడు..వృద్ధుల పాలిట దేవుడు





- సామాజిక సేవలో మాధవరెడ్డి
- నిత్య కృషి వలుడు : వాకిటి రామిరెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి రంగారెడ్డినగర్ డివిజన్ గాంధినగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వెత్త విద్యావేత్త, పూర్వ ఐలా చెర్మెన్, అనంత రెడ్డి ఎడ్యుకేషనల్ మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకులు జి.మాధవరెడ్డి తాను పుట్టి పెరిగిన సిద్దిపేట జిల్లాలోని అల్వాల్ గ్రామంలో 19న ట్రస్టు, లయన్ క్లబ్ అధ్వర్యం లో.. గ్రామంలోని ప్రైమరీ,ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామస్తులకు ఉచిత కంటి పరిక్షలు నిర్వహించారు. సుమారు 400 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా రంగారెడ్డినగర్ ప్రాంతానికి చెందిన అభినవ కవి, పుడమిరత్న అవార్డు గ్రహీత, మానస టూల్ టెక్ అదినేత వాకిటి రామ్ రెడ్డి మాట్లడుతూ ఉన్నత విలువలకోసం ఉజ్వల సమాజభివృద్ధికోసం ఉవ్వేత్తున ఎగిసిపడే ఆశయాలతో, మీ జీవన విదానం, నేడు ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. సూర్యుడే ఆదర్శమన్నట్టుగా ఉషోదయం నుండి నిశిరాత్రి వరకు మీరు చేస్తున్న ఆలోచన సమాజ హితమని, ఇది జగమెరిగినసత్యమన్నారు. పారిశ్రామిక రంగంలో కానీ.. విద్యావిధాన రంగంలో కానీ.. వ్యవసాయ రంగంలో కానీ.. మీ కృషి నభూతో..న భవిష్యత్ అన్నారు. స్వార్థంతో నిండిన నేటి సమాజంలో నిస్వార్థ సేవలో ప్రతిపేదవాడు కూడా జీవించాలి అని.. మీ బాల్యంలో లోనే గొప్ప సంకల్పభావాన్ని బలపరుచుకొని శక్తికి మించిన సేవలందిస్తూ.. (వయస్సు మళ్లిన తల్లితండ్రుల కు కళ్లచూపేందుకు అన్నవారి) దృష్టుల మాటలకూ చలించి సర్వేంద్రియానం.. నయనం ప్రదానం అన్నారు. తల్లితండ్రుల దీవెనలతో లయన్ క్లబ్స్ ఆధ్వర్యంలో... ఎందరో చూపులేని వారికి ఉచిత కంటి ఆపరేషన్స్‌తో మరో ప్రపంచాన్ని చూడగలిగే చూపు నిస్తున్న మహానీయులు,మనుషుల్లో మాధవులై వెలుగుతున్న దార్శనికులని మహానుభావుల బాటలో పయనిస్తున్న మాధవుడు జి.మాధవరెడ్డి అని కొనియాడారు. అనంతరం పూలమాల శాలువా వేసి మెమొంటో అందచేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ జిల్లా గవర్నర్ రాజేంద్ర ప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సాయికుమార్, ధన్ పాల్ రెడ్డి శ్రీనివాస్,70 మంది లయన్స్ ప్రతినిథులు ఉపాధ్యాయుల,విద్యార్థులు పోలీస్ రాజు, మాజీ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాస్‌కి ఘన సన్మానం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పాలమూరు యూనివర్సిటీ నూతన ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డా.జి.ఎన్. శ్రీనివాస్‌ని పాలమూరు యూనివర్సిటీ వీసి ఛాంబర్‌లో జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో ఆయనను పరిశోధక విద్యార్థులైన జేఎన్‌టీయూహెచ్ జగిత్యాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జగదీష్ కుమార్, టీకేఆర్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాజు, జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.నరేష్, ఇతర జేఎన్‌టీయూహెచ్ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థులు డా.చంద్రమౌళి, సయ్యద్ అహ్మద్ కలిసి శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేఎన్‌టీయూహెచ్‌లో జేఎన్‌టీ యూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ అయిన డా. శ్రీనివాస్‌ను పాలమూరు యూనివర్సిటీకి వీసీగా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తాము గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పటి నుంచి ఆయన మాకు పాఠాలు భోధించారన్నారు. ఆయనగొప్ప ప్రొఫెసర్ అని, విద్యార్థులను ఎంతో ప్రోత్సాహిస్తాంన్నారు. సమయపాలన విషయంలో చాలా కచ్చితంగా ఉంటారని, నిజాయితీకి మారు పేరని, క్రమశిక్షణతో కూడిన ఆయన జీవితం ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శప్రాయ మని వారు తెలిపారు. సూపర్ విజన్‌లోనే ఇప్పటికే 14 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్డీ పూర్తి చేసారని ఇంకా దాదాపు 10 మంది వరకు పరిశోధన చేస్తున్నామని తెలిపారు. వందల మంది బీటెక్, ఎంటెక్ విద్యార్థులు కూడా ఆయన కిందనే ప్రాజెక్టులు చేసారని, తద్వారా గొప్ప గొప్ప రంగాల్లో దేశ విదేశాల్లో స్థిరపడ్డార ని తెలిపారు. ఇటు టీచింగ్‌తో పాటు, అనుబంధ కాలేజీల్లో అలాగే యూనివర్సిటీ స్థాయిలో, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఎలక్ట్రికల్, జేఎన్‌టీయూ హెచ్ హైదరాబాద్, ఆఫీసర్ ఇన్‌చార్జి ఫర్ ఎగ్జామ్స్ కాలేజి, అడిషనల్ కంట్రోలర్ ఫర్ ఎగ్జామ్స్ యూనివర్సిటీకి, వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్ ఫర్ జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్, సుల్తాన్ పూర్ కాలేజీలకు, మాలవీయ టీచర్ ట్రైనింగ్ సెంటర్ జేఎన్‌టీయూహెచ్‌కి డైరెక్టర్‌గా వివిధ రకాలైన అడ్మినిస్ట్రేటివ్ పదవులు సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్నో ప్రతిష్టాత్మక ఉద్యోగ నియామక పరీక్షలు, ఎంసెట్, ఈసెట్ లాంటి సెట్ ఎగ్జామ్స్ సమర్థవంతంగా నిర్వహించిన అనుభవం కూడా ఉందన్నారు. బీసీ వెల్ఫేర్‌కి సంబంధించిన ఎన్నో రాష్ట్ర ప్రభుత్వ కమిటీల్లో మెంబర్‌గా, జేఎన్‌టీయూహెచ్ అఫిలియటెడ్ కాలేజీల్లో బోర్డు మెంబర్‌గా కీలకమైన పదవులు చేపట్టారన్నారు. ఏ పదవిని బాధ్యతను చేపట్టి నా దాన్ని అత్యంత నిజాయితీగా, నిష్పగా, సమర్థవంతంగా నిర్వహించే వ్యక్తి ప్రొఫెసర్.జి.ఎన్.శ్రీనివాస్ అన్నారు. అలాంటి వ్యక్తిని సీఎం సొంత జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీకి వీసీగా నియమించడం వల్ల కచ్చితంగా యూనివర్సిటీ ని రాబోయే మూడేండ్లలో కొత్త కొత్త కోర్సులతో, విద్యార్థులకు సిబ్బందికి అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. త్వరలో క్యాంపస్ ఆవరణలోనే ఇంజనీరింగ్ కళాశాల స్థాపనకు కూడా చొరవ తీసుకుంటారన్నారు. కచ్చితంగా కొత్త వీసీగా బాధ్యతలు స్వీకరించిన డా.జి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యం లో.. పాలమూరు యూనివర్సిటీ ప్రగతిపథం లో పయనిస్తుందని, తద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాతో పాటు, తెలంగాణ వ్యాప్తంగా ఉన్నత విద్యా వ్యాప్తికి దోహదం చేస్తుందన్నారు. సంప్ర దాయ యూనివర్సిటీల విభాగంలో పాలమూరు యూని వర్సిటీ ప్రథమ స్థానానికి ఎగబాకుతుందనే ఆశాభావాన్ని వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా తనను అభినందించేందుకు పెద్ద ఎత్తున వచ్చిన, ఘనంగా సన్మానించిన విద్యార్థులు, ఫ్యాకల్టీకి ప్రతి ఒక్కరికి కొత్త ఉపకులపతి డా.జి. ఎన్. శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు అడ్డాకు స్థలం కేటాయించాలి

- సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీలుకాని లక్ష్మణ్, పసుల అంజయ్య



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

షాపూర్ నగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డాకు స్థలం కేటాయించి కనీస సౌకర్యాలు కల్పించాలి కీలుకానీ లక్ష్మణ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో.. ప్రజావాణి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... షాపూర్ నగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా ప్రధాన రోడ్డు పక్కన ఉన్నటువంటి అడ్డాను బడా బాబులు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినప్పుడల్లా అడ్డాను తొలగించడం వేరే దగ్గర చూపించడం లాంటివి జరుగుతుంది. ఇప్పుడు ఉన్నటువంటి అడ్డా పూర్తిగా రోడ్డు వెడల్పులో పోయి భవన నిర్మాణ కార్మికులు ఎండలకు వానలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కనీసం నిలబడడానికి ఏమీ లేకుండా పోయిందని.. రోడ్డు పక్కన దుమ్ము ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు 40 సంవత్సరాల నుంచి షాపూర్ నగర్ మెయిన్ రోడ్డు పక్కన అడ్డాను నిర్మించుకొని 500 - 600 వందల మంది కార్మికులు ఉపాధి కేంద్రం అయ్యిందని.. ఉదయమే పని కోసం మేస్త్రీలు, సెంట్రింగ్ కార్మికులు, కంకర పని మట్టి పని చేసేవాళ్లు పెద్ద సంఖ్యలో మహిళలు అడ్డా మీద ఉండి పనులకు వెళ్లడం జరుగుతుందన్నారు. అలాంటి అడ్డా ఈరోజు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. కాబట్టి ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు వెంటనే ఆలోచన చేసి షాపూర్ నగర్ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ స్థలంలో అడ్డ నిర్మించి మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఐదు రూపాయల భోజనం, కూర్చోవడానికి షెడ్డు నిర్మించని కోరారు. ఈ కార్యక్రమంలో షాపూర్ నగర్ అడ్డా భవన నిర్మాణ కార్మికులు, యేసు, చందర్, ఎల్లయ్య, రాములు , కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

33/11 కేవీ గాగిల్లాపూర్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా నేడు మధ్యాహ్నం 1:30 గం నుంచి మధ్యాహ్నం 3:00 గంల వరకు) గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్, గాగిల్లాపూర్ చర్చి, చైతన్య కాలనీ,214 ప్రాంతంలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డీపీ పల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం పీఆర్ఓగా
శర్విరాల కృష్ణమూర్తి గుప్తా



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం(మహాసభ)పిఆర్ఓగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ ఉమాదేవినగర్ ప్రాంతానికి చెందిన శర్విరాల కృష్ణమూర్తి గుప్త నియమితులయ్యారు.ఈ మేరకు మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన బెల్దె రమేష్ గుప్తా చేతుల మీదుగా కృష్ణమూర్తి గుప్తా కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలో తన సేవలను గుర్తించి ఇటువంటి బాధ్యతలు అప్పజెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైశ్య కుల బాంధవుల సంక్షేమానికి తన వంతుగా కృషిచేస్తానని స్పష్టం చేశారు.ఈ పదవి రావడానికి సహకరించిన సంఘ పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

కొంపల్లి11వ వార్డు కౌన్సిలర్ రాజీనామా



నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ విద్య కమిషన్ సభ్యురాలిగా నియమితురాలైన కందాడి జ్యోత్స్నా శివారెడ్డి కొంపల్లి 11వ వార్డు కౌన్సిల్ సభ్యత్వానికి తన రాజీనామా పత్రాన్ని కొంపల్లి మునిసిపల్ కమిషనర్‌కు కొంపల్లి మునిసిపల్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలుగా నియామితులైన కందాడి జ్యోత్స్నా శివారెడ్డికి మున్సి పాలిటీ చైర్మెన్ శ్రీశైలం యాదవ్, కమిషనర్ కె.శ్రీహరి, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు మాజీ వార్డు సభ్యులు జమ్మి దేవేందర్, తోటి కౌన్సిలర్లు సరితా శివకుమార్, సువర్ణ కృష్ణసాగర్, రవీందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జయభేరి గోపాల్ రెడ్డి, మునిసిపల్ సిబ్బంది పాల్గొని, శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజావాణికి 55 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లాలా అధికారి చంద్రావతికి విన్నవిస్తూ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ జన్మదిన సందర్భంగా.. వారి క్యాంప్ కార్యలయంలో అయనను, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ కలిసి శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ గౌతంనగర్ పరిధిలోని శోభనా కాలనీలో ఉన్న అరబ్బా బాబా సందల్ కార్యక్రమంలో భాగంగా జరిగిన స్థానిక శోభన కాలనీలో ఉన్న దర్గా వద్ద చాదర్ వేసి జండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అరబ్బా బాబా దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్, నాగార్జున కాలనీలో సందల్ కార్యక్రమంలో నసీరుద్దీన్, సలావుద్దీన్, ఇమ్రాన్, అబ్దుల్ మాలిక్, బిక్షపతి, పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్

హోప్ ఆఫ్ హంగర్ సంస్థకు
కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్ ఫేస్ 2లో నివసించే, దండంపల్లి రామస్వామికి షుగర్ వ్యాధి కారణంగా, ఇటీవల సర్జరీ చేసి కాలు తీసివేయడం జరిగింది. నడవలేని స్థితిలో ఉన్న రామస్వామికి హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ వారి సహకారంతో... డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతులమీదుగా, వీల్ చైర్, నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి తమ డివిజన్‌లోని పేద ప్రజలకు, సేవ చేస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు, ఆలేఖ్యకు, వారి బృందానికి కృతజ్ఞతలు తెలియచేసారు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని సంస్థ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మరేళ్ల శ్రీనివాస్, భిక్షపతి, మధులత, మీరయ్య, నరసింహులు, మల్లీశ్వరి, వెంకటేశ్వరరావు, రవి కిరణ్, అమూల్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇటికల రాఘవకు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

సూర్యాపేట జిల్లా పెనపహాడ్ మండలం మాసారం గ్రామ వాసి ఇటికల రాఘవ చైతన్యకు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ దక్కింది. ఇటికల రాఘవ చైతన్య ఓయూ నుంచి కామర్స్ డిపార్ట్మెంట్ లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. " టాలెంట్ మేనేజ్మెంట్ : అన్ ఎంపిరికాల్ స్టడీ అఫ్ టాలెంట్ రేటెన్షన్ స్ట్రాటెజిస్ అట్ సెలెక్ట్ ఫార్మాస్యూటికల్ కంపెనీస్ ఇన్ తెలంగాణ" అనే అంశం పై పరిశోధన చేసినందుకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఓయూడీన్ ఫాకల్టీ అఫ్ కామర్స్ సీనియర్ ప్రొఫెసర్ డి చెన్నప్ప వారి పరివేక్షణలో పరిశోధ పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓయూ వీసీకి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఓయూ

టీయూసీఐ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్, ఓయూ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఓయూ నూతన వీసీ ప్రొ. కుమార్‌కు అభినందనలు తెలుపుతూ వినతి పత్రం అందజేశారు. ఓయూలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న హాస్టల్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, వేతనాలు పెంచాలని ,ఇతర సౌకర్యాలు కల్పించాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, ఏజెన్సీలు లేకుండా యూనివర్సిటీ డైరెక్ట్ గా వేతనాలు చెల్లించాలని కోరారు. వీసీ స్పందిస్తూ "మీ సమస్యల గురించి అవగాహన ఉంది, హాస్టల్స్ మీరు లేకుండా నడవని పరిస్థితికి వచ్చింది. మీ సమస్యల పైన వివరంగా మీతో చర్చించి వాటి పరిష్కారానికి కషి చేస్తాను" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్ ఎల్ పద్మ, సహాయ కార్యదర్శి ఆర్. శంకర్ ,సావిత్రి, విజయ, శివాజీ,జయ, విజయ, సారయ్య,అనిత, శ్యామల, అనిల్, పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



- రాచకొండ సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం అంబర్‌పేట సీఏంఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ పోలీసు అమరవీరుల స్మారక స్థూపానికి, పోలీసు అమరవీరుల చిత్రపటాలకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వేలాది మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని, 21 అక్టోబర్, 1959 లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా సేనల ఆకస్మిక దాడిలో ప్రాణాలు అర్పించిన పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల స్మారకార్థం దేశవ్యాప్తంగా పోలీసు సంస్మరణ దినాన్ని జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సంస్మరణ దినాన్ని పోలీసు పతాక దినంగా పాటిస్తున్నామని సీపీ గుర్తు చేశారు. దేశాన్ని శాంతియుతంగా ఉంచేందుకు వేలాది మంది పోలీసులు తమ జీవితాలను అంకితం చేశారని గుర్తు చేశారు.

రాచకొండ పోలీసుల సంక్షేమం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ ఆరోగ్య పరీక్షల శిబిరాలు తదితర అనేక భద్రతా చర్యలు చేపట్టామని, రక్తదాన శిబిరాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. 2023 అక్టోబరు 21 నుంచి 27 వరకు రాచకొండ కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసు పతాక దినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు, ఆన్‌లైన్ ఓపెన్ హౌస్, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఇతర పౌరులు చురుకుగా పాల్గొనాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నల్గొండ జిల్లా యాదాద్రి జోన్ లోని 10 మంది అమరుల కుటుంబ సభ్యులు, ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని ముగ్గురు కుటుంబ సభ్యులు హాజరై అమరులకు శ్రందంజలి ఘటించారు. అమరుల కుటుంబాలకు సీపీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారితో మమేకమై, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల అత్యున్నత త్యాగాలను ప్రజలు గుర్తించాలని, సమాజాన్ని నేరరహితంగా ఉంచేందుకు పౌరులు సహకరించాలని సీపీ కోరారు. పోలీసు అమరవీరుల స్ఫూర్తితో రాచకొండ పరిధిలోని పోలీసు సిబ్బంది శాంతి భద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో కషి చేయాలని కమిషనర్ సూచించారు. డీసీపీలు రాజేష్ చంద్ర, పద్మజా, ప్రవీణ్ కుమార్, ఇందిరా, కరుణాకర్, అరవింద్ బాబు, ఉషా విశ్వనాథ్, మనోహర్, శ్రీనివాసులు, మురళీధర్, అడిషనల్ డీసీపీలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో 'గ్రూప్-1 మెయిన్స్' ప్రశాంతం

తొలిరోజు 87.23 శాతం హాజరు నమోదు

- 717 మంది అభ్యర్థుల గైర్హాజరు
- ఈనెల 27 వరకు కొనసాగనున్న పరీక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో గ్రూప్-1 మెయిన్స్ తొలిరోజు తొలి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 27 వరకు కొనసాగనున్నాయి. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మొత్తం 5613 మంది అభ్యర్థులకు గాను 4896 మంది పరీక్ష రాయగా 87.23 శాతం హాజరు నమోదైంది. 717 మంది అభ్యర్థులు గైర్హాజర య్యారు. కాగా పలు చోట్ల పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను పోలీసులు కేంద్రాల్లోకి అనుమతిం చలేదు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా గేట్లు తాళం వేయడం తో అక్కడే ఉన్న సిబ్బందిని అభ్యర్థులు చాలాసేపు వేడుకున్నారు. కానీ నిబంధనల ప్రకారం అనుమతించేది లేదని సిబ్బంది చెప్పడంతో పలువురు వెనుతిరిగారు.

ఇదిలావుంటే మెయిన్స్ పరీక్షను రద్దు చేయాలని, రీ షెడ్యూల్ విడుదల చేయాలని కొంతమంది అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. కానీ సుప్రీంకోర్టు పరీక్ష నిర్వహణకు మొగ్గుచూపడంతో జిల్లా అధికారులు అంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు పరీక్షలను వాయిదా వేయాలని కొంతమంది అభ్యర్థులు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో అన్ని



కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గట్టి నిఘా ఉంచారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సైతం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కోఠిలోని మహిళ విశ్వవిద్యాలయంలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించి.. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎగ్జామ్స్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఫలితంగా జిల్లాలో తొలిరోజు తోలి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నేటి పరీక్షకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు.

మహిళా విశ్వవిద్యాలయంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష సందర్భంగా సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్ అధికారులకు పరీక్షల నిర్వహణపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 8 పరీక్షా కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేశామని, టీజీపీఎస్సీ సూచనల మేరకు ప్రతి కేంద్రంలో గోడ గడియారాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లోకి సెల్ ఫోన్, డిజిటల్, స్మార్ట్ చేతి గడియారాలకు, క్యాలిక్యులేటర్ తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. 5613 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తుండగా.. ప్రతి 100 మంది అభ్యర్థులకు ఒక ఐడెంటి ఫికేషన్ అధికారి.. ఇలా మొత్తం 56 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను బయోమెట్రిక్, హాల్ టికెట్ చెకింగ్ కోసం నియమించామన్నారు. అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించేందుకు కేంద్రాల వద్ద వైద్య బృందాలను ఏర్పాటు చేశామనీ, వారం రోజులపాటు నిరంతరాయంగా 24 గంటలు విద్యుత్తు సరఫరా చేస్తారని తెలిపారు. ఈనెల 27వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థులు మధ్యాహ్నం 12.30



బల్దియాలో పార్కింగ్ యార్డ్‌లలో మూలన పడిన బండ్లు కాసులను కురిపిస్తున్నాయి. పార్కింగ్ యార్డ్స్‌లో నుంచి టైర్లు రోడ్డుపైకి ఎక్కకుండానే కొందరికి వరంగా మారాయి. ప్రతిరోజూ చెత్త సేకరణ చేయకుండానే మూలన పడేసిన బండ్లలోనూ డీజిల్ పోసినట్టు కూపన్లు వాడేస్తున్నారు. ఎందుకూ పనికిరాని వాహనాలకు సైతం రిపేయిర్ చేసినట్టు నెలనెలా నకిలీ బిల్లులు సమర్పించి బల్దియా ఖజానాను లూటీ చేస్తున్నారు. అధికారులతో కుమ్మక్కైన మరికొందరు కాంట్రాక్టర్లు నకిలీ బిల్లులతో అందినకాడికి దండుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొందరి అధికారులు, కాంట్రాక్టర్ తీరుతో జీహెచ్ఎంసీ మసక బారుతోంది. గతంలో సెక్యురిటీకి చెల్లించే చెక్కుల వ్యవహారంలో పలువురు అధికారులను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీలో కొందరు అధికారుల అండదండలతో కాంట్రాక్టర్లు రెచ్చిపో తుంటే, మరికొందరు పలుకుబడిన నాయకుల సపోర్టుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారు. నగరంలో చెత్త తరలిపుకోసం దాదాపు 100 నుంచి 120 వరకు వాహనాలను బల్దియా ఉపయోగిస్తోంది. ఇందులో 75-85 శాతం వాహనాలు పాతపడిపోగా, 60 శాతం వాహనాల వరకు పనికి రాకుండా ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఖైరతాబాద్, కావాడీగూడా, మలక్‌పేట్ ప్రాంతాలల్లోవున్న పార్కింగ్ యాడ్స్ ఉన్నాయి. ఈ మూడు పార్కింగ్ యాడ్స్‌లల్లో దాదాపు 60 నుంచి 70 వరకు వాహనాలను ఉంచారు. ఏదైనా రిపేయిర్‌కు వచ్చిన వాహనాలకు ఇక్కడే రిపేర్ చేస్తారు. వాహనాలకు కావాల్సి పరికరాలు కొనుగోలు చేస్తారు. ఇదే అదునుగా కొందరు కాంట్రాక్టర్లు, డీఈలు వాటికి రిపేయిర్ చేసినట్టు బిల్లులు దండుకుంటు న్నారని తెలిసింది. ఇందులో స్పేర్‌పార్టు సరఫరా చేసే వారితోపాటు సదురు అధికారులకు, మెకానిక్స్, కాంట్రాక్టర్లకు ఇలా ఎవరివాటా వారికి వెళు న్నాయని ఆరోణలున్నాయి.

ఖాళీ ఇండెంట్లపై కావాల్సినంత బిల్లులు

ఏదైనా వాహనం రిపేయిర్‌కు వస్తే ముందుగా డ్రైవర్ సమాచారంతో బ్రేక్ డౌన్ అయిందా, ఇంజన్‌లో ప్రాబ్‌లం వచ్చిందా, ఏ పరికరం చెడి పోయింది, వాహనం కండీషన్ ఏంటీ, రిపేయిర్స్ ఎన్నివున్నాయి మెకానిక్ సూచనల మేరకు దానికి ఖర్చు ఎంతవుతుందో అంచనా వేస్తారు. డ్రైవర్ సంతకంతో ఇండెంట్లపై పూర్తి వివరాలు రాయాల్సి వుంటుంది. దాన్ని ధృవీ కరిస్తూ అక్కడున్న ఇన్‌ఛార్జ్ సైతం సంతకం చేయాలి. కానీ కొందరు కాంట్రాక్టర్లు ఈవేమీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అస్సలు డ్రైవర్ ప్రమేయం లేకుండానే ఖాళీ ఇండెంట్లపై రిపేయిర్ చేయించి నట్టు కాంట్రాక్టర్లు వేలల్లో బిల్లులను వారే రాసేస్తు న్నారని తెలిసింది. చివరకు పార్కింగ్‌లో మూలన పడిన వాహనాలను సైతం వదలడం లేదు. సదురు వాహనాలను రిపేయిర్ చేసినట్లు బిల్లులు దండుకుంటున్నారని సమాచారం.

విజిలెన్స్ విచారణ..

కొద్ది నెలల క్రితం కవాడీగూడలో నకిలీ బిల్లుల కుంభకోణం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో చార్మినార్ జోన్‌లో సైతం టైర్ల వివాదంలో విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. రెండు సంఘటనలలో జరిపిన విచారణలో కొన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. అయినా బల్దియాలో కుంభకోణాలకు బ్రేక్‌లు పడడం లేదు.

ఒకే వాహనానికి ఏడాదిలో పలుమార్లు రిపేర్ల పేరుతో వేలల్లో బిల్లులు స్వాహా

మలక్‌పేట్ పార్కింగ్ యార్డ్‌లోవున్న వాహనాలకు ఒకే కారణంతో పలుమార్లు బిల్లులు దండుకుం టున్నారు. ఇదే తరహాలో మలక్‌పేట్ పార్కింగ్‌లో 2023, నవంబర్ 15న వేలల్లో బిల్లులు దండుకు న్నారు. మెకానిక్ సంతకాలులేవు. డ్రైవర్ రిపోర్టు లేదు అయినా ఇండెంటు పెట్టి రిపేర్ పేరుతో దాదా పు రూ.30వేలు దండుకున్నారు. అదే వాహనానికి తిరిగి ఈ ఏడాదిలో అదే రిపేర్ పేరుతో మరో రూ.25వేలు దండుకున్నారు. డ్రైవర్ సంతకాలు లేకున్నా ఫోర్జరీ చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహా రంలో డీఈ అండదండలతో లక్షలల్లో నకిలీ బిల్లులు దండుకున్నట్లు తెలిసింది. దాంతో జీహెచ్ఎంసీ ఖజానాకు భారీగా గండిపడుతోంది. పై అధికారుల అండదండలతో భారీ మొత్తంలో ముడుపులు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచాణ జరిపించి జీహెచ్ఎంసీ ఖజానాను కాపాడడంతోపాటు నిందితులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

స్పందించని డీఈ

మలక్‌పేట్ పార్కింగ్ యార్డ్‌లోవున్న (వాహనాలకు రిపేర్లపేరుతో) జరుగుతున్న కుంభకోణంలో డీఈని సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించి నా ఆయన స్పందించలేదు. పలుమార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు.

16నెలల్లో డబుల్ ఇండ్లు కట్టిస్తామని 9 ఎండ్లైన కాలే..



- సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్
- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ధూల్‌పేట్/దంపాపేట్

16నెలల్లో డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని నేటికీ 9 ఎండ్లైన కాలేదని సీపీఐ(ఎం) జంగంమెంట్ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ అన్నారు. సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బండ్లగూడ మండలం జంగం మెంట్ డివిజన్ ప్రాంతంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16నెలల్లో డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని నేటికీ ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ కట్టించి ఇచ్చిన వారికి ఇప్పటికి ప్రభుత్వము పట్టాలు జారీ చేయడం లేదన్నారు. వెంటనే 72కుటుంబాలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాల్సిందిగా కోరారు. సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కిషన్, రాంకుమార్, శేఖర్, వీరమ్మ యాదమ్మ అక్కుబాయి, రేణుక, సునీత తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్‌కు చెందిన 11మంది లబ్ధిదారులకు రూ.3,98,000 విలువగల చెక్కులను లబ్ధిదారులకు రాంనగర్ కాకతీయ స్కూల్ వద్ద ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, జ్ఞానేశ్వర్ గౌడ్, గోక నవీన్, బల్వీర్ కుమార్, కళ్యాణ్ నాయక్, టీవీ రాజు, పోస్టర్ శ్రీను, గండు వెంకటేష్, వాసు, మహిళా అధ్యక్షురాలు నీలాదేవి, తులసి, మంజుల, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి నిర్వహణ తదితర పనులను పరిశీలించిన ఈడీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఓ అండ్ ఎం డివిజన్ 5 పరిధిలోని బోట్స్ క్లబ్, బాగ్‌లింగంపల్లి ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, సప్లై లెవల్స్, మురుగు నీటి నిర్వహణ తదితర పనుల్ని పరిశీలించారు. ఈడీ వెంట డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులున్నారు.

పోస్టల్ శాఖ అభివృద్ధిలో పోస్ట్‌మ్యాన్‌ల పాత్ర అమోఘం

- తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పి. విద్యాసాగర్ రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

పోస్టర్ శాఖ అభివృద్ధి పదంలో పయనిస్తుందంటే పోస్టుమాన్‌లపాత్ర అమోఘమని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పి. విద్యాసాగర్ రెడ్డి ప్రశంసించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ పోస్టుమ్యాన్, ఎంటీఎస్ తెలంగాణ సర్కిల్ 4వ ద్వైవార్షిక మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పి. విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలక్షన్ సమయంలో పోస్టుమ్యాన్‌లు ఓటరు గుర్తింపు కార్డులను సకాలంలో డెలివరీ చేసి మన డిపార్టుమెంటుకు మంచిపేరు తెచ్చారని ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రంలో 92శాతం ఓటరు కార్డులను సకాలంలో బట్వాడా చేసినందుకు ఎలక్షన్ కమీషన్ కూడా పోస్టుమ్యాన్ల సేవలను ప్రశంసించిందని గుర్తుచేశారు. అయితే నిన్న వివిధ దినపత్రికలలో నేను మాట్లాడినట్లు వచ్చిన వార్తలు అవాస్తవం అని దీన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, 8వ వేతన సంఘం గురించికానీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాను ఎలాంటి వాఖ్యలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆల్ ఇండియా సెక్రెటరీ జనరల్ ఎఫ్ఎస్వీవో శ్రీనివాస్ రెడ్డి శివాజీ, ఆలిండియా జనరల్ సెక్రెటరీ నిసార్ ముజావర్, యూనియన్ సర్కిల్‌సెక్రెటరీ ఎం. కృష్ణ, సర్కిల్ ప్రసిడెంట్ మహ్మద్ క్వలీల్ తదితరులు

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

యువతడ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వంటి బారిన పడకుండా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. షాలోమ్ ఆఫ్ హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేనో డ్రగ్స్ పేరిట నిర్వహిస్తున్న అవగాహన సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ సరఫరా చేసే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసుపాదం థామస్, షాలోమ్ ఆఫ్ హెూప్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్ఎ. వినోద్ కుమార్‌లను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా యేసుపాదం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాలు సరఫరా చేసే వారిపట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీహెచ్.అశోక్, ఆర్ఎ.హితేశ్, సీహెచ్.సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చరిత్రను తెలియజేయడమే దాశరథి థియేటర్ ప్రయత్నం



- ఏఎస్ రావు విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి పిబిచారి
- మహా మనిషి సినిమాకు ఇండియన్ ఫిలిం ఫేర్ అవార్డు

నవతెలంగాణ-ముషీరాబాద్

మహనీయుల జీవిత చరిత్రలు వెండితెరపైకి తెచ్చి భావి తరాలకు అందించటానికి ప్రయత్నమే దాశరథి థియేటర్ యొక్క లక్ష్యమని ఏఎస్ రావు విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి పిబి చారి అన్నారు. ఏఎస్ రావు విజ్ఞాన కేంద్రం నిర్మించిన దాశరథి థియేటర్ సమర్పించిన మహా మనిషి సినిమాకు ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఒడిస్సా2024 ఫిల్మ్ ఫేర్ అవార్డును సోమవారం బాగలింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భువనేశ్వరం అందుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఏఎస్ రావు విజ్ఞాన కేంద్ర ప్రధాన కార్యదర్శి పిబి చారి మాట్లాడుతూ చిన్న సినిమా గొప్ప సందేశం సామాజిక మాధ్యమాలకు వేదికగా నేడు 200 లఘు చిత్రాలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం దాశరథి థియేటర్‌లో ప్రదర్శించడం ప్రయో'జన' సినిమాలను ప్రదర్శించడమే కాదు యువశక్తిని సర్వోత్తంగా.. సమర్థవంతంగా వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నందన్నారు. దాశరథి ఫిల్మ్ సొసైటీ ఉపాధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలు వెండితెరపై కి తెచ్చి భావి తరాలకు అందించటానికి ప్రయత్నమే దాశరథి థియేటర్ తెలంగాణలో ఇలాంటి తరహా సినిమాలు ప్రదర్శించడం తొలి విజయం దాశరథి థియేటర్ కే దక్కుతుందని తెలిపారు. బీడీఎల్ సత్యనారాయణ దాశరథి ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి మాట్లాడుతూ విలువలతో కూడిన నిర్దిష్ట లక్ష్యంతో తీసిన సినిమా వైజ్ఞానిక చలనచిత్రాల జాబితాలో సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే సినిమాగా, జాతీయ బయోపిక్ ఫిలింఫేర్ అవార్డును అందుకున్న సినిమాగా అవార్డు అందుకోవడం అనతి కాలంలో దాశరథి థియేటంకు ఇంత పేరు ప్రఖ్యాతలు రావడం ఇది మొదటిసారి అని అన్నారు. సినిమా ఆస్ గాన్ సినిమాను ఆయుధంగా మలుచుకొని పోరాడిన దర్శకులు యుహెచ్ రాఘు రామచంద్ర అని సినిమా ఆస్ బుక్ జీవితాన్ని అర్థ పదార్థ తాత్పర్యాలతో చదివి వినిపించిన వారు ఒక సామాన్యుడి కథను వెండితెర కథా కావ్యంగా మలచిన దర్శకుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావు విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు కె.యాదగిరిరావు పి. జయప్రకాశ్, జే.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి లోప్రెషర్ సమస్యతో ఇబ్బందులు

- గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మంచినీటిలో ప్రెషర్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణను తన కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చిక్కడపల్లిలోని బాబు నగర్ పరిసర ప్రాంతాల్లో కలుషిత మంచినీరు లో ప్రెషర్స్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి పలుమార్లు తమ దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. కొద్దిపాటి సరఫరాలో కూడా కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, కావున వెంటనే పటిష్టమైన చర్యలు చేపట్టి, సమస్యను పరిష్కరించాలని, కోరారు. లేదంటే డివిజన్ ప్రజలతో కలిసి జీఎం కార్యాలయం ముందు భారీ ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ,వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణ మోహన్, ఆనంద్ రావు, పాల్గొన్నారు.

'డెమోక్రసీ పేరు చెప్పుకుంటూ రాజకీయ నాయకుల మోసం'

- విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశం, రాష్ట్రాలలో డెమోక్రసీ పేరు చెప్పుకుంటూ రాజకీయ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని, ఇలాంటి నాయకులు ఉన్నంత వరకు దేశం, రాష్ట్రాలు బాగుపడవని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు.ఆలిండియా జైహింద్ పార్టీ, సమాజ్ వాది పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఆజాద్ హింద్ ప్రభుత్వ 82వ వ్యవస్థాపక వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ బి.చంద్రకుమార్‌తో ఆలిండియా జైహింద్ పార్టీ అధ్యక్షులు ఎన్. దశరథ రామిరెడ్డి కలిసి స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్.దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువత ఆయన బాటలో పయనించాలని సూచించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ సేనలను సోల్జర్స్ బోర్డులోకి చేర్చి మిగతా సైనికులతో సమానంగా పెన్షన్లను ఆగ్నేయాసియా దేశాల్లో ఉన్న ఫౌజ్ సేనలకు అందజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతాజీ అదృశ్యంపై నియమించిన షానవాజ్ ఖాన్ కమిటీ, కోస్లా, ముఖర్జీ కమిషన్ల రిపోర్టు బహిర్గతం చేయాలని ఢిల్లీ పార్లమెంట్ భవన ప్రాంగణంలో నేతాజీ విగ్రహాన్ని స్థాపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ వాది పార్టీ నాయకులు శ్రీనివాసరావు, చింతా రాజేష్, సివిల్స్ ట్రైనర్ ఆకెళ్ళ రాఘవేంద్ర, ముఖర్జీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై 'సుప్రీం' తీర్పును అమలు చేయాలి

ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును యథా విధంగా అమలు చేయాలని ఎస్సీ 57 ఎంబిఎస్సీ కులాల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం అన్నారు. ఎస్సీ 57 ఎంబిఎస్సీ కులాల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌కు భారీ ర్యాలీతో వెళ్లి నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో బైరి వెంకటేశం హాజరై మాట్లాడుతూ రిజర్వేషన్లలో సమానత్వం మా జాతుల హక్కు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును యదవిధంగా అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. 57 ఉప కులాలకు 10శాతం రిజర్వేషన్లలను కేటాయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణలో 57 ఎంబీఎస్సి కులాలను ఏ వర్గంలోకి చేర్చి 7శాతం రిజర్వేషన్లు కేటాయించాలి అని కోరారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మీద ఎంబీఎస్సి ఉపకులాల కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాల మాదిగల కులాలకు కుల ధ్రువీకరణ పత్రాలను ఇస్తున్న విధంగా 57 ఉప కులాల కూడా తహసిల్దార్ ఇవ్వాలన్నారు. ఉపకులాల నిరుద్యోగులకు 70 శాతం బ్యాంకు శూరి టీలు లేకుండా రుణాలు కార్పొరేషన్ ల ద్వారా ఉపాధి కల్పించాలని ఉప కులాల సమస్యలకు తక్షణమే ప్రభుత్వం చర్చించాలని కోరారు. నవంబర్ ఒకటవ తేదీ వరకు మా సమస్యలను చర్చించకపోతే ప్రతి ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి సెక్రటేరియట్ ను ముట్టడిసామని హెచ్చరించారు. ఈ దీక్షలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్

బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. ఆయన పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణగుట్ట నర్కి పూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు బస్తీల ప్రజల నుండి పలు సమస్య లపై మొత్తం 6 ఫిర్యాదులు అందాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలచే పరిష్కరిస్తున్నామన్నారు. బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, యూబీడి మేనేజర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1పరీక్షలకు పటిష్ట బందోబస్తు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠి తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో సోమవారం గ్రూప్‌వన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస చారి గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు



ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 'స్ట్రాంగ్ ఉమెన్'గా నిలిచారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు బంగారు పతకాలను గెలుచుకుని ఔరా అని పించారు. పాల్గొన్న పోటీలన్నింటిలోనూ పతకాలను గెల్చుకుని 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఇండియా'గా ప్రపంచానికి పరిచయమయ్యారు. ఆమే షేక్.సాదియా అల్మాస్. ఇప్పటివరకూ అంతర్జాతీయ స్థాయిలో 11, జాతీయస్థాయిలో 20 వరకూ పతకాలు గెలుచుకుని తన జైత్రయాత్రను కొనసాగిస్తున్నారు. ఇక రాష్ట్రస్థాయి పతకాలకు లెక్కే లేదు. మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే ప్రపంచ ఛాంపియన్‌గా రాణిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

పోటీపడితే పతకం పట్టాల్సిందే

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని ఇస్లాంపేట (తెనాలిరోడ్డు)కు చెందిన సాదియా అల్మాస్ 2002, అక్టోబర్ 27న పుట్టారు. తల్లి రిజ్వానా, తండ్రి షేక్ సందాని. సాదియ ప్రస్తుతం కెఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్నారు. సివిల్ సర్వీసెస్‌లో రాణించాలనే లక్ష్యంతో కెఎల్ యూనివర్సిటీలో బీఏ అభ్యసించారు. ప్రాథమిక విద్య మంగళగిరి అరవింద పబ్లిక్ స్కూల్లో, ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో, మంగళగిరిలోని వీజేలో పూర్తిచేశారు.

తండ్రి ప్రోత్సాహంతో

చిన్నప్పటి నుంచి సాదియాకు ఆటలంటే ఎంతో ఇష్టం. కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్ వంటి ఆటల్లో ప్రావీణ్యం చూపించేవారు. ఇది గమనించిన తల్లిదండ్రులు ఆటల పోటీల్లో ప్రోత్సహించారు. సాదియా తండ్రి కూడా పవర్ లిఫ్టర్, సందాని పవర్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటు చేసి 25 ఏండ్లుగా ఎంతోమందికి ఉచితంగా పవర్‌లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఉన్న తండ్రి ప్రోత్సాహంతో సాదియా పవర్‌లిఫ్టింగ్ వైపు ఆకర్షితులయ్యారు. మొదట గుంటూరు జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. పతకాలు సాధించటంతో ఆమెలో ఆత్మ విశ్వాసం పెరిగింది. తండ్రి ఆమెను జిల్లా, రాష్ట్రస్థాయిపోటీల్లో ప్రతిభ చూపేలా ప్రోత్సహించారు. అలా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగారు. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నాయకులు కూడా తమవంతుగా ప్రోత్సాహాన్ని అందించాయి. దీంతో సాదియా వెనుతిరిగి చూడకుండా మొక్కవోని దీక్షతో నేర్చుకున్నారు. ప్రస్తుతం పతకాల పంట పండిస్తున్నారు. ఆర్థిక కారణంగా విదేశీ పోటీలకు వెళ్లటానికి సాదియా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు రూ.3 లక్షల వరకూ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సాదియా అక్క షేక్.ఆసియా కూడా పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారిణే.

స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ కామన్‌వెల్త్‌గా...

దక్షిణాఫ్రికా సన్‌సిటీలో ఈ నెల 4 నుండి 13వ తేదీ వరకు జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో సాదియా 57 కిలోల అండర్ జూనియర్ విభాగంలో స్కాట్ - 185 కిలోల పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, బెంచ్‌ప్రెస్ 95 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 180 కిలోలు ఓవరాల్‌గా 460 కిలోల లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. ప్రపంచం మొత్తం గర్వించేలా అక్కడి పోటీలు నిర్వహించే ప్రతినిధులు ఆమెను 'కామన్‌వెల్త్ స్ట్రాంగ్ ఉమెన్'గా ప్రకటించారు. అనంతరం 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఇండియా' అంటూ పొగడ్తలతో ముంచెత్తారు.



వరల్డ్ ఛాంపియన్‌గా...

మాల్టా దేశంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరిగిన జూనియర్ వరల్డ్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో సాదియా 57 కేజీల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా గోల్డ్ మెడల్ సాధించారు. స్కాట్ 190 కేజీలు, బెంచ్ ప్రెస్ 97.5 కేజీలు, డెడ్ లిఫ్ట్ 175 కేజీలు మొత్తంగా 462.5 కేజీల బరువు ఎత్తారు. బంగారు పతకం సాధించటం ద్వారా భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. యుఏఈలోని షార్జాలో 2023 ఆగస్టు 17 నుంచి 21 వరకు జరిగిన 'ఆసియన్ యూనివర్సిటీ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్‌లో ఛాంపియన్‌షిప్‌లో మొదటిస్థానంలో నిలిచి మొత్తం నాలుగు బంగారు పతకాలను గెలుచుకున్నారు. స్కాట్ 142.5 కేజీలు, బెంచ్‌ప్రెస్ 62.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 135 కేజీలు మొత్తం 340 కేజీల బరువు ఎత్తి మొదటిస్థానంలో నిలిచారు. 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆసియన్ యూనివర్సిటీస్'గా ప్రకటించారు.

పతకాల వర్షం...

కేరళలోని అలప్పుజలో 2023 మే 1 నుంచి 6 వరకు జరిగిన 'ఆసియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌'లో మొదటిస్థానంలో నిలిచి 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆసియా'గా నిలిచారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో 2022 నవంబర్ 24 నుంచి డిసెంబర్ 4 వరకు జరిగిన 'కామన్ వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌'లోనూ మొదటిస్థానంలో నిలిచి నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ కామన్‌వెల్త్‌'గా టైటిల్‌ను గెల్చుకున్నారు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో 2022 ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరిగిన 'వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్'లోనూ ద్వితీయస్థానంలో నిలిచారు. ఒక గోల్డ్, రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్లను అందుకున్నారు. 2022 జూన్ 17 నుంచి 21 వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన 'ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌'లోనూ మొదటి స్థానంలో నిలిచి నాలుగుబంగారు పతకాలను గెల్చుకున్నారు. 2021 టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన 'ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌'లో మొదటిస్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలను గెల్చుకున్నారు. 2018 మేలో రాజస్థాన్‌లో జరిగిన 'ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌'లో మొదటిస్థానంలో నిలిచారు. స్లోవేనియాలో 2023 నవంబర్‌లో జరిగిన 'వరల్డ్ యూనివర్సిటీ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌'లోనూ పాల్గొని బహుమతులు గెల్చుకున్నారు.

-యడవల్లి శ్రీనివాసరావు

దేశ గౌరవాన్ని పెంచుతా



పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌గా నేను ఈ స్థాయిలో రాణించటానికి మొదటగా కోచ్‌గా ఉన్న నా తండ్రి షేక్ సందాని ప్రోత్సాహమే కారణం. అలాగే నా కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రోత్సాహం ఎంతో ఉంది. పవర్‌లిఫ్టింగ్ ఏపీ, గుంటూరు జిల్లా అసోసియేషన్ల సహకారం మరువలేనిది. మంత్రి నారా లోకేష్, రోటరీ క్లబ్‌లు కూడా సహకరించాయి. భవిష్యత్తులో దేశానికి మరిన్ని పతకాలు సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తాను. జూనియర్ వరల్డ్‌లో రెండుసార్లు సత్తా చాటా. సీనియర్ వరల్డ్‌లో పతకాలు సాధిస్తా. వరల్డ్ గేమ్స్‌లో పతకాలు సాధించటమే నా లక్ష్యం.

- షేక్.సాదియా

పిగ్మెంటేషన్ సమస్యా?

రకరకాల కారణాల వల్ల చాలామందికి ముఖంపై పిగ్మెంటేషన్ వస్తుంటుంది. దానికి క్రీములు, ఇతర మందులు వాడే బదులు ఇంటి చిట్కాలతో ఈ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు.

బంగాళా దుంపతో..

ఒక బంగాళా దుంపని తురిమి అందులో పావు కప్పు నిమ్మరసం కలపండి. పిగ్మెంటేషన్ ఎక్కువ ఉన్న చోట ఈ మాస్కుని వేసుకుని అరగంట ఆగి చల్లని నీటితో కడిగేయాలి. ఇలా రోజుకి రెండుసార్లు చేస్తే తొందరగా



నయమవుతుంది.

నిమ్మరసం, తేనె..

రెండు టేబుల్ స్పూన్ల తేనెలో రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలిపి అవసరమున్న చోట ఈ మిశ్రమాన్ని పూతలా వేసుకోవాలి. తర్వాత గోరు వెచ్చని నీటిలో మెత్తటి బట్ట ముంచి పిండేయాలి. ఆ బట్టని ఈ మిశ్రమం అప్లై చేసిన చోట కవర్ చేసినట్లుగా వేయండి. ఐదునిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా వారానికి ఒకసారి చేయాలి.

యాపిల్ సైడర్ వెనిగర్..

అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్ లో అర కప్పు నీరు కలపండి. పిగ్మెంటేషన్ ఉన్న చోట ఈ నీటిని పోయండి. నాలుగైదు నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా రోజుకి రెండు సార్లు చొప్పున నెల రోజుల పాటూ చేయండి.

పసుపు, పాలు..

ఒక బౌల్‌లో ఐదారు టీ స్పూన్ల పసుపు తీసుకుని అందులో తగినంత పాలు పోసి మెత్తటి పేస్ట్ లా చేయండి. పిగ్మెంటేషన్ ఉన్నచోట ఈ పేస్ట్ అప్లై చేసి ఐదునిమిషాలు గుండ్రంగా మసాజ్ చేయండి. ఆరిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. రోజూ స్నానానికి ముందు ఒకసారి ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

సోషలిస్టు, సెక్యులర్

రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. మరో న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ తన వాదనలు వినిపిస్తూ.. ఈ సవరణ అమల్లోకి వచ్చేనాటికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా స్పందిస్తూ "మీరు భారత్ లౌకిక దేశంగా ఉండాలని కోవడం లేదా..?" అని సూటిగా ప్రశ్నించారు. దీనిపై అడ్వకేట్ జైన్ బదులిస్తూ "భారత్ లౌకిక దేశంగా ఉండ కూడదని మేం అనడం లేదు. ఈ సవరణను మాత్రమే సవాలు చేశాం" అని పేర్కొన్నారు. పీఠికలో ఈ రెండు పదాలు చేర్చడం వల్ల పాండోరా బాక్స్‌ను తెరిచినట్లైందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో 'ప్రజాస్వామ్యం' అనే పదాన్ని కూడా తొలగించవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇక బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి తన వాదనలు వినిపిస్తూ.. పీఠికలో 26 నవంబర్ 1949 తేదీ ఉండటం తప్పని నిరూపిస్తానని పేర్కొన్నారు. " మనకు రాజ్యాంగ పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చు. కానీ, సెక్యులరిజం, సోషలిజం పదాలు చేర్చడానికి భారత ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదు. పీఠిక రెండు భాగాల్లో ఒక దానికి తేదీతో, మరో దానికి తేదీ లేకుండా ఉంచవచ్చు" అని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. పిటిషనర్లు సంబంధిత పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని చెప్పారు. నోటీసులు జారీ చేయడం లేదని పేర్కొంటూ పిటిషన్లపై వాదనలకు నవంబర్ 18వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి వాదనలను నవంబర్ 18వ తేదీన వింటామని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

మదర్సాల విషయంలో ఎన్సీపీసీఆర్ సిఫారసుపై సుప్రీం స్టే

గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని, మదర్సా బోర్డులకు ప్రభుత్వ నిధులివ్వరాదని రాష్ట్రాలను కోరుతూ బాలల హక్కుల సంఘం చేసిన సిఫారసులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మదర్సాల్లో విద్యాహక్కు చట్టాన్ని పాటించట్లేదని, అక్కడ బోధించే విద్య.. విద్యార్థులకు ఎందుకూ పనికిరాదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపింది. కాగా ఈ ఏడాది జూన్ 7, జూన్ 25 తేదీల్లో గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించడంతో ఉత్తరప్రదేశ్, త్రిపుర ప్రభుత్వాలు వీటిని అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేశాయి. దాంతో ఈ ప్రభుత్వాల చర్యలను వ్యతిరేకిస్తూ ముస్లిం సంస్థ జమాత్ ఉలేమా-ఇ-హింద్ సుప్రీంలో పిటిషన్ వేసింది. ఈ రాష్ట్రాలు ఇచ్చిన ఉత్తర్వులపై కూడా సుప్రీం స్టే విధించింది.

కోబ్రి అడవుల్లో కాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

వివరాల ప్రకారం.. కోబ్రి అడవుల్లో మావోయిస్టుల ఉనికిపై పక్కా సమాచారంతో ఆపరేషన్ ప్రారంభించారు. ఎన్‌కౌంటర్ స్థలం వైపు యాంటీ మావోయిస్టు స్పెషల్ స్క్వాడ్ కంపెనీ 60ని పోలీసు ఉన్నతాధికారులు పంపించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. వచ్చే నెలలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఈ ఎన్‌కౌంటర్‌ను కీలకంగా పరిగణించాల్సి ఉంది.

డిజిటల్ వేదికలకు కళ్లెం !

- అసమ్మతి అణచివేతకు ప్రభుత్వ యత్నాలు
- న్యాయస్థానాల అక్షింతలు వేస్తున్నా ఆగని దూకుడు
- పార్లమెంట్ శీతాకాల సమావేశాల పైనే అందరి దృష్టి

న్యూఢిల్లీ : 'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఒకే పాట పాడాల్సిన అవసరం లేదు'...పంజాబ్‌లో హింస, అలజడిపై ఆనంద్ పట్వర్ధన్ రూపొందించిన 'ఇన్ మెమొరీ ఆఫ్ ఫ్రెండ్స్' అనే డాక్యుమెంటరీని ప్రసారం చేసేందుకు దూరదర్శన్ నిరాకరించడంపై స్పందిస్తూ 1996లో బాంబే హైకోర్టు చేసిన వ్యాఖ్య ఇది. అయితే అప్పటి నుండి దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ విషయంలో ఎంతో మార్పు వచ్చింది. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేయగలుగుతున్నారు. లక్షలాది భిన్న గొంతుకలను వినిపించడంలో డిజిటల్ మీడియా ఎంతగానో దోహదపడుతోంది. మన దేశంలో ఆన్‌లైన్ వేదికల ప్రభావాన్ని ప్రభుత్వం సైతం గుర్తించింది. కానీ ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. నాడు పట్వర్ధన్ డాక్యుమెంటరీని అడ్డుకున్న శక్తులే ఇప్పుడు కూడా తమ ఉనికిని చాటుకుంటున్నాయి. అవి ఎక్కడికీ పోలేదు. అదే తీర్పులో జస్టిస్ షా ఏమన్నారంటే 'తన విధానాలను దేశవ్యాప్తంగా జరిగే బహిరంగ చర్చలు, భావ వ్యక్తీకరణలను ప్రభుత్వం అణచివేయరాదు'. భావ ప్రకటనా స్వేచ్ఛకు భారత రాజ్యాంగం ఏ విధంగా వెన్నుదన్నుగా నిలుస్తోందో ఆ తీర్పు స్పష్టం చేసింది. అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ప్రజలకు లేకుండా పోయింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టాన్ని, నిన్నటి వరకూ బీజేపీని ప్రయోగించి అసమ్మతిని నేరపూరితం చేస్తున్నారు. అసమ్మతివాదులను లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారు.

'ఏపాట' మరింత పదును

వాస్తవానికి ఈ రెండింటికీ మరింత పదును పెట్టి 2019లో ఉపాను మరింత విస్తృతం చేశారు. వ్యక్తులను ఉగ్రవాదులుగా ముద్ర వేసేందుకు ఈ చట్టం అనుమతిస్తోంది. వలస పాలకుల కాలం నాటి రాజద్రోహ చట్టంతో సహ క్రిమినల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)ను తీసుకొచ్చారు. భారతీయ క్రిమినల్ చట్టం నుండి వలస పాలకుల మరకలను తొలగించేందుకు దీనిని ప్రవేశపెట్టామని చెబుతున్నప్పటికీ అప్పటి రాజద్రోహ నిబంధనలను తొలగించలేదు. పైగా దానిని మరింత విస్తరించారు. ఆధునీకరించారు. ఈ సంవత్సరం జులైలో బీఎన్ఎస్ అమలులోకి వచ్చింది. ఆ తర్వాత నాలుగు రోజులకే ఐదుగురు పాత్రికేయులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో అల్లరిమూక జరిపిన దాడికి సంబంధించి సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం ఆధారంగా చేసుకొని కేసులు పెట్టారు.

నిబంధనలు, బిల్లుల రూపంలో...

స్వీయ నియంత్రణ, తప్పుడు వార్తలు, ఆన్‌లైన్ వేదికలపై ప్రభావం పేరుతో ఆన్‌లైన్ ప్రసంగాలను అడ్డుకునేందుకు సర్కారు ప్రయత్నించింది. అందుకోసం ఐటీ చట్ట నిబంధనలు, డిజిటల్ ఇండియా బిల్లు, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లు వంటి వాటిని ప్రయోగించింది. 2021, 2023 ఐటీ నిబంధనలు వ్యతిరేకంగా న్యాయస్థానాలలో పిటిషన్లు దాఖలయ్యాయి. డిజిటల్ ఇండియా, బ్రాడ్‌కాస్టింగ్ బిల్లుల భవిష్యత్తు తెలియడం లేదు.

సమాచారంపై నియంత్రణ

దేశ భద్రత, సార్వభౌమత్వం పేరుతోనో లేదా దుష్ప్రచారం చేస్తున్నారన్న అభియోగంతోనో లేదా విద్వేష ప్రసంగం అనే ముద్రతోనో సమాచారాన్ని నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తప్పుడు వార్తలు లేదా తప్పుదోవ పట్టించే సమాచారాన్ని తొలగించేందుకు 2023లో ఐటీ నిబంధనలను రూపొందించారు. డిజిటల్ వేదికలలో కన్పించే సమాచారంపై నిఘా కోసం ప్రభుత్వం ఓ నిజనిర్ధారణ విభాగాన్ని (ఎఫ్‌సీయూ) ఏర్పాటు చేసింది. అయితే అది న్యాయసమీక్షలో నిలవలేదు. 'భావ ప్రకటనా స్వేచ్ఛ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అనేది ఇతర హక్కుల్ని వెల్లడించే హక్కు ఎందుకు?' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. టర్కీ, ఈజిప్ట్, పాకిస్తాన్ వంటి దేశాలలో కూడా ఆయా ప్రభుత్వాలు ఇలాంటి అమానుష చట్టాలు తీసుకొచ్చాయి.

ఏం జరుగుతుంది?

వివిధ గొంతుకలను వినిపిస్తున్న డిజిటల్ వేదికలకు చట్టపరంగా లభిస్తున్న రక్షణ పరిణామాలని భారత ప్రభుత్వం చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఆ సోషల్ వేదికలకు లభిస్తున్న రక్షణ కవచాన్ని బలహీనపరచేందుకు 2021లో ఐటీ నిబంధనలు ప్రవేశపెట్టారు. వాటికి కొనసాగింపుగా డిజిటల్ ఇండియా బిల్లు తీసుకొస్తారు. త్వరలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగనున్నాయి. అసమ్మతి గొంతులను ప్రభుత్వం పట్టించుకుంటుందా లేక తన నిర్ణయాలతో ముందుకు పోతుందా అనేది అప్పుడే తెలుస్తుంది.

ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్‌ల సరఫరా ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరించడం సరికాదని వీరయ్య ఈ సందర్భంగా హితవు పలికారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ కలిసి రావాలని తరుణంలో పోలీసులు శాంతియుత ధర్నాకు కూడా అనుమతి ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ అధినేతగా రాహుల్ గాంధీ చెప్పే దానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చేయాలని సూచించారు. ప్రపంచశాంతి కోసం ఉద్దేశించిన ధర్నాకు అనుమతి ఇవ్వరా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఒకలా, సీఎం రేవంత్ రెడ్డి మరొకలా చెప్పడం అవకాశవాదమే అవుతుందని విమర్శించారు. సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో సహ అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో 43 వేల మంది చనిపోగా, లక్షల మంది గాయాలపాలయ్యారని, 10 లక్షల మంది నిర్వాసితులయ్యారని తెలిపారు. పాఠశాలలు, ఆస్పత్రులు ధ్వంసమై ఆకలి చావులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తూ అదానీతో డ్రోన్‌లను సరఫరా చేయిస్తున్నదని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయుధాలు సరఫరా చేయరాదని విధానాన్ని ఐక్యరాజ్యసమితి(ఐరాస) తీసుకుందని తెలిపారు. ప్రపంచశాంతిని కోరే వారందరూ పాల్గొనాలని మద్దతివ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షపార్టీలు ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షను వ్యతిరేకించాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వగెలా యాదయ్య, జగదీష్, మధుసూదన్ రెడ్డి, కవిత, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూసీపై పూటకోమాట

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూసీ పరివాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ.లక్షన్నర కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు జులై 20న సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. అదే సీఎం సెప్టెంబరు ఆరున విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లో 18 బిలియన్ డాలర్ల (లక్షన్నర కోట్లు)తో మూసీ రివర్ ఫ్రంట్‌ను రీడెవలప్‌మెంట్ చేయబోతున్నామంటూ ప్రకటించారని తెలిపారు. జీవన నిర్మాణం విలేకర్ల సమావేశంలో అదే రేవంత్.. 'లక్షన్నర కోట్లు' అని ఎవరన్నారంటూ ఆవేశంతో ఊగిపోయారని విమర్శించారు. ఈ రకంగా పూటకో తీరుగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రిని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. డీపీఆర్ లేకుండానే రూ.లక్షన్నర కోట్లు ఖర్చుపెడతామంటూ చెప్పటం కాంగ్రెస్ సర్కారుకే చెల్లుబాటయిందని దుయ్యబట్టారు. మూసీ రీడెవలప్‌మెంట్ అండ్ రివర్ ఫ్రంట్ పేరిట ప్రజాధనం లూటీ చేయటానికి రేవంత్ సర్కార్ ఇలాంటి చర్యలకు పూనుకుంటోందని హరీశ్ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. జనరల్ ఇంగ్లీష్ పరీక్ష విజయవంతంగా ముగిసిందని తెలిపింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షను నిర్వహించామని తెలిపారు. 31,383 మంది అభ్యర్థులకుగాను 22,744 (72.4 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం 20 మంది స్పోర్ట్స్ అభ్యర్థులకు అదనంగా మెయిన్స్ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. 46 పరీక్షా కేంద్రాలు నుంచి సేకరించిన హాజరును ప్రకటించామని, అందులో స్వల్ప తేడాలుండొచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలను వాయిదా వేయాలని, 29 జీవోను రద్దు చేయాలని అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. 163 సెక్షన్‌ను అమలు చేశారు. రాష్ట్రంలో 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో అత్యంత పకడ్బందీగా నిర్వహించేలా టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,383 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు.

జోక్యం చేసుకోలేం

- మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకూ నిరాకరణ
- అభ్యర్థులు కేంద్రానికి చేరుకున్నాక పరీక్ష ఎలా ఆపగలం ?
- వాయిదా వేయాలని సర్వీస్ కమిషన్‌కు చెప్పలేం
- ఫలితాలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని లేదా రీ షెడ్యూల్ చేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించిన పలువురు అభ్యర్థులకు చుక్కెదురైంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పిటిషన్ పై జోక్యం చేసుకోలేమని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. అలాగే ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకూ నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలను పేర్కొందని సిజేఐ ధర్మాసనం పేర్కొంది. అయితే ఫలితాలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నిర్వహిస్తోన్న గ్రూప్-1 సర్వీసెస్ నియామకాల పరీక్షలను వాయిదా/రీ షెడ్యూల్ చేయాలని పోగుల రాంబాబు గత శు క్రవారం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29తో తమకు అన్యాయం జరుగుతుంద ని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. తొలుత ధర్మాసనం స్పందిస్తూ 'ఇప్పటికే అభ్యర్థులు ఎగ్జామ్ సెంటర్‌లో ఉన్నప్పుడు మేం ఏమి చేయగలం. ఇది గందరగోళానికి గురి చేస్తుంది' అని వ్యాఖ్యానించింది. ఇందుకు పిటిషన్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ గతంలో సుప్రీంకోర్టు గత తీర్పుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తీసుకువచ్చిందన్నారు. దాదాపు 14 ఏండ్ల తరువాత, 2014లో రాష్ట్రం విడిపోయిన తరువాత తొలిసారి గ్రూప్ 1 పరీక్ష జరుగుతోందని వివరించారు. జరుగుతున్నవి గ్రూప్ -1 పరీక్షలని, మరోసారి వీటిని ఇప్పట్లో చేయడం జరగదన్నారు. ఈ సారి అవకాశం కోల్పోతే, జీవితంలో తుది ఛాన్స్ ఉండదన్నారు. అందువల్ల జీవో 29 పై స్పష్టత వచ్చే వరకు పరీక్షలు నిర్వహించవద్దని కోరుతున్నట్లు కోర్టుకు నివేదించారు. మధ్యలో సీజేఐ జోక్యం చేసుకొని, అసలు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏ విధంగా పరీక్షను వాయిదా వేయమని ఆదేశించగలమని ప్రశ్నించారు.

ఇది అసాధారణమైన విషయం అని గుర్తు చేశారు. ఇందుకు సిబల్ బదులిస్తూ వేలాది మంది అభ్యర్థుల బహిష్కరణకు సంబంధించిన అంశమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు, బీసీలు, ఇతర వర్గాలు కేసులో తీర్పు వెలువరించాలని ధర్మాసనం ముందుంచారు. అయినప్పటికీ, ఎలా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆపగలమని కోర్టు వ్యాఖ్యానించింది. అందుకే నష్టపోతున్న అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతున్నామని సిబల్ వాదించారు. చాలా మంది అభ్యర్థులు వివక్షకు గురవుతున్నారని చెప్పారు. మరోసారి సిజేఐ ధర్మాసనం స్పందిస్తూ.. ఈ తుది తీర్పునకు లోబడే నియామకాలు జరపాల్సి ఉంటుందని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో వెల్లడించిన విషయాన్ని గుర్తు చేసింది.

తుది విచారణ ముగించండి

గత నెల 31న ఈ కేసు రాష్ట్ర హైకోర్టు ముందు విచారణకు వచ్చిందని ప్రభుత్వ తరపు సీనియర్ అడ్వకేట్ నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. టీజీపీఎస్సీ ఇప్పటికే ఈ కేసులో హైకోర్టు ముందు కౌంటర్ ఫైల్ చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనలను కౌంటర్ రూపంలో అందజేయనుందని వివరించారు. గత విచారణ సందర్భంగా ఈ పరీక్షలు పూర్తి చేసేందుకు ఎంత సమయం పడుతోందని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు. పరీక్షా ఫలితాలు ప్రకటించేందుకు మూడు నెలల సమయం కావాలని సర్వీస్ కమిషన్ సమాధానం ఇచ్చిందన్నారు. మధ్యలో సిబల్ జోక్యం చేసుకొని, ఫలితాలకు మూడు నెలల సమయం ఉన్నందున ఈ కేసును సోమవారం నాడే విచారించాలని కోరారు. ఈ కేసులో ఇచ్చే ఏ మధ్యంతర నిరాకరించారు. ఈ కేసులో ఇచ్చే ఏ మధ్యంతర తీర్పు అయినా పరీక్ష ప్రక్రియలో గణనీయమైన ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్టు సిజేఐ స్పష్టం చేశారు. తమ తుది తీర్పునకు లోబడే, నియామకాలు జరపాల్సి ఉంటుందని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొందని గుర్తు చేశారు. అయితే నవంబర్ 20న జరిగే తదుపరి విచారణకు రానుందన్నారు. అందువల్ల ఫలితాలు విడుదలకు ముందే ఈ కేసులో తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించినట్టు వెల్లడించారు. అలాగే పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్టు స్పష్టం చేశారు.






బీజేపీవి మహిళా వ్యతిరేక త్రిశూల్ విధానాలు

(మొదటిపేజీ తరువాయి)

సంపదను శాసిస్తున్నారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. దీంతో అసమానతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయని చెప్పారు. దీనికి బీజేపీ అనుసరిస్తున్న విధానాలే కారణమని దుయ్యబట్టారు. నేటి పురుషాధిక్య సమాజంలో ఆ పార్టీ మహిళలను తిరోగమన భావజాలం వైపు నడిపిస్తోందని విమర్శించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్... సంపన్నులకు రూ.40 లక్షల కోట్ల మేర రాయితీలిచ్చిందిగానీ, దేశంలోని వితంతువులు, ఒంటరి మహిళలు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల శ్రమ ద్వారా దేశం అభివృద్ధి చెందుతుంది, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అన్నారు. కానీ అదే మహిళలు స్వేచ్ఛకు, సమానత్వానికి దూరమవుతున్నారని వాపోయారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిలో 49 శాతం వాటాలను ప్రయివేటీకరించటానికి కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోందని బృందా ఈ సందర్భంగా హెచ్చరించారు. ఫలితంగా వేలాదిమంది కార్మికులు జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఉపరితల గనుల కోసం గిరిజనులు, దళితుల నుంచి పెద్ద ఎత్తున భూ సేకరణ చేస్తున్నారనీ, కానీ వారికి చట్ట ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణుగూరు ప్రాంతంలోని గిరిజనుల నుంచి సింగరేణి మూడుసార్లు భూములు గుంజుకుని వారిని నిర్వాసితులను చేసిందని గుర్తు చేశారు. అంటే దళితులు, ఆదివాసీలు, మహిళలు ఈ దేశ పౌరులు కాదా? అని ఆమె ఈ సందర్భంగా కేంద్రాన్ని ప్రశ్నించారు. వారి సంపదను బలవంతంగా లాక్కుని కార్పొరేట్లకు కట్టబెట్టటమే మోడీ సర్కారు లక్ష్యమా? అని నిలదీశారు.

బీజేపీ సర్కార్ మహిళలకు, వారి హక్కులకు వ్యతిరేకంగా పని చేస్తోందని బృందా విమర్శించారు. ఉపాధి హామీ పనులకు వెళుతున్న వారిలో 95 శాతం మంది మహిళలే ఉన్నారని వివరించారు. వారు రోజుకు మూడు వేల కిలోల మట్టిని మోస్తే... ఇచ్చే కూలి రూ.250 మాత్రమేనని వాపోయారు. ఇది పచ్చి శ్రమ దోపిడీ అని వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్‌లో మస్టర్‌కు సంబంధించి వేలి ముద్రలు పడకపోతే... ఆ పేరిట వేతనాలను చెల్లించకుండా ఆపేస్తున్నారని చెప్పారు. మోడీ చెబుతున్న డిజిటల్ ఇండియా ఇదేనా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మహిళలు ఇండ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తే, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం... హామీ ఇచ్చి నేటికీ అమలు చేయటం లేదని విమర్శించారు. ఇండ్లు లేని వారందరికీ పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బీజేపీ పదేండ్ల ఏలుబడిలో ఇప్పటి వరకూ 65 వేల మంది మహిళలు వరకట్న హత్యలకు గురయ్యారని బృందా ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో అత్యధిక మంది హిందూ మహిళలేనని వివరించారు. వీరిని హత్య చేసింది కూడా హిందువులేనని పేర్కొన్నారు. హిందూ మతం కోసమే ఉన్నామని చెప్పుకునే ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులకు వరకట్న సమస్యపై పోరాడే దమ్ము లేదా అని ప్రశ్నించారు. అలాంటి హత్యలకు గురవుతున్న వారు హిందువులు కాదా ? భారతీయులు కాదా ? అని ఆమె నిలదీశారు. మహిళలపై వరకట్న హత్యలు, అత్యాచారాలు, వేధింపులకు సంబంధించి ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఎందుకు నోరు మెదపటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా వారు బోధించే దేశభక్తి అని చురకలంటించారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలను బీజేపీ మతకోణంలో చూస్తోందని అన్నారు. కేవలం ఒక మతానికి చెందిన వారే మహిళల మీద హింసకు పాల్పడుతున్నారంటూ మైనారిటీలపై దాడులకు ఉసిగొల్పు తోందని చెప్పారు. మనదేశంలో ప్రతీ గంటకు 50 మంది మహిళలపై ఏదో ఒక రూపంలో హింస కొనసాగుతోందనీ, రోజూ 88 మంది మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ బీజేపీ మత భావంతోనే చూస్తోందని విమర్శించారు. ఆ పార్టీ పాలనలో మహిళలపై నేరాలు 28 శాతం పెరిగాయని వివరించారు. దీన్నిబట్టి బీజేపీ హయాంలో మహిళలకు కనీస రక్షణ లేకుండా పోయిందనే విషయం విదితమవుతున్నదని బృందా విశ్లేషించారు. దేశంలో ధరల పెరుగుదల అనేది ప్రజల ఆహార భద్రత సమస్యగా మారిందని హెచ్చరించారు. దీనిపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మహిళల స్వేచ్ఛ, సమానత్వం కోసం ఐద్వా నిరంతర పోరాటాలు నిర్వహిస్తోందనీ, వీటిని మరింత ఉధృతం చేయాల్సిన అవసరముందని ఆమె నొక్కి చెప్పారు. మోటూరి ఉదయం, లీలా సుందరయ్య, మల్లు స్వరాజ్యం, చిట్యాల ఐలమ్మ, మానికొండ సూర్యావతి లాంటి త్యాగధనుల పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని నేటి ఐద్వా నాయకులు, కార్యకర్తలు... బీజేపీ అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు బావుటా ఎగరేయాలని బృందాకారత్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి అధ్యక్షత వహించిన ఈ సభలో ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందరరామన్, జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి, డి.రమాదేవి, టి.జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మాజీ ఎంపీ మిడియం బాబూరావు పాల్గొన్నారు.



మహిళలు ఈ దేశ పౌరులు కాదా?

కొత్తగూడెం నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశంలో ఉన్న మహిళలు ఇక్కడి పౌరులు కాదా? అని ఐద్వా జాతీయ అధ్యక్షులు మరియం ధావలే ప్రశ్నించారు. ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా సోమవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయనీ, వాటిని తట్టుకోవటం సామాన్యులకు సాధ్యం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు దెబ్బతిన్న తర్వాత చేతిలో డబ్బు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి, ఇతర ఉపాధి అవకాశాలను కేంద్రం నిర్వీర్యం చేస్తున్నదని చెప్పారు. పేదలు అర్ధాకలితో, ఒక్క పూట మాత్రమే తింటున్న దృశ్యాలు ఈ సర్కారుకు కనపడక పోవటం విడ్డూరమని ఆమె విమర్శించారు. దేశంలో జరుగుతున్న అనేక పోరాటాల్లో మహిళల పాత్ర మరువలేనిదని చెప్పారు. వారు తమ హక్కుల కోసం ఉద్యమించాలనీ, అడ్డుగోడలను బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మీకే శ్రీమతి మాట్లాడుతూ... మోడీ పదేండ్ల పాలనలో మహిళల అభివృద్ధిని మరింత వెనక్కు నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి బతకటానికి కూడు, గూడు, గుడ్డ కనీస అవసరమని చెప్పారు. పేదల మౌలిక అవసరాలు తీర్చలేని సర్కార్ ఎవరి కోసం పని చేస్తున్నదని ప్రశ్నించారు. తినటానికి తిండి లేక, సరైన పౌష్టికాహారం లేక మహిళలు రోగాలు, నొప్పులు, రక్తహీనత తో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఆహార ధాన్యాలను సరఫరా చేయటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆహార భద్రతా చట్టాన్ని అది నిర్వీర్యం చేస్తోందని వాపోయారు. పేదలకు రావాల్సిన కనీస అవసరాలను తీర్చలేని మోడీ ప్రభుత్వం మహిళలు, దళితులు, ఇతర తరగతులపై హింసను ప్రేరేపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు లౌకికత్వం, సర్వమానవ సమానత్వ ఆకాంక్షతో ఎన్నో ఏండ్లుగా కలిసి బతుకుతున్నారని గుర్తుచేశారు. కానీ ఆ వాతావరణాన్ని బీజేపీ కలుషితం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరోగమన పాలకుల విధానాలను ఎండగడుతూనే మెరుగైన సమాజాన్ని నిర్మించుకుందామని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఓసీల్లో కంపెనీలన్నీ గుజరాత్‌వే

కొండాపురం నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్

మణుగూరు ఓసీల్లో పర్యటన

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఉపరితల గనుల్లో (ఓసీ) ప్రయివేట్ కంపెనీలన్నీ గుజరాత్‌కు చెందినవేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ బృందాకరత్ అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఓసీల్లో ఆమె పర్యటించారు. ఓసీ-2 పని ప్రదేశాలను పరిశీలిం చారు. స్థానిక సింగరేణి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుర్గ, మహాలక్ష్మి, వీబీఆర్, ఎంఐపీఎల్ కంపెనీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సింగరేణి ఓపెన్ కాస్ట్‌ల్లో 50 శాతం ప్రయివేటు, 50 శాతం సింగరేణి బొగ్గును వెలికి తీస్తున్నాయని అన్నారు. ఉపరితల గనుల వల్ల వేలాది ఎకరాల ప్రభుత్వ, అటవీ శాఖ భూములు ధ్వంసం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో స్థానిక భూ నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. భూములు కోల్పోయిన వారికి సింగరేణిలో ఉద్యోగాలు రాక వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయకపోవడం వల్ల ఈ ప్రాంత గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గిరిజన చట్టాలు, 5వ షెడ్యూల్ కూడా అమలు చేయలేదని, గిరిజనులకు సింగరేణి సరైన నష్టపరిహార ప్యాకేజీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మణుగూరులోని అన్ని ఓసీల్లో గుజరాత్‌కు చెందిన కంపెనీలు మాత్రమే పనిచేస్తున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 80 శాతం మంది కార్మికులు ఆయా కంపెనీల్లో పని చేస్తున్నారని, వారికి సరైన సౌకర్యాలు లేవని, ఎక్కువ గంటలు పని చేస్తున్నారని, దాని కారణంగా ఒత్తిడికి గురై తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూముల్లో సరైన వెలుతురు, గాలిరాకుండా బంధించి ఉంచుతున్నారని అన్నారు. వెంటనే కార్మిక చట్టాల ను అమలు చేయాలని, స్థానికులకు 80 శాతం ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్త కొండాపురం భూ నిర్వాసిత గ్రామాన్ని పరిశీలించారు. 25 ఏండ్ల క్రితం మొదటిసారి ఎకరానికి రూ.3,500, ఐదు సెంట్ల ఇంటి స్థలం, రెండెకరాల భూమి ఇచ్చారని బాధితులు ఆమెకు తెలిపారు. మణుగూరు ఓసీ కారణంగా రెండోసారి చాలామంది భూములు కోల్పోయారని, సరైన ప్యాకేజీ అందలేదని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు పోడు భూములను గుంజుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) భూ నిర్వాసితులకు అండగా ఉంటుందని బృందాకరత్ భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఆమె వెంట ఐద్వా ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి రమాదేవి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, టీవీఎమ్‌వీ ప్రసాద్, డి.లెనిన్ బాబు, విల్సన్ తదితరులు ఉన్నారు.




నేడు, రేపు మహాసభలు

ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలు కొత్తగూడెం క్లబ్‌లో మంగళ, బుధవారాల్లో నిర్వహించేం దుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సభలకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 600 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. రెండు రోజుల పాటు ఉండేందుకు వారికి తగిన సౌకర్యాలను కల్పించారు. ఈ సభల్లో అనేక కర్తవ్యాలు, తీర్మానాలతో పాటు రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకుంటారు. మహిళలపై హింస, లైంగికదాడులు, వేధింపుల నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, మద్యపాన నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయ హస్తం డబ్బులు తిరిగి ఇవ్వాలని, మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించాలని, వివిధ ప్రభుత్వ శాఖల్లో, పరిశ్రమల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని ఈ మహాసభల్లో ప్రతినిధులు చర్చించి, తీర్మానిస్తారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందరరామన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. జ్యోతి, కేఎన్ ఆశాలత, రాష్ట్ర సహాయ కార్యదర్శి మందలపు జ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు డి. సీతాలక్ష్మి, ఆఫీస్ బేరర్స్ మాచర్ల భారతి, అనురాధ, మహేశ్వరి, గీత, రత్నమాల, లక్ష్మమ్మ, శశికళ, వినోద, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిడికిలెత్తిన నారీలోకం

కొత్తగూడెంలో వేలాది మంది మహిళలతో భారీ ర్యాలీ

- కిక్కిరిసిన బహిరంగ సభా ప్రాంగణం
- ఆలోచింపజేసిన నేతల ప్రసంగాలు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కొత్తగూడెం

కొత్తగూడెం పట్టణం మహిళలతో పోటెత్తింది. ఎటు చూసినా ఎరుపు అంచుల తెల్ల చీరలు ధరించిన మహిళలే కనిపించారు. సోమవారం నుంచి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని వీధులు నారీమణులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే రాష్ట్ర నలుమూలల నుంచి మహిళలు తరలిరాగా.. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి భారీ సంఖ్యలో బహిరంగ సభకు హాజరయ్యారు.

కొమ్ము బూరలు కోలాట నృత్యాలతో ఆకట్టుకున్న ప్రదర్శన

ర్యాలీ ఆద్యంతం కదం తొక్కారు. మహిళా హక్కులు, చట్టాల పరిరక్షణ, భద్రత కోసం గొంతెత్తి నినదించారు. కొత్తగూడెం పాత డిపో సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ఐద్వా నాయకులు ముందు వరుసలో ఫ్లెక్సీ పట్టుకొని.. నినాదాలు ఇస్తూ నడుస్తుండగా మిగిలిన మహిళలు వారిని అనుసరించారు. పాత డిపో నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన గణేష్ టెంపుల్, సూపర్ బజార్ మీదుగా బహిరంగ సభా ప్రాంగణం కూలీ లైన్ సూర్యా ప్యాలెస్ వరకు సాగింది. డప్పు, కొమ్ము, కోలాట నృత్యాలతో గిరిజన మహిళలు ప్రదర్శనకు కొత్త వన్నె తీసుకొచ్చారు. ఐద్వా మహాసభలు విజయవంతం చేయాలని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం జరిగిన బహిరంగసభలో.. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలా నిర్వీర్యం చేస్తుందో ఐద్వా జాతీయ, రాష్ట్ర నేతలు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

ఉచిత బస్సు సౌకర్యం కల్పించి.. సంఖ్య తగ్గించారు : ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిన ప్రభుత్వం బస్సుల సంఖ్య తగ్గించడాన్ని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ ఖండించారు. ఉచిత బస్సుల్లో వెళ్తున్న మహిళలపై చులకన భావన తగదన్నారు. బీజేపీ భావాజాలం వల్ల హింస పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకుండా కేరళ, తమిళనాడు తరహాలో నియంత్రించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన ఆస్పత్రులు, పాఠశాలలు ఏర్పాటు చేయాలి కానీ మద్యం దుకాణాలు నెలకొల్పడాన్ని ఖండించారు. దుర్గమ్మ, జయమ్మ, హైమావతి స్ఫూర్తితో మహిళా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



మహిళలు తలుచుకుంటే ప్రభుత్వాలే కూలాయి

ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి

మహిళలు తలుచుకుంటే ప్రభుత్వాలే కూలాయని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి తెలిపారు. మద్యపాన వ్యతిరేక పోరాటాన్ని నిర్వహించి నాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించిన చరిత్ర మహిళలకు ఉందని గుర్తు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా నాయకులకు కొదవ లేదని అన్నారు. ఊరు ఊరునా.. వాడవాడనా వారందరినీ ఐద్వా కమిటీల్లో చేర్చాలని పిలుపు నిచ్చారు. బలవన్మరణాలకు కారణం అవుతున్న లోన్ యాప్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆపాలని కోరారు. 'బయట జనాలు గుర్తిస్తేనే ఇంట్లో మొగుడు గుర్తిస్తాడు.. రండి పోరాడుదాం' అన్న మల్లు స్వరాజ్యం మాటల స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.




అధికారపీఠంపై ఛాందసవాదులు : మాజీ ఎంపీ మిడియం బాబూరావు



ఆధిపత్య భావజాలం ఉన్నవారు అధికారంలో ఉండటంతో మహిళలపై చిన్న చూపు కొనసాగుతోందని మాజీ ఎంపీ మిడియం బాబూరావు ఆరోపించారు. ఛాందసవాదులు రాజ్యాన్ని ఏలుతున్నారని అన్నారు. మహిళలపైనే కాదు, సాంస్కృతికంగానూ దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన వాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతి 1000 మందికి గాను 1008 మంది స్త్రీలు ఉన్నారని, ఆదివాసీల్లో 1000 మందికి 1017 మంది మహిళలు ఉన్నారని వివరించారు. పురుషుల కన్నా మహిళలు ఎక్కువగా ఉన్నా మహిళలను ద్వితీయశ్రేణిగా చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సందర్భంలో భద్రాద్రి జిల్లా మహిళా నాయకురాలు చూపించిన తెగువను అభినందించారు. కుటుంబ సభ్యులు, బంధువులు సైతం ముట్టని శవాలకు అంత్యక్రియలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు.

బీజేపీ పాలనలో మహిళల భద్రతకు ముప్పు : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

బీజేపీ పాలనలో మహిళల భద్రత ప్రమాదంలో పడిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళలతో పాటు ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం కోసం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా నిరుపేదల ఇండ్లు కూల్చడాన్ని ఖండించారు. సమాన పనికి సమాన వేతనం, 498ఏ వంటి చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్రం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు హామీ ప్రకారం కేంద్రం సైతం రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగమైన రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు పథకాల అమలు సక్రమంగా కొనసాగడం లేదని తెలిపారు. బీఆర్ ఎస్ తరహా పాలనను కాంగ్రెస్ కొనసాగిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మహిళలు సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఇజ్రాయిల్ యుద్ధంపై భారత్ తటస్థ వైఖరి
అమెరికా సామ్రాజ్యవాద మెప్పు కోసమే


రెండు వైపులా ఆయుధాలతో చేసేది యుద్ధం | **ఇజ్రాయిల్‌ది యుద్ధం కాదు.. పాలస్తీనాపై మారణహోమం**

జియోనిస్టులు, సంఘ్ పరివారులు కవల సోదరులు : కేరళ సీఎం

పినరయి విజయన్ ఘాటు విమర్శలు

తిరువనంతపురం: ఇజ్రాయిల్ బాంబుల వర్షంలో పాలస్తీనా రక్తమోడుతున్నది. దశాబ్దాలుగా బాధిత పాలస్తీనాకు అండగా నిలిచిన భారత్.. దౌత్య వైఖరిని సవరించుకుంది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం చేస్తున్న ఈ నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ భారత వైఖరిని తప్పుబట్టారు. పాలస్తీనాకు మద్దతుగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాద మెప్పు కోసం ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తున్నదని విమర్శించారు. మన దేశంలో అధికారంలో ఉన్నవారు.. ఇజ్రాయిల్‌లోని జియోనిస్టులు కవల సోదరులని, వీరి మధ్య తేడాలేమీ లేవన్నారు. కన్నూర్‌లో నిర్వహించిన సీహెచ్ కానరం స్మారక సమావేశంలో సీఎం పినరయి మాట్లాడారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి కేరళ సీఎం పినరయి విజయన్ ఇజ్రాయిల్ తీరును నిలదీస్తూ వస్తున్నారు.

ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తటస్థ వైఖరిని అవలంబించడాన్ని తప్పుపట్టారు. 'ఐరాసకు చెందిన చాలా సభ్య దేశాలు యుద్ధాన్ని విరమించాలని ఇజ్రాయిల్‌ను కోరాయి. అమెరికా వంటి కొన్ని దేశాలు మినహా అన్ని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశాయి. ఇందులో మనం ఎక్కడ ఉన్నాం? గొప్ప చరిత్రగల భారత్ ఎక్కడ ఉన్నది? తటస్థంగా ఉన్నది. యూఎన్ ఓటింగ్ ప్రక్రియ లోనూ పాల్గొనడం లేదు. మనం పాలస్తీనా వెంటలేము. పాలస్తీనాపై మారణహోమాన్ని ఆపాలనే దేశాల జాబితాలో లేము. అంటే.. వేరే వైపున మనం ఉన్నట్టే కదా' అని సీఎం పినరయి విజయన్ వివరించారు.



చాలా దేశాల్లాగే ఇటలీ కూడా ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాను నిలిపేసిందని, కానీ, ఇండియా మాత్రం నిలుపలేదని విజయన్ చెప్పారు. 'ఇజ్రాయిల్‌తో ఆయుధ వ్యాపారం ఎక్కువ చేసే దేశం మనది. ఇప్పుడు ఇజ్రాయిల్‌కు అవసరమైన ఆయుధాలు తయారు చేసే దేశంగా మారింది' అని విమర్శించారు. 'పాలస్తీనాలో జరుగుతున్నదాన్ని యుద్ధం అని పిలువలేం. రెండు వైపులా ఆయుధాలతో పోరాడేదాన్ని యుద్ధం అనాలి. కానీ, ఇది ఏకపక్ష దాడి. ఇజ్రాయిల్ నాశనం చేయడానికే బయల్దేరింది. అందుకు అన్ని ఆయుధాలు వాడు తున్నది. ఇది యుద్ధం కాదు. మారణహోమమే' అని సీఎం పినరయి విజయన్ స్పష్టం చేశారు.

స్టాలిన్ నోట బాబు మాట

పెద్ద కుటుంబాలు ఉండాలన్న తమిళనాడు సీఎం

16 మంది పిల్లలను కనాలని సూచన



చెన్నయ్ : 'చిన్న కుటుంబం...చింతలు లేని కుటుంబం' అనేది నిన్నటి నేతల మాట. మరి ఇప్పుడో? పిల్లాపాపలతో ఇల్లు కళకళలాడుతుండాలని నేటి తరం నాయకులు కొందరు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద కుటుంబాల ఆవశ్యకతను నొక్కి చెప్పగా తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా అదే మాట అన్నారు. జనాభా తక్కువగా ఉన్నందున నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో నష్టపోతామని దక్షిణాది రాష్ట్రాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇరువురు నేతల మాటలు పునర్విభజన పైన, దక్షిణాది రాష్ట్రాలపై దాని ప్రభావం పైన చర్చకు తెరలేపాయి. అయితే చంద్రబాబు ఉద్దేశం వేరని, రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఆయన ఆ వ్యాఖ్య చేశారని టీడీపీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 31 జంటలకు సోమవారం జరిగిన హిందూ వివాహ కార్యక్రమంలో స్టాలిన్ ప్రసంగిస్తూ '16 మంది పిల్లలను కనండి' అంటూ సలహా ఇచ్చారు. వివాహమైన జంటను కుటుంబ పెద్దలు '16 రకాల సంపదను పొంది సౌభాగ్యవంతంగా జీవించాలని' ఆశీర్వదించడం తమిళనాడు సంప్రదాయమని ఆయన గుర్తు చేశారు. 'ఈ ఆశీర్వాదం అర్థం 16 మంది పిల్లలను కనాలని కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి వచ్చింది. చిన్న కుటుంబం కాకుండా 16 మంది సంతానాన్ని కనాలని ప్రజలు భావిస్తున్నారు' అని అన్నారు. ఆ పిల్లలకు అందమైన తమిళ పేర్లు పెట్టాలని సూచిస్తూ రాష్ట్ర గవర్నరుపై స్టాలిన్ పరోక్షంగా విమర్శలు చేశారు.

109మందితో ఇండోనేషియాలో జంబో క్యాబినెట్



జకార్తా : కొత్తగా ఎన్నికైన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబౌ సుబియంటో 109మంది సభ్యులతో జంబో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. పటిష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిన చేశారు. క్యాబినెట్ మంత్రులు, వైస్ మినిస్టర్‌లు, జాతీయ సంస్థల అధిపతుల పేర్లను ఆదివారం పొద్దుపోయిన తర్వాత ఆయన ప్రకటించారు. గత అధ్యక్షుడు జోకో విడుడో ప్రభుత్వంలో 34మంది మంత్రులే వుండేవారు. తనకు బలమైన పాలనా యంత్రాంగం కావాలని, అందువల్ల తాను ఎక్కువమందితోనే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తానని సుబియంటో ఇంతకుముందే ప్రకటించారు. భిన్న సంస్కృతులు కలిగిన, విభిన్నమైన రాజకీయ ప్రయోజనాలు కలిగిన మన సమాజంలో పటిష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నది తన అభిమతమని చెప్పారు. ఇందుకోసం గత వారం ఆయన వందమందికి పైగా ప్రజలను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఏడు పార్టీల సంకీర్ణంతో కూడిన ప్రభుత్వంలో అన్ని పార్టీలకు చెందిన ప్రతినిధులు మంత్రివర్గంలో వున్నారు. మాజీ అధ్యక్షుడు విడుడో కుమారుడు రాకాను తన సహచరుడిగా, కొత్త ఉపాధ్యక్షుడిగా సుబియంటో ప్రకటించారు. దీంతో పూర్వపు ప్రత్యర్థులు మిత్రులుగా మారారు. అధ్యక్ష ఎన్నికల్లో కూడా సుబియంటో అభ్యర్థిత్వానికి విడుడో మద్దతు తెలిపారు. దీంతో ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో సుబియంటో ఘన విజయం సాధించారు. విడుడో క్యాబినెట్ సభ్యుల్లో దాదాపు సగం మందికి సుబియంటో తిరిగి ప్రాతినిధ్యం కల్పించారు.

స్కామ్ దర్యాప్తులో బెదిరించారు

ఒక కుంభకోణానికి సంబంధించిన దర్యాప్తు విషయంలో మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నేత తనను బెదిరించారని ఐపీఎస్ అధికారిని ఆరోపించారు. ఈ ఆరోపణలను సదరు బీజేపీ నాయకుడు తోసిపుచ్చారు. 2020 నుంచి 2022 వరకు జలగావ్‌కు చెందిన బైచంద్ హీరాచంద్ రైసో(బీహెచ్ఆర్)ని క్రెడిట్ సొసైటీకి సంబంధించిన రూ.1200 కోట్ల ఆరోపిత కుంభకోణంలో బలవంతం, బెదిరింపులకు దిగారని ఐపీఎస్ అధికారిని భాగ్యశ్రీ నవటకే.. బీజేపీ మంత్రి గిరిశ్ మహాజన్‌పై ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై మంత్రి స్పందించారు. ఈ స్కాంలో తాను, తన భార్య ఎలాంటి ఆర్థిక జోక్యమూ చేసుకోలేదని వివరించారు. " రాజకీయ ఒత్తిడితో కాకుండా.. దర్యాప్తుల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవటంపై అధికారులు దృష్టి సారించాలి. మేము లోన్లలో ఒక్క రూపాయీ తీసుకోలేదు. ఎలాంటి ప్రయోజనమూ పొందలేదు" అని ఆయన అన్నారు. ఇదంతా కేసులో తనను ఇరికించే ప్రయత్నమని బీజేపీ మంత్రి ఆరోపించారు.

కేసు పురోగతికి ఆటంకంగా మారిన రాజకీయ జోక్యం

బీజేపీమంత్రిపై ఐపీఎస్ అధికారిని ఆరోపణలు

తోసిపుచ్చిన గిరిశ్ మహాజన్



ముంబయి : 2020-21లో పూణే డీసీపీ (ఆర్థిక నేరాల విభాగం)గా విధులు నిర్వహించిన నవటకే.. స్కామ్‌కు సంబంధించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు నేతృత్వం వహించారు. అవినీతిని బయటకు తీయాలన్న తన ప్రయత్నాలకు అవరోధం ఏర్పడిందని ఆమె ఆరోపించారు. దర్యాప్తులో భాగంగా డిపాజిటర్లకు చెందిన దాదాపు రూ.100 కోట్ల నగదును రికవరీ చేసినట్టు ధృవీకరించారు. అయితే, కేసు పురోగతికి రాజకీయ జోక్యం ఆటంకంగా మారిందని ఆమె ఆరోపించారు. మహాజన్, వ్యాపారవేత్త సునీల్ జవార్‌లతో పాటు కొందరు ప్రభావశీల వ్యక్తులు తనను లక్ష్యంగా చేసుకొని బలిపశువును చేశారని బాంబే హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఐపీఎస్ అధికారిని ఆరోపించారు. క్రెడిట్ సొసైటీ లిక్విడేషన్ చుట్టూ ఉన్న మోసపూరిత కార్యకలాపాల నుంచి ప్రయోజనం పొందింది వారేనని ఆమె వివరించారు.

2022 చివరలో తాను పూణే నుంచి బదిలీ అయిన తర్వాత మహాజన్ తనను పిలిచి, జవార్, ఇతర నిందితులపై దర్యాప్తును నిలిపివేయాలని బెదిరిం చారని ఆమె ఆరోపించారు. స్కీమ్ లబ్ధిదారుగా మధ్యంతర ఫోరెన్సిక్ నివేదికలో మహాజన్ పేరు రావటమే బెదిరింపులకు కారణ మైందని వివరించారు.

2022లో మహారాష్ట్రలో ప్రభుత్వం మారటంతో ఈ కేసు దర్యాప్తు కష్టంగా మారింది. ఎన్డీయే సర్కారు అధికారాన్ని చేజిక్కించు కోవటంతో దర్యాప్తులోని కీల కాంశాలు నేర దర్యాప్తు విభాగం (సీఐడీ)కు బదిలీ అయ్యాయి. అయితే, న్యాయ పరమైన సవాళ్లు ఎదురుకావటంతో ఈ కేసుకు సంబంధించిన మూడు ఎఫ్ఐఆర్‌లలో ఒక్కటి మాత్రమే ట్రాన్స్‌ఫర్ అయింది. ఫిర్యాదు దారులు లేకుండానే ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదులను నమోదు చేస్తున్నారని నవటకేపై ఎఫ్ఐఆర్ దాఖలైంది. అయితే, ఈ అభియోగాలు కల్పితమైనవని ఆమె తోసిపుచ్చారు.

కాశ్మీర్ ఎన్నటికీ పాకిస్తాన్ కాబోదు

ఉగ్రవాదులపై ఫరూఖ్ మండిపాటు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లోని గండర్ బాల్ జిల్లాలో జరిగిన ఉగ్రవాద దాడిని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దులా సోమవారం తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో ఓ వైద్యుడు, ఆరుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఫరూఖ్ స్పందిస్తూ కాశ్మీర్ ఎన్నటికీ పాకిస్తాన్ కాబోదని పొరుగు దేశానికి స్పష్టమైన సందేశాన్ని అందించారు. ఈ దాడి వెనుక ఉగ్రవాదుల ఉద్దేశాన్ని ఆయన ప్రశ్నిస్తూ ఇలాంటి మతిలేని దాడులకు ఎందుకు తెగబడుతున్నారని నిలదీశారు. ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపేసి, భారత్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకోవాలని పాకిస్తాన్‌కు హితవు పలికారు. 'ఈ దాడి అత్యంత దురదృష్టకరం. వలస వచ్చిన కార్మికులు, ఓ వైద్యుడు ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి దాడుల ద్వారా ఉగ్రవాదులు ఇక్కడ పాకిస్తాన్‌ను సృష్టించాలని అనుకుంటున్నారా? అది జరిగే పని కాదు. వాళ్లు 75 సంవత్సరాలు ఆ పని చేయలేకపోయారు. అలాంటప్పుడు ఇప్పుడు ఎలా సాధ్యమవుతుంది? ఉగ్రవాదానికి స్వస్తి చెప్పేందుకు సమయం ఆసన్నమైంది. లేకుంటే ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. అమాయకులైన మన ప్రజలను చంపుతుంటే చర్చలు ఎలా జరపగలం?' అని ఫరూఖ్ మండిపడ్డారు.

నిరసన చేస్తున్న విద్యార్థులను ప్రేరేపించారనీ..

- 'టిస్' ప్రొఫెసర్‌కు షోకాజ్ నోటీసు
- సంస్థ చర్యను తప్పుబట్టిన విద్యావేత్త

న్యూఢిల్లీ : తమ హైదరాబాద్ క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అర్జున్ సేన్ గుప్తాకు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) షోకాజ్ నోటీసును జారీ చేసింది. నిరసన చేస్తున్న విద్యార్థులను ప్రేరేపిస్తున్నారన్న ఆరోపణలపై టిస్ ఈ చర్యకు దిగింది. ఈనెల 4న విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసిన నిరసన ప్రదర్శనలో సేన్‌గుప్తా మాట్లాడారు. జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమై కార్యకలాపాలు చేశారన్న ఆరోపణలపై ఏప్రిల్‌లో సస్పెండ్ అయిన పీహెచ్‌డీ స్కాలర్, దళిత విద్యార్థి నేత విద్యార్థి రామదాస్ ప్రిని శివనాదన్‌కు ఆయన సంఘీభావం ప్రకటించారు. అయితే, దీనికి సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూపిస్తూ టిస్ యాజమాన్యం సేన్‌గుప్తాకు నోటీసును పంపింది. అయితే, తనకు ఇచ్చిన నోటీసుపై సేన్ గుప్తా స్పందించారు. వాస్తవానికిది నిరాధారం, రాజ్యాంగ, చట్టవిరుద్ధమని అన్నారు. ఈ విషయంలో తనను వ్యక్తిగత విచారణకు నిరాకరించారని తెలిపారు. ఈనెల 8న అందిన నోటీసుకు.. 13న సేన్‌గుప్తా తన ప్రతిస్పందనను తెలియజేశారు. "టిస్ హైదరాబాద్ క్యాంపస్‌లో ఈనెల 4న అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేసన్ (ఏఎస్ఏ), ది ప్రొగ్రెస్సివ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (పీఎస్ఓ)లు నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఈ వీడియో నా ప్రసంగ భాగం. టిస్ క్యాంపస్‌లంతటా ఉన్న మూడు మేజరల్ విద్యార్థి సంఘాలు పీఎస్ఎఫ్, ఏఎస్ఏ, పీఎస్ఓలను నేను స్పష్టంగా పేర్కొన్నాను. నా ప్రసంగం సమయంలో నేను నినాదాలు చేశాననీ, ఎవరినైనా ప్రేరేపించానని చెప్పటం అవాస్తవం" అని ఆయన వివరించారు.

రేవంత్ తీరు గోబెల్స్ మాదిరిగా వందసార్లు చెప్పినా అబద్ధం నిజం కాదు

- మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగాల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరు హిట్లర్ ప్రచారశాఖ మంత్రరి గోబెల్స్‌ను తలపిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 61 వేలు పోస్టులు భర్తీ చేశామనీ, పోలీస్ శాఖలోనే 30,731 ఉద్యోగాలు భర్తీ చేసినట్టు తెలిపారు. మరో 16 వేల పోస్టులకు నోటిఫికేషన్లు జారీ, రాత పరీక్షలు,, ఫిజికల్ టెస్టులు నిర్వహించి, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసినట్టు గుర్తుచేశారు. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టినట్టు సీఎం రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వాటి భర్తీ ప్రక్రియ పూర్తిగా బీఆర్ఎస్ పాలనలోనే జరిగిందని తెలిపారు. గ్రూప్ 1 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆకాంక్షలను కాలరాసిన కాంగ్రెస్‌ను సమాజం క్షమించదనీ, నిరుద్యోగులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆర్థికపరిస్థితిపై స్పష్టత లేని సీఎం రేవంత్ రెడ్డి

- మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డికి స్పష్టత, దార్శనికత లేదని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సచివాలయంలో సమీక్షా సమయంలో ఒకలా, ఐఎస్ బీ కార్యక్రమంలో మరో రకంగా మాట్లాడారని తప్పు పట్టారు. ముఖ్యమంత్రి లోతుగా సమీక్షించడం లేదనీ, రాష్ట్రంలో ఏ వర్గంలో విశ్వాసం కల్పించకపోవడంతోనే ఆదయం తగ్గిందని తెలిపారు. హైడ్రా కూల్చివేతల ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై పడిందన చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. రాష్ట్ర జీఎస్డీపీని వన్ ట్రిలియన్ ఎకానమీ గా మారుస్తానంటున్న రేవంత్ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రిజర్వేషన్లపై రేవంత్ సర్కార్‌కు రాజ్యాంగ స్ఫూర్తి కొరవడిందని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల ప్రతిష్టను పెంచాలి

డాక్టర్లతో మంత్రి దామోదరరాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రభుత్వ దవాఖాన్ల బ్రాండ్ ఇమేజ్ పెంచేలా డాక్టర్లు పని చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. మెడికల్ కాలేజీల అనుబంధ హాస్పిటల్స్(టీచింగ్ హాస్పిటల్స్) పనితీరుపై మంత్రి సోమవారం సమీక్షించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, గాంధీ, ఉస్మానియా సహ వివిధ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. టీచింగ్ హాస్పిటళ్ల అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ సర్వీసులు, బెడ్ల సంఖ్య తదితర అంశాలపై డీఎంఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖాన్ల బ్రాండ్ ఇమేజ్ పెంచాలని, ప్రజలకు హాస్పిటళ్లపై మరింత నమ్మకం, భరోసా కల్పించేలా పని విధానం ఉండాలని సూచించారు. హాస్పిటళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అదే సమయంలో హాస్పిటళ్ల పనితీరును కూడా సమీక్షిస్తాననీ, పేషెంట్లకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేసి, ఎక్కడైనా శానిటేషన్ సరిగా లేకపోతే వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఎంఈని, సెక్రటరీని మంత్రి ఆదేశించారు. హాస్పిటళ్లలో ఉన్న ఎక్విప్‌మెంట్ రిపేర్లు వస్తే వెంటనే బాగు చేయించాలనీ, రిపేర్ల సాకుతో పేషెంట్లను బయటకు రిఫర్ చేయెద్దని తెలిపారు. పేషెంట్ల లోడుకు అనుగుణంగా ఎక్విప్‌మెంట్ సమకూర్చుకోవాలనీ, అవసరమైన హాస్పిటళ్లకు కొత్త ఎక్విప్‌మెంట్ మంజూరు చేయాలని సెక్రటరీకి మంత్రి సూచించారు.

కొన్ని మాతా, శిశు ఆరోగ్య కేంద్రాల్లో(ఎంసీహెచ్) స్కానింగ్ కోసం ఎక్కువసేపు వెయిట్ చేయిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. అవసరమైతే స్కానింగ్ యంత్రాల సంఖ్యను పెంచుకోవాలే తప్పితే, గర్భిణులను గంటలకొద్దీ వెయిట్ చేయించొద్దని తెలిపారు. గర్భిణులు, వారి వెంబడి వచ్చిన కుటుంబ సభ్యులు కూర్చునేందుకు సీటింగ్ అరెంజ్‌మెంట్ చేయాలని సూచించారు. జిల్లాల్లోని టీచింగ్ హాస్పిటళ్ల నుంచి హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియాకు చిన్న చిన్న కేసులను కూడా రెఫర్ చేసి పేషెంట్లను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి సూచించారు. జిల్లాల్లోనే ట్రీట్‌మెంట్ అందించాలనీ, తప్పనిసరి అయితేనే హైదరాబాద్‌కు రెఫర్ చేయాలని మంత్రి సూచించారు. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఫైళ్లను పెండింగ్ పెట్టొద్దనీ, వెనువెంటనే క్లియర్ చేయాలని డీఎంఈకి మంత్రి సూచించారు.

నిజామాబాద్ హాస్పిటల్ నుంచి బాలుడిని కిడ్నాప్ చేసిన ఘటనపై మంత్రి ఆరా తీశారు. రాత్రిపూట సెక్యూరిటీని మరింత పటిష్టం చేయాలనీ, హాస్పిటల్ నుంచి బయటకు వెళ్లేవారినీ, లోపలికి వచ్చేవారిని తరుచుగా తనిఖీ చేయాలని సూచించారు. నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో అగ్ని ప్రమాదంపై సైతం మంత్రి ఆరా తీశారు. రెగ్యులర్‌గా ఫైర్ ఆడిట్ చేయాలనీ, ఇలాంటి ఘటనల పునరావృతం అవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఫైర్ అలార్మ్, మంటలను ఆర్పే ఎక్విప్‌మెంట్ అన్ని హాస్పిటళ్లలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే, షార్ట్ సర్క్యూట్స్ జరగకుండా రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలనీ, అవసరమైన చోట వైరింగ్ మార్చాలని మంత్రి సూచించారు.నా

సియోల్‌లో మంత్రుల బృందం పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు ఈ బందంలో ఉన్నారు. సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను ఈ బృందం సందర్శించింది. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏండ్లలో పూర్తిగా భూఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతి పెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది.



ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8 వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్టు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

రిసాయా అకాడమీతో ఎన్ఏయూ భాగస్వామ్యం

- ఆధునిక టెక్నాలజీలో నైపుణ్యాల పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని భారతీయ విద్యార్థులకు టెక్నాలజీ రంగంలో ప్రత్యేక విద్యను అందించడానికి రిసాయా అకాడమీతో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు నార్తర్న్ అరిజోనా యూనివర్సిటీ (ఎన్ఏయూ) తెలిపింది. ఇందుకోసం ఐదు వారాల సమ్మర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది. ఈ భాగస్వామ్యానికి మల్లారెడ్డి విశ్వవిద్యాలయంతో చేసుకున్న అవగాహన ఒప్పందంతో మరింత మంది విద్యార్థుల రాక పెరగనుందని పేర్కొంది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్ఏయూ గ్లోబల్ అఫైర్స్ అసోసియేట్ వైస్ ప్రోవోస్ట్ సీజర్ ఫ్లోర్స్, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వీఎస్‌కె రెడ్డి మాట్లాడుతూ ఈ ఇంటెన్సివ్ సమ్మర్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్లాక్‌చైన్, ఏఐ, ఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) వంటి రంగాల్లో డిగ్రీలు అభ్యసిస్తున్న విద్యార్థులకు క్లిష్టమైన నైపుణ్యాలను పొందడానికి వీలుందన్నారు. ఈ భాగస్వామ్యం భారతీయ విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో ప్రత్యేకమైన అవకాశాలను ఇస్తుందని రిసాయా అకాడమీ సీఈవో రితీష్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో మల్లారెడ్డి యూనివర్శిటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ శాంతి కుమార్, ఎన్ఏయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

జమ్ముకాశ్మీర్ మీడియా ప్రతినిధి బృంద పర్యటన

- రాష్ట్రంలో ఐదురోజుల పాటు సందర్శన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) శ్రీనగర్ డిప్యూటీ డైరెక్టర్ తారిఖ్ రాథర్ నేతృత్వంలో జమ్మూకశ్మీర్‌కు చెందిన 14 మంది మీడియా ప్రతినిధుల బృందం సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చింది. ఈ నెల 25 వరకు రాష్ట్రంలో ఆ బృందం పలు ప్రదేశాలను సందర్శించనున్నది. పర్యటనలో భాగంగా నేడు తొలిరోజు భారత ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్కోయిస్)ను సందర్శించింది. ఫిషింగ్ జోన్ల సామర్థ్యంపై సలహాలు, తుపాను, ఉప్పెన, సునామీలపై ముందస్తు హెచ్చరికలు, సముద్ర స్థితిపై అంచనాలు, పగడపు దిబ్బల (కోరల్ బ్లీచింగ్)పై హెచ్చరికలు, ఆల్గల్ బ్లూమ్ సమాచార సేవలతో సహా ఇన్కోయిస్ అనేక సేవల గురించి బృంద సభ్యులు అడిగి తెలుసుకున్నారు. నిరంతర సముద్ర పరిశీలనలు, సమాచార నిర్వహణ, సముద్ర మోడలింగ్ (సముద్రంలో జరిగే ప్రక్రియలను అర్థం చేసుకోవడానికి ,అంచనా వేయడానికి శాస్త్రవేత్తలు ఉపయోగించే ఒక పద్ధతి)లో నిరంతర మెరుగుదల ద్వారా సమాజం, పరిశ్రమ, ప్రభుత్వం, శాస్త్రీయ సమాజం వంటి వివిధ రంగాలకు సముద్ర డేటా, సమాచారం, సలహా సేవలను తమ సంస్థ అందిస్తున్న తీరును ఇన్కోయిస్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల శ్రీనివాస కుమార్ ప్రతినిధి బృందానికి వివరించారు.

సునామీలు, తుపాను, ఉప్పెనలు వంటి విపత్కర పరిస్థితుల్లో సముద్ర సమాచారం, సలహా సేవలను అందించడంలో సంస్థ పాత్ర గురించి ఇన్కోయిస్ శాస్త్రవేత్త డి అజయ్ బృంద సభ్యులకు వివరించారు. తెలంగాణలో వివిధ భారత ప్రభుత్వ పథకాల అమలు ద్వారా జరుగుతున్న అభివృద్ధిని వీక్షించే అవకాశాన్ని జమ్మూకశ్మీర్ లోని మీడియాకు కల్పించేందుకు కేంద్ర రంగ పథకం 'డెవలప్ మెంట్ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ డిస్ట్రిబ్యూషన్ ' కింద పిఐబి, జమ్మూకశ్మీర్ ఈ టూర్‌ను నిర్వహిస్తోంది. అంతకుముందు, హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయాన్ని ఆ బృందం సందర్శించింది. జమ్ముకాశ్మీర్ మీడియా ప్రతినిధి బందానికి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ తెలంగాణలో సంస్థ పనితీరు గురించి వివరించారు. పీఐబీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, ఇతర అధికారులు మీడియా ప్రతినిధి బృందం వెంట ఉన్నారు.

బిజినెస్

చిన్న నగరాల్లో నివాస అమ్మకాలు పతనం

- టాప్ 30 టైర్2 సిటీల్లో వెలవెల
- 3-61 శాతం వరకు క్షీణత
- విజయవాడ, వైజాగ్‌లోనూ అంతంతే
- ప్రాప్‌ఈక్విటీ రిపోర్ట్ వెల్లడి



నవతెలంగాణ- బిజినెస్ బ్యూరో

దేశంలోని ద్వితీయ శ్రేణీ నగరాల్లో నివాస అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. ప్రస్తుత ఏడాది జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఇండ్ల అమ్మకాలు 13 శాతం పతనమై 41,871 యూనిట్లుగా నమోదయ్యాయని ప్రాప్‌ఈక్విటీ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 47,985 యూనిట్ల ప్రాపర్టీల అమ్మకాలు జరిగాయి. కేవలం కోయంబత్తూరు, డెహ్రాడూన్‌లలో మాత్రం అమ్మకాలు వరుసగా 23 శాతం, 47 శాతం చొప్పున పెరిగాయి. ఈ రిపోర్ట్ ప్రకారం.. గడిచిన క్యూ3లో నూతన నిర్మాణాలు (లాంచ్) ఏకంగా 34 శాతం క్షీణించి.. 28,980 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇవి 2023 ఇదే క్యూ3లో 43,748 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. కేవలం డెహ్రాడూన్, భోపాల్, కోయంబత్తూరు తదితర 8 నగరాల్లో మాత్రం కొత్త నిర్మాణాలు సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. దేశంలో వెస్ట్ జోన్ మొత్తం అమ్మకాలలో అహ్మదాబాద్, వడోదర, గాంధీనగర్, సూరత్, గోవా, నాసిక్, నాగ్‌పూర్‌ల వాటా 71 శాతంగా ఉంది. కనెక్టివిటీ, మౌలిక వసతుల్లో వృద్ధి ఉన్నప్పటికీ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో టైర్-30 నగరాలు విఫలమయ్యాయని ట్రూ నార్త్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సిఇఒ రోచక్ బక్షి పేర్కొన్నారు.

ఏపీలో రియాల్టీ దిగాలు..

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలు నివాస అమ్మకాల్లో వెనుకబడిపోయాయి. 2024 సెప్టెంబర్ త్రైమాసికంలో గుంటూర్‌లో విక్రయాలు 35 శాతం తగ్గి 242 యూనిట్లుగా, వైజాగ్‌లో 40 శాతం పతనమై 776 యూనిట్లుగా, విజయవాడలో 21 శాతం తగ్గి 440 యూనిట్లుగా నమోదయ్యాయి. ఆయా నగరాల్లో వరుసగా గతేడాది ఇదే త్రైమాసికంలో 371 యూనిట్లు, 1296 యూనిట్లు, 557 యూనిట్ల చొప్పున అమ్మకాలు జరిగాయి. కొత్త లాంచ్‌లు వైజాగ్‌లో 87 శాతం క్షీణించి 350 యూనిట్లుగా, విజయవాడలో 69 శాతం పతనమై 150 యూనిట్లకు పరిమితమయ్యాయి.

ఫోన్‌పే ఉద్యోగులకు ఏఐ ఎసరు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పేలో కృత్రిమ మేధా (ఏఐ) ఆ సంస్థ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపింది. ఫోన్‌పే తన కస్టమర్ సపోర్ట్ స్టాఫ్ కార్యకలాపాల్లో 90 శాతం ఎఐ చాట్‌బాట్‌లను వాడుతోంది. దీంతో గత ఐదేళ్లలో కస్టమర్ సపోర్ట్ విభాగంలో 60 శాతం మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గతంలో ఈ విభాగంలో ఉన్న 1,100 మంది ఉద్యోగులను 400కు పరిమితం చేసింది.

ఇండెల్ మనీ రూ.150 కోట్ల ఎన్‌సిడిల జారీ

న్యూఢిల్లీ : పసిడి రుణాల జారీ సంస్థ ఇండెల్ మనీ వ్యాపార వృద్ధి కోసం నాన్ కన్వర్టేబుల్ డిబెంచర్లు (ఎన్‌సిడి)లను జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. వీటితో రూ.150 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అక్టోబర్ 21 నుంచి నవంబర్ 4 వరకు ఈ ఇష్యూ తెరిచి ఉంటుందని.. ఇంతలో పరిమితి మించి సబ్‌స్క్రిప్షన్ నమోదయితే అప్పుడే ఇష్యూను ముగించనున్నట్లు తెలిపింది. ఏడాదికి 13.44 శాతం వడ్డీ రేటును అందించనున్నట్లు వెల్లడించింది. తమ పోర్టుపోలియోలో 91.82 శాతం పసిడి రుణాల వాటా ఉందని తెలిపింది.

తులం వెండి రూ.1000 పైనే..

న్యూఢిల్లీ : దేశంలో బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్నాయి. మధ్య తరగతి ప్రజలు కూడా కొనలేని స్థాయికి చేరుకున్నాయి. వరుసగా ఆరో సెషన్‌లోనూ సోమవారం పసిడి ధర ఎగిసి పడింది. గుడ్‌రిటర్న్ సమాచారం ప్రకారం.. ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై రూ.1,500 పెరిగి ధర రూ.1,01,000కి ఎగిసింది. అంటే తులం ధర రూ.1010 పలికింది. 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.220 పెరిగి 79,790కి చేరింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.73,150గా నమోదయ్యింది.

రూ.411 కోట్ల నిధుల సమీకరణలో పావ్నా ఇండస్ట్రీస్

హైదరాబాద్ : ఆటోమోటివ్ విభాగాల తయారీలో ఉన్న పావ్నా ఇండస్ట్రీస్ రూ.410.81 కోట్ల నిధుల సమీకరణకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. ఇందుకోసం వాటాదారులు, రెగ్యూలేటరీ సంస్థల ఆమోదానికి లోబడి కన్వర్టిబుల్ వారెంట్లను జారీ చేయనున్నట్లు పేర్కొంది. యునికో గ్లోబల్ అపర్చునిటీస్ ఫండ్, నెక్స్‌పాక్ట్, నార్త్‌స్టార్ అపర్చునిటీస్ ఫండ్ విసిసి, ఎమినీ గ్లోబల్ ఫండ్ పిసిసి, ఎజి డైనమిక్ ఫండ్స్ లిమిటెడ్ సంస్థల నుంచి నిధులు పొందాలని ప్రతిపాదించింది.

సర్వేశ్వర్ ఫుడ్స్ అమ్మకాల్లో వృద్ధి

ముంబయి : ఎఫ్‌ఎంసీజీ కంపెనీ సర్వేశ్వర్ ఫుడ్స్ లిమిటెడ్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 59.24 శాతం వృద్ధితో రూ.137.79 కోట్ల నికర అమ్మకాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.86.53 కోట్ల విక్రయాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1.84 కోట్లుగా ఉన్న లాభాలు.. గడిచిన త్రైమాసికంలో 30.9 శాతం పెరిగి రూ.2.41 కోట్లకు పెరిగాయి. ఏప్రిల్- సెప్టెంబర్ ప్రథమార్థంలో 28.37 శాతం వృద్ధితో రూ.504.36 కోట్ల రెవెన్యూ ప్రకటించింది.

షాప్సీలో బిగ్ దీపావళి సేల్

బెంగళూరు : కొనుగోలుదారులను ఆకర్షించడానికి బిగ్ దీపావళి విక్రయాలను ఆవిష్కరించినట్టు ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన షాప్సీ వెల్లడించింది. ప్రస్తుత పండగ సీజన్‌లో వినియోగదారుల్లో 81 శాతం పెరుగుదలతో.. లావాదేవీలు 2.8 రెట్ల వృద్ధి చోటు చేసుకుందని పేర్కొంది. విస్తరమైన పోర్టుపోలియో ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొంది.

హెచ్‌ఎంల సస్పెన్షన్ ఎత్తేయండి

- విద్యాశాఖ సంచాలకులకు టీఎస్‌జీహెచ్‌ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రధానోపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం కలిసి వినతిపత్రం సమర్పించారు. గతేడాది సెప్టెంబర్‌లో ప్రధానోపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేపట్టారని తెలిపారు. ఇందులో స్పౌజ్ పాయింట్లను వినియోగించుకున్న ప్రధానోపాధ్యాయులకు స్పౌజ్ పనిచేస్తున్న జిల్లాలోని ఖాళీలనే ఎంపిక చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించిందని పేర్కొన్నారు. ఆ జిల్లాలోని ఖాళీలను ఆప్షన్‌గా ప్రాధాన్యత ప్రకారం దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించిన తర్వాతే బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రధానోపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారనే కారణంతో వారినే పూర్తిగా బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం సమంజసంగా లేదని పేర్కొన్నారు. జనగామ జిల్లా వడ్లకొండ జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం స్వర్గం ప్రకాశంను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ ఆర్జేడీ ఈ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. ఆయన సస్పెన్షన్‌ను పున:సమీక్షించి దాన్ని తొలగించాలని కోరారు.

విచారణ, బెయిలు లేకుండా 1,500 రోజులుగా జైల్లోనే..

- పిహెచ్‌డి స్కాలర్ ఉమర్ ఖలీద్ విడుదలకు నెటిజన్ల డిమాండ్



న్యూఢిల్లీ : స్వేచ్ఛ గురించి భారతదేశ అత్యున్నత న్యాయస్థానం గొప్పగా పేర్కొన్నప్పటికీ, ఓ ప్రసంగం కారణంగా ఓ పిహెచ్‌డి స్కాలర్ ఉమర్ ఖలీద్‌ను అరెస్టు చేసి 1500 రోజులుగా బెయిలు, విచారణ లేకుండా జైలులో మగ్గేలా చేయడం చర్చనీయాంశమైంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అసమ్మతిని ఉక్కుపాదంతో అణచివేస్తూ పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తుంటే న్యాయ వ్యవస్థ ప్రేక్షక పాత్ర వహించడం సబబా? బెయిలు, విచారణ లేకుండా ఇలా ఎంతకాలం జైలులో ఉంచుతారు? అని ఉమర్ ఖలీద్ భాగస్వామి బానోజ్యోత్స్న లాహిరి ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌లో ప్రశ్నించారు. ఆమె వారానికి ఒకసారి జైలుకెళ్లి ఉమర్‌ను కలుకుసుకుంటారు. లాహిరి పెట్టిన పోస్ట్‌పై చాలా మంది నెటిజెన్లు, కార్యకర్తలు స్పందిస్తూ, ఉమర్ ఖలీద్‌ను వెంటనే విడుదల జేయాలని డిమాండ్ చేశారు. అలా డిమాండ్ చేసిన వారిలో చరిత్ర కారుడు రామచంద్ర గుహ కూడా ఉన్నారు. "1,500 రోజుల్లో, ఒకరు గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేయవచ్చు, ఉద్యోగాల్లో అనుభవం సాధించవచ్చు, యువకులు వయోజనులుగా మారవచ్చు, పరిశోధన పూర్తి చేయవచ్చు. ఒక మనిషి జీవితంలో ఇది అత్యంత విలువైన కాలం. "అని లాహిరి పేర్కొన్నారు.ఆప్‌కి చెందిన సత్యేందర్ జైన్‌కు ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసిన రోజు, బెంగాల్‌కు చెందిన బిజెపి అగ్రనేత ఒక ప్రైవేట్ సమావేశంలో బెయిల్‌పై తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చేశారు.'బెయిలు అనేది నిబంధన, మినహాయింపు కాదు . అనుబ్రత మొండల్ రెండేళ్ల కటకటాల వెనక ఉన్నారు. అతని కేసులో గరిష్టంగా ఆరేళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది. సిబిఐ సత్వరమే దర్యాప్తు పూర్తి చేసి కేసు విచారణకు వెళ్లేలా చూడాలి' అని చెప్పారు.ఒకసారి కాదు రెండు సార్లు కాదు 14 సార్లు ఉమర్‌కు బెయిలు నిరాకరించబడింది. సెషన్స్ కోర్టు రెండుసార్లు, ఢిల్లీ హైకోర్టు ఒకసారి ఆయన బెయిల్‌ను తిరస్కరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్ హయాంలోనే ఉమర్ ఖలీద్ మరియు ఎల్గార్ సెవెన్ ఇప్పటికీ జైలులో ఉన్నారు, కానీ జగ్గీ , రామ్ రహీమ్ లేరు. రామ్ రహీమ్ తరువాత చాలా సార్లు పెరోల్ ఇచ్చారు. నిజానికి అతను జైలులో లేడనే చెప్పాలి." అని అమెరికాలోని స్టీవెన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్ గౌరవ్ సబ్నిస్ పేర్కొన్నారు. ఢిల్లీ అల్లర్లలో నిందితులుగా ఉన్న ఉమర్‌కు , మరి కొందరికి బెయిల్‌ను పదే పదే నిరాకరించడం పట్ల సమాజంలోని వివిధ సెక్షన్లకు చెందిన ప్రజలు న్యాయవ్యవస్థ దష్టికి దీనిని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. "ఉమర్ ఖలీద్ విచారణ లేకుండా నాలుగేళ్లుగా జైల్లో ఉన్నాడు. అతనిపై ఆరోపణలు అసంబద్ధమైనవి. బెయిల్, జైలు మినహాయింపు అనే నిబంధన అతనికి వర్తించదు, ఎందుకంటే సహేతుకమైన సమయంలో విచారణ ముగిసే అవకాశం లేనప్పుడు వారిని జైలు నుంచి విడుదలచేయాలి. .అలా జరగకపోవడం న్యాయవ్యవస్థకు గట్టి ఎదురుదెబ్బ" అని ప్రముఖ న్యాయవాది, హక్కుల కార్యకర్త ప్రశాంత్ భూషణ్ నెల రోజుల క్రితమే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరో హక్కుల కార్యకర్త కవితా కష్ణన్, అంతకుముందు ఒక వీడియో సందేశంలో, ఉమర్‌ను బెయిల్, ట్రయల్ లేకుండా జైలులో ఏళ్ల తరబడి ఉంచడాన్ని ప్రజాస్వామ్యానికి పరీక్షగా అభివర్ణించారు. " తాము ఎవరినీ రెచ్చగొట్టలేదని, నిరసన తెలియజేయమని మాత్రమే ప్రజలను కోరామని వారు కోర్టులకు చెప్పారు ఇక్కడ ఉగ్రవాద కార్యకలాపం అన్న ప్రశ్నే రాదు. అయినప్పటికీ, వారిపై తీవ్రవాద వ్యతిరేక చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసు బనాయించారు. ఈ ఉపా కేసుల్లో బెయిల్ పొందడం దాదాపు అసాధ్యం. బెయిల్, విచారణ లేకుండా నేరం రుజువుచేయకుండా నాలుగేళ్లపాటు కటకటాల వెనక్కి ఎవరినైనా నెట్టగలగడం ఏ తరహా ప్రజాస్వామ్యం?" అని ఆమె పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే స్టాండ్-అప్ కమెడియన్ కునాల్ కమ్రా స్పందిస్తూ, "నేను హిందువుని, అందుకే మీ ముందు మాట్లాగలుగుతున్నాను. నేను ముస్లిం అయితే ఉమర్ ఖలీద్ , ఇతరుల మాదిరిగానే నేను ఫోటోలో ఉండేవాడిని, "అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

2020లో దేశ రాజధానిలో వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర రిజిస్టర్‌కు వ్యతిరేకంగా నెలల తరబడి సాగిన భారీ నిరసనల తరువాత 53 మంది మృతికి కారణమైన అల్లలర్లలో "కీలక కుట్రదారు" ఉమర్ అని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన 20 మందిలో చివరి వ్యక్తి అయనే.ఢిల్లీ పోలీసులు ఉమర్‌పై రెండు కేసులు నమోదు చేశారు, వాటిలో ఒకటి ఎత్తివేయబడింది .మరొక కేసులో అభియోగాలు ఇప్పటికీ మోపలేదు.అయినా, కోర్టులు ఆయనకు బెయిల్ నిరాకరిస్తూనే ఉన్నాయి.

ఇంజినీరింగ్ సీట్ల పెంపునకు అనుమతి

కోర్టుధిక్కరణ కేసు విచారణ వాయిదా వేసిన హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రయివేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపునకు గత నెల 9న తామిచ్చిన ఉత్తర్వుల అమలుకు ఆయా కాలేజీలకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఏఐసీటీఈ, జేఎన్టీయూ అనుమతించిన మేరకు సీట్ల పెంపుదలకు అనుమతులు ఇవ్వాలన్న ఉత్తర్వులను అమలు చేయని ప్రభుత్వం సుప్రీంకోర్టు లో అప్పీల్ దాఖలు చేస్తే కొట్టివేసింది. దీంతో పలు ప్రయివేట్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వాహకులు వేసిన కోర్టుధిక్కార పిటిషన్లపై సోమవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. కౌంటర్ వేసేందుకు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని రివ్యూ పిటిషన్ వేశామని చెప్పడంపై హైకోర్టు.. రివ్యూ పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వులు ఏమీ లేనప్పుడు కోర్టు ఆదేశాల్ని అమలు చేయాలని అధికారులకు తెలియదా అని ప్రశ్నించింది. పలు ప్రయివేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఐటీ రంగానికి చెందిన కోర్సుల్లో సీట్ల సంఖ్య పెంపునకు ఏఐసీటీఈ, జేఎన్‌టీయూలు అనుమతిచ్చినప్పటికీ ఉన్నత విద్యా శాఖ ఇవ్వలేదు. దీంతో పలు కాలేజీలు హైకోర్టును ఆశ్రయించడంతో అనుమతి ఇవ్వాలని గత నెల తొలివారంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేస్తే ఈ నెల 23వ తేదీలోగా సీట్ల పెంపు ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని చెప్పింది. అయినప్పటికీ కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం సీట్ల సంఖ్య పెంచలేదంటూ పలు ఇంజినీరింగ్ కాలేజీలు హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్లు వేశాయి. వీటిని సోమవారం విచారణ సందర్భంగా ప్రభుత్వం గడువు కోరడాన్ని తప్పుపట్టింది. తిరిగి కౌన్సెలింగ్ కష్టమని చెప్పడంపై స్పందిస్తూ, తాము కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని, కోర్టుధిక్కార పిటిషన్‌ను విచారిస్తున్నామని చెప్పింది. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేషం, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన. ఉన్నత విద్యా శాఖ కన్వీనర్ శ్రీరాం వెంకటేష్, ఎంసెట్ కన్వీనర్ డీన్ కుమార్లకు కోర్టుధిక్కార నోటీసులను జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది.

జప్తు చేసిన ఆస్తులను యథాతథంగా ఉంచాలి : రైస్‌మిల్లర్లకు హైకోర్టు ఆదేశం

ప్రభుత్వం అప్పగించిన ధాన్యం ఆధారంగా కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పౌరసరఫరాల శాఖకు అప్పగించకపోవడంతో రెవెన్యూ రికవరీ చట్టం కింద జప్తు చేసిన ఆస్తులను యథాతథంగా ఉంచాలని రైస్ మిల్లర్లకు హైకోర్టు ఆదేశించింది. ఆర్‌ఆర్ యాక్ట్ కింద ముందుగా రైస్ మిల్లర్లకు నోటీసులు జారీ చేశారో లేదో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇచ్చిందీ లేనిదీ చెప్పాలని తెలిపింది. ప్రభుత్వం అప్పగించిన ధాన్యం ఆధారంగా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను పౌరసరఫరాల సంస్థకు అప్పగించనందుకు మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడాన్ని గతంలో సింగిల్ జడ్జి రద్దు చేశారు. దీనిని సవాల్ చేస్తూ ప్రభుత్వం వేసిన అప్పీల్‌ను చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణ వచ్చే నెల మొదటి వారానికి వాయిదా పడింది.

4కి మార్గదర్శి కేసు వాయిదా

మార్గదర్శి కేసుపై సోమవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపింది. న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ సందర్భంగా, మార్గదర్శి చందాదారుల వివరాలు ఇవ్వడానికి మీకున్న ఇబ్బంది ఏమిటని ఆ సంస్థను ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని మార్గదర్శి తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రాను అడిగింది. సుప్రీంకోర్టు చందాదారుల వివరాలు ఇవ్వాలని చెప్పలేదని లూథ్రా చెప్పారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కోరిన ఫార్మెట్‌లో వివరాలు ఉన్నాయని, పెన్ డ్రైవ్ తరహాలో ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో ఉండవల్లి కోరుతున్నారని చెప్పారు. ఈ విధంగా చందాదారుల వివరాలు ఇవ్వడానికి ఇబ్బందేంటో చెప్పాలని మార్గదర్శిని ఆదేశించింది. పిటిషనర్ నుంచి సూచనలు తీసుకుని చేస్తామని లూథ్రా చెప్పారు. పిటిషనర్ -2 రామోజీరావు మరణించారని చెప్పారు. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద మార్గదర్శి అధినేత రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును ఉమ్మడి హైకోర్టు 2018, డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. దీనిపై ఉండవల్లి సుప్రీంకోర్టులో సవాలు చేసియడంతో హైకోర్టు తీర్పును 2024, ఏప్రిల్ 9న కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు విచారణ చేయాలని ఆదేశించింది. దీంతో జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. వర్చువల్‌గా ఉండవల్లి హాజరయ్యారు.

సాయిబాబా పోరాటాలు కొనసాగుతాయి

- ఎన్‌పీఆర్‌డీ సంస్మరణ సభ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సాయిబాబా పోరాటాలు కొనసాగుతాయని, అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. మానవ హక్కుల కోసం మాట్లాడిన ప్రొఫెసర్ సాయిబాబాను మోడీ ప్రభుత్వం పదేండ్లపాటు జైల్లో పెట్టి చిత్రహింసలకు గురి చేసిందన్నారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభ సోమవారం హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మానవ హక్కుల కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు, సాయిబాబా సహచరులు ఆయనను స్మరించుకున్నారు. ఆయన చేపట్టిన పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. ఎన్‌పీఆర్‌డీ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ మాట్లాడుతూ దేశంలో లెక్కలేనన్ని విభిన్న సంస్థలున్నప్పటికీ సాయిబాబాకు అండగా నిలిచేది ఎన్‌పీఆర్‌డీ ఒక్కటేనని గుర్తు చేశారు. సాయిబాబాతో భావోద్వేగ, వ్యక్తిగత సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సాయిబాబా లాంటి అనేక మందిని కేంద్రం ఇప్పటికీ తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టిందని అన్నారు. 90 శాతం వికలాంగుడైన సాయిబాబా మనస్సును జైలు నిర్వీర్యం చేయకపోయినా, ఆయన శరీరం తట్టుకోలేకపోయిందని సామాజిక కార్యకర్త హర్ష్ మందార్ వీడియో సందేశంలో తెలిపారు. సాయిబాబా వికలాంగుల ప్రజాసేవకుడని ప్రొఫెసర్ అమిత దండా గుర్తు చేసుకున్నారు. వికలాంగులను ఒంటరిగా కారాగారంలో బంధించడం దారుణమని, సాయిబాబా ఆలోచనగా కొనసాగుతుందని తెలిపారు. ఆయన సహచరురాలు, ఢిల్లీ యూనివర్శిటీ టీచర్స్ యూనియన్ (డీయూటీయూ) మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ నందితా నారాయణ్ మాట్లాడుతూ ఆయన నివాసంపై దాడి చేసి అరెస్టు చేయడం చట్టబద్ధమైనది కాదని, ఇది రాజ్యం చేసిన హత్య అని అన్నారు. సాయిబాబాతో పాటు ఏ ఒక్క వికలాంగుల సమస్యలను యూనివర్శిటీ, అడ్మినిస్ట్రేషన్‌లు వినడం లేదని ప్రొఫెసర్ వికాస్ గుప్తా అన్నారు. యూనివర్శిటీ ఆయనకు ర్యాంప్ కూడా లేని ఇల్లు ఇచ్చిందని, సాయిబాబా కేసులో కోర్టులు కూడా అసాధారణ వైఫల్యం చెందాయని తెలిపారు. మానవ అంతరిక్ష కార్యకర్త జాన్‌దయాల్ కూడా సాయిబాబా లేవనెత్తిన ఆలోచనలు ఔచిత్యాన్ని పొందుతున్నాయని గుర్తు చేశారు. సభకు సీమా కాకర్ల అధ్యక్షత వహించారు. అలాగే సాయిబాబా రచించిన పద్యాన్ని ఆలపించారు.

రిసాయా అకాడమీతో
ఎన్‌ఏయూ భాగస్వామ్యం

- ఆధునిక టెక్నాలజీలో నైపుణ్యాల పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని భారతీయ విద్యార్థులకు టెక్నాలజీ రంగంలో ప్రత్యేక విద్యను అందించడానికి రిసాయా అకాడమీతో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు నార్తర్న్ అరిజోనా యూనివర్సిటీ (ఎన్‌ఏయూ) తెలిపింది. ఇందుకోసం ఐదు వారాల సమ్మర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది. ఈ భాగస్వామ్యానికి మల్లారెడ్డి విశ్వవిద్యాలయంతో చేసుకున్న అవగాహన ఒప్పందంతో మరింత మంది విద్యార్థుల రాక పెరగనుందని పేర్కొంది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్‌ఏయూ గ్లోబల్ అఫైర్స్ అసోసియేట్ వైస్ ప్రోవోస్ట్ సీజర్ ఫ్లోర్స్, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వీఎస్‌కె రెడ్డి మాట్లాడుతూ ఈ ఇంటెన్సివ్ సమ్మర్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్లాక్‌చైన్, ఏఐ, ఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) వంటి రంగాల్లో డిగ్రీలు అభ్యసిస్తున్న విద్యార్థులకు క్లిష్టమైన నైపుణ్యాలను పొందడానికి వీలుందన్నారు. ఈ భాగస్వామ్యం భారతీయ విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో ప్రత్యేకమైన అవకాశాలను ఇస్తుందని రిసాయా అకాడమీ సీఈవో రితీష్ బాబు తెలిపారు.

ఈ సమావేశంలో మల్లారెడ్డి యూనివర్శిటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ శాంతి కుమార్, ఎన్‌ఏయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

వియత్నాం నూతన అధ్యక్షుడిగా
లుయాంగ్ క్యూంగ్ ఎన్నిక



హనోయి: వియత్నాం సోషలిస్టు రిపబ్లిక్ కొత్త అధ్యక్షుడిగా లుయాంగ్ క్యూంగ్ ఎన్నికయ్యారు. పార్ల మెంటు సభ్యులు సోమవారం నాడిక్కడ సమావేశమై ఆయనను ఈ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 67 ఏళ్ల లుయాంగ్ ప్రస్తుతం పార్టీ కేంద్ర కమిటీ, సెక్రటేరియట్‌లో శాశ్వత సభ్యుడిగాను, పొలిట్‌బ్యూరో సభ్యుడిగాను ఉన్నారు. ఆయన 1975లో సైన్యంలో చేరారు. 2011 జనరల్ డిపార్టు మెంట్ ఆఫ్ పొలిటిక్స్ వైస్ సడైరక్టర్‌గాను, 2016లో డైరక్టర్‌గాను బాధ్యతలు నిర్వహించారు. . ఈ ఏడాది మేలో త్రువాంగ్ తి మై స్థానంలో ఆయనను కేంద్ర కమిటీ సెక్రటేరియస్ శాశ్వత సభ్యునిగా పొలిట్‌బ్యూరో నియమించింది.. అధ్యక్షుడి హోదాలో ఆయన తొలి ప్రసంగం చేస్తూ, దేశ ప్రజలకు, రాజ్యాంగానికి కచ్చితంగా విధేయతతో ఉంటానని, రాజ్యాంగంలో పేర్కొన్న విధులను, పార్టీ , ప్రభుత్వం, ప్రజలు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడానికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎప్‌సెట్ బైపీసీ కౌన్సెలింగ్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

- 25 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైపీసీ విద్యార్థులకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు గడువు మంగళవారంతో ముగియనుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 23 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదేనెల 25 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. ఇప్పటి వరకు 15,510 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని పేర్కొన్నారు. 202 మంది అభ్యర్థులు 9,376 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఈనెల 28న తొలివిడత కౌన్సెలింగ్‌లో అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

కోచింగ్ సెంటర్లలో ఒకే రకమైన ప్రమాణాలు వుండాలి : సుప్రీం

న్యూఢిల్లీ : కోచింగ్ సెంటర్లలో చదివే విద్యార్థుల భద్రత, రక్షణలకు హామీ కల్పించేందుకు వీలుగా సాధ్యమైనంతవరకు ఒకే రకమైన ప్రమాణాలు వుండాలని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. దేశ రాజధానిలో జులై 27న ఒకక భవనం బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు రావడంతో ఆ భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు మరణించారు. అందుకు సంబంధించిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ విచారించి పై వ్యాఖ్యలు చేసింది. ఇటువంటి సంఘటనలప్పుడు దృష్టి కేంద్రీకరించాల్సిన అంశాల గురించి ఈ విషయంలో అమికస్‌క్యూరీగా వున్న సిద్ధార్థ దావె సుప్రీంకోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు రక్షణ, ఫీజుల క్రమబద్ధీకరణ, విద్యార్థులు, తరగతి గదుల నిష్పత్తి, వైద్య సదుపాయాలు, మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్ వంటి అంశాలపై కూడా దృష్టి సారించాల్సి వుందని కోర్టుకు సూచించారు. ఈ విషయంలో అన్ని రాష్ట్రాలను కూడా కక్షిదారులుగా చేర్చాలని సూచించారు. ఏడు రాష్ట్రాల్లో కోచింగ్ సంస్థలకు సంబంధించిన చట్టాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. దూరదృష్టితో వ్యవహరించాల్సి వుందని అమికస్ క్యూరీ దావె సూచించగా, ఆ పర్యవేక్షణ కూడా శాశ్వత పద్ధతిలో వుండాల్సి వుందని బెంచ్ స్పష్టం చేసింది. ఈ అంశంపై ఒకే రకమైన ప్రమాణాలు పాటించాల్సిన అవసరం వుందని పేర్కొంది. కోచింగ్ సంస్థలకు ముఖ్యంగా దేశ రాజధాని ప్రాంతంలో వున్న వాటికి ఒక సమగ్ర విధానం రూపొందించాల్సిన ఆవశ్యకతపై అమికస్ క్యూరీకి సూచనలు, సలహాలు అందజేయాల్సిందిగా సంబంధిత అధికారులను కోరింది. రెండు వారాల తర్వాత విచారణను వాయిదా వేసింది.

జూడాల డిమాండ్లు, విద్యార్థి సంఘాల ఎన్నికలపై
నేడు 3గంటలకల్లా తెలియజేస్తాం

- బెంగాల్ ప్రభుత్వ హామీ

న్యూఢిల్లీ : కోల్‌కతా డాక్టర్‌పై లైంగికదాడి, హత్యకేసులో నెలకొన్న ప్రతిష్టంభనను పరిష్కరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, జూనియర్ డాక్టర్ల మధ్య సోమవారం సాయంత్రం చర్చలు జరిగాయి. దాదాపు రెండు గంటల పాటు ఈ చర్చలు కొనసాగాయి. హత్యకు గురైన డాక్టర్‌కు న్యాయం జరగాలని, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎన్.ఎస్.నిగమ్‌ను తొలగించడం, ఆరోగ్య రంగంలో వున్న సిబ్బందికి రక్షణ, భద్రత కల్పించడంతో సహా ఇతర అంశాలన్నీ పరిష్కారమయ్యే వరకు తాము నిరశన కొనసాగిస్తామని డాక్టర్లు స్పష్టం చేశారు. ఈ అంశాలతో ప్రభుత్వానికి వారు ఇప్పటికే పది పాయింట్లతో కూడిన డిమాండ్ల పత్రాన్ని అందజేశారు. వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధించిన డిమాండ్లను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టాస్క్ ఫోర్స్ హామీ ఇచ్చినట్లు సీనియర్ డాక్టర్ దేవశిష్ హల్దార్ చెప్పారు.

ఆర్‌డీఏ, ఎంబీబీఎస్ విద్యార్థి సంఘాలను చట్టబద్ధమైన సంస్థలుగా రూపొందించాలని, వాటికి ఎన్నికైన ప్రతినిధులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీల్లోకి తీసుకోవాలని సూచించారు. జూనియర్ డాక్టర్ల డిమాండ్లు, వైద్య కళాశాల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించేందుకు కాలపరిమితితోసహా మార్గదర్శకాలను మంగళవారం మధ్యాహ్నం 3గంటల కల్లా రాతపూర్వకంగా తెలియచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలియచేసింది.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ గురించి తమకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదని జూనియర్ డాక్టర్లు తెలిపారు. ఆ టాస్క్ ఫోర్స్‌లో జూనియర్ డాక్టర్లు ఎవరూ లేరని వారు ఫిర్యాదు చేశారు. పదిమంది జూనియర్ డాక్టర్లను రొటేషన్ పద్ధతిలో నియమించాలని సూచించారు. కాగా ఇప్పటివరకు చేసిన నిరసనలు చాలని, ఇక దీక్ష విరమించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. మెడికల్ కాలేజీల్లో పరీక్షలు పారదర్శకంగా జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రుల్లో బెదిరింపు సంస్కృతిని ఖండించారు. ప్రభుత్వానికి కనీసం తెలియచేయకుండా 74మంది విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఇది సరైన చర్యేనా అని మమత ఆర్‌జి కార్ ఆస్పత్రి ప్రిన్సిపల్‌ను ప్రశ్నించారు. డాక్టర్లు, నర్సులు, గ్రూప్ డి సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డాక్టర్లు కోరారు.

కేంద్రం హామీతో సోనమ్ వాంగ్‌చుక్‌దీక్ష విరమణ

- డిసెంబరు 3న చర్చలు

న్యూఢిల్లీ : లడఖ్ ప్రాంతానికి చెందిన పౌర సమాజ నాయకులతో చర్చలు పునరుద్ధరించేందుకు కేంద్రం హామీ ఇవ్వడంతో సామాజిక ఉద్యమ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ప్రభృతులు సోమవారం నిరశన విరమించారు. 16రోజుల పాటు వారు తమ డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్ష జరిపారు. డిసెంబరు 3న హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. నాలుగు పాయింట్ల ఎజెండా నుండి తాము వెనక్కు మళ్లడం లేదని, వాటిపైనే చర్చలు జరుగుతాయని కొత్త డిమాండ్లు పెట్టలేదని, వున్న వాటిని తొలలించలేదని లడఖ్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు, లేహ్ అపెక్స్ బాడీ (ఎల్‌ఎబీ) కో కన్వీనర్ చెరింగ్ డోర్జే లక్రాకక్ చెప్పారు. కమిటీలో ఆయన కూడా వున్నారు. లేహ్, కార్గిల్ సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య డిసెంబరులో చర్చలు పునరుద్ధరించబడతాయని కేంద్ర హోం శాఖ జాయింట్ కార్యదర్శి తమకు లేఖ అందజేశారని వాంగ్‌చుక్ తెలిపారు. దీక్ష విరమణ అనంతరం ఆయన మాట్లాడారు. ఈ చర్చలు జరిగేలా చూడాలన్నదే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఉభయ పక్షాలు సానుకూల ధోరణితో, సుహృద్భావంతో చర్చలు జరపగలవని భావిస్తున్నట్లు చెప్పారు. మరోసారి దీక్షకు కూర్చునే పరిస్థితి వస్తుందని భావించడం లేదని వ్యాఖ్యానించారు. లడఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ సోనమ్ వాంగ్‌చుక్ గత నెల 1వ తేదీన లేహ్ నుండి ఢిల్లీ చలో పాదయాత్రను చేపట్టారు. పోలీసులు ఢిల్లీ సరిహద్దుల్లో వారి యాత్రను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జంతర్ మంతర్ వద్ద దీక్షకు అనుమతినివ్వకపోవడంతో చివరకు తాముంటున్న లడఖ్ భవన్ వద్దనే 18మందితో కలిసి నిరాహార దీక్షకు దిగారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులు

- జార్ఖండ్ వాసి ఆత్మహత్య

నవతెలంగాణ-మహదేవపూర్

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలైన జార్ఖండ్ వాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో సోమవారం జరిగింది. ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లాకు చెందిన విష్ణు మహతు(20) కూలి పనులు చేసుకుంటూ మహదేవపూర్‌లో అద్దె ఇంట్లో మిత్రులతో కలిసి నివసిస్తున్నాడు. అతను ఆన్‌లైన్ బెట్టింగుల్లో పాల్గొనేవాడు. ఈ క్రమంలో అప్పుల్లో కూరుకుపోయాడు. ఈనెల 18న ఎవరికీ చెప్పకుండా గది నుంచి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత అతని స్నేహితులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మహదేవపూర్ శివారు అయ్యప్ప టెంపుల్ పక్కన అటవీ ప్రాంతంలో విష్ణు మహతు ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనబడ్డాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వల్ల అప్పులు ఎక్కువై.. వాటిని ఎలా తీర్చాలో తెలియక, జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు మిత్రులు పోలీసులకు తెలిపారు.